ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

ప్రకాశం జిల్లా వార్తలు

గురువారం 5, సెప్టెంబరు 2024


కొత్తపట్నం బస్టాండ్ వద్ద కుండీలో పేరుకుపోయిన చెత్త



కదలం.. మెదలం

నగరంలో చీపురు పట్టేవారు కరువు

- విజయవాడకు వెళ్లిన 300 మంది శానిటరీ వర్కర్లు
- కొందరు ఆర్డరు లేకుండా అటెండర్లుగా ఆఫీసులో తిష్ట
- వారికి అధికారులు, వైసీపీ కార్పొరేటర్ల ఆశీస్సులు
- ఎక్కడి చెత్త అక్కడే.. మెరుగుపడని పారిశుధ్యం
- పూడుకుపోయిన డ్రైనేజీలు.. రోడ్లపైనే మురుగు
- వర్షాలతో వెంటాడుతున్న వ్యాధుల భయం
- ఆందోళనలో ప్రజలు
- పూర్తిస్థాయి విధుల్లో ఉంటేనే ప్రజారోగ్యానికి భరోసా

'ఒంగోలులో పారిశుధ్యం సరిగా లేదు. ఎవరు ఎక్కడ పనిచేస్తున్నారో తెలియదు. ఇకపై నిర్లక్ష్యం వీడాలి. అప్రమత్తంగా ఉండాలి. వర్షాలు కురుస్తున్నాయి. వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంది. ప్రతి ఒక్కరూ అలసత్వం వీడి పనిచేయాలి. పారిశుధ్యం మెరుగుపరచాలి. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలి. లేకుంటే చర్యలకు సిఫార్సు చేస్తా.

- బుధవారం కార్పొరేషన్ అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఎమ్మెల్యే దామచర్ల

'పారిశుధ్యం మెరుగుకే మొదటి ప్రాధాన్యం. నగరం పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలకు మంచి సేవలు అందించినట్లు. అందుకే ఒంగోలును అందమైన నగరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తా. వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకుంటాం. డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరుస్తాం. కార్మికులంతా పనిలో ఉండాల్సిందే.'

- ఇటీవల నగర కమిషనర్ వెంకటేశ్వరరావు, ఇటీవల బాధ్యతలు స్వీకరించినప్పుడు చెప్పిన మాటలు

నగరంలో చీపురు పట్టేవారు కరువయ్యారు. ఎక్కడి చెత్త అక్కడే ఉంటోంది. ఎటుచూసినా పరిస్థితి అధ్వానంగా కనిపిస్తోంది. దీనికితోడు వరద బాధిత ప్రాంతాల్లో యుద్ధప్రాతిపదికన పారిశుధ్యం మెరుగు కోసం 300 మందికిపైనే కార్మికులను విజయవాడకు పంపారు. పేరుకు కార్పొరేషన్ అయినా, హోదాకు అనుగుణంగా పనిచేసేవారు కరువయ్యారు. కొందరు కార్మికులుగా చేరి, ఆతర్వాత పెత్తనం చేయడానికి మేస్త్రీలుగా అవతారమెత్తారు. మరికొందరు పనిచేయకుండా ముఖంచాటేస్తూ, పలుకుబడితో కార్యాలయంలో ఆర్డర్ లేకుండానే అనధికార అటెండర్లుగా కొనసాగుతున్నారు. దీంతో నగరంలో పారిశుధ్యం పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

ఒంగోలు (కార్పొరేషన్), సెప్టెంబరు 4 : నగరంలో పారిశుధ్యం పడకేసింది. వర్షాల సీజన్‌లో అస్తవ్యస్తంగా తయారవుతోంది. నగరపాలక సంస్థ యంత్రాంగం అప్రమత్తంగా ఉండి యుద్ధప్రాతిపదికన మెరుగైన చర్యలు చేపట్టాల్సి ఉంది. అయితే గత ప్రభుత్వ నీలినీడలు కార్పొరేషన్‌ను వెంటాడుతూనే ఉనా యి. సిబ్బందిని ఇంకా ఆ జాడ్యం వీడలేదు. ఇటీవల భారీవర్షాల కారణంగా నీటమునిగిన విజయవాడలో సహాయక చర్యల కోసం ఒంగోలు నుంచి 300 మంది వరకు పారిశుధ్య కార్మికులు, ముప్పై మంది శానిటరీ సెక్రటరీలు, మరికొందరు ఇన్‌స్పెక్టర్లు వెళ్లారు. అయితే


కబాడిపాలెం మెయిన్ రోడ్డులో పరిస్థితి ఇదీ

పనిచేసే వారు తక్కువ.. పెత్తనం చేసేవారు ఎక్కువ

ఒక్కో సెక్షన్‌లో కనీసం ముగ్గురు అటెండర్లు ఉండటం ఏ ప్రభుత్వ కార్యాలయంలో కనిపించని పరిస్థితి. అది ఒక్క ఒంగోలు కార్పొరేషన్ కార్యాలయంలోనే ప్రత్యేకంగా కనిపిస్తోంది. గత వైసీపీ ప్రభుత్వ పాలనలో రాజకీయ పలుకుబడితో కార్మికులుగా చేరిన కొందరు ఆపార్టీ కార్యకర్తలు చీపురు పట్టుకోరు. ఇదిలా ఉంచితే కార్యాలయంలో కూడా వీరు చేసే పని పెద్దగా ఏమీ లేదని అధికారులే వెల్లడించడం గమనార్హం. 'వచ్చామా.. పోయామా..' అన్నట్లు ఉంది అనధికార అటెండర్లు వ్యవహారశైలి. వీరి తీరుతో కార్పొరేషన్ కార్యాలయంలో పనిచేసే వారు తక్కువ, పెత్తనం చేసేవారు ఎక్కువ అనే పరిస్థితి నెలకొంది. కాగా గత వైసీపీ పాలనలో ఆడిందే ఆట పాడిందే పాటగా కొనసాగిన పారిశుధ్య కార్మికులు.. ప్రభుత్వం మారినా తీరు మాత్రం మార్చుకోలేదు. వీరికి కార్యాలయంలోని కొందరు అధికారుల ఆశీస్సులతోపాటు, వైసీపీ కార్పొరేటర్ల అండదండలు పుష్కలంగానే ఉన్నాయి. అందుకే ఆర్డరు కాపీలు కూడా లేకుండా రెండేళ్లుగా వారిని కార్యాలయంలో కుర్చీ వేసి మరీ మర్యాద చేసి నెలనెలా జీతాలు ఇస్తున్నారు.

ఉన్న అరకొర సిబ్బందిలో కొందరు అధికారుల ఇళ్లల్లో పనిచేస్తుండగా, మరికొందరు మేయర్ గృహంలో కార్మికులుగా కొనసాగుతున్నారు. దీంతో ప్రస్తుతం వీధులు ఊడ్చేవారు కరువయ్యారు. గత రెండు రోజులుగా నగరంలో చెత్త ఎత్తేవారు కనిపించకపోవడంతో కుప్పలు పేరుకుపోతున్నాయి. మరోవైపు కురుస్తున్న వర్షాల కారణంగా వ్యాధుల భయం వెంటాడుతోంది. గత ప్రభుత్వ హయాంలో కార్మికులుగా చేరిన కొందరు కార్యాలయం నుంచి కాలు బయటపెట్టం అంటూ తిష్ట వేసి కూర్చున్నారు. కార్యాలయంలో అవసరం లేకపోయినా అనధికారికంగా కొనసాగుతున్న వీరిని అధికారులు తిరిగి పనిలోకి పంపితే తప్ప, నగరంలో కొంతమేర అయినా పారిశుధ్యం మెరుగుపడే పరిస్థితి కనిపించడం లేదు.

రెండేళ్లుగా కార్పొరేషన్ కార్యాలయంలో తిష్ట

బాలినేని శ్రీనివాసరెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో తన అనుచరుల కోసం ఇష్టారాజ్యంగా ఉద్యోగాలకు సిఫారసులు చేశారు. ఆప్కాస్ కింద 56మందికి ఉద్యోగాలు ఇచ్చారు. శానిటరీ, ఇంజనీరింగ్ విభాగాల్లో పనిచేస్తున్న వీరికి నెలనెలా రూ.21వేల వేతనం చెల్లిస్తున్నారు. మరోవైపు కొవిడ్ సిబ్బంది కింద మరో 100 మందికిపైగా ఉద్యోగాలు ఇవ్వగా నెలకు ఒక్కొక్కరికి రూ.18వేలు చెల్లిస్తున్నారు. అయితే వీరిలో ముప్పై మంది మాత్రం పనిలోకి వెళుతుండగా, మిగిలిన వారు నేటికీ వైసీపీ కార్పొరేటర్ల అండదండలతో కార్యాలయం వదిలివెళ్లడం లేదు. ఇదిలా ఉంచితే వీరు కార్యాలయంలో కూడా చీపురు పట్టరు. ఫైళ్లు అందించరు. వారిని చూసి రెగ్యులర్ ఉద్యోగులు సైతం విస్తుపోతున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో

వెంటాడుతున్న వైరల్ ఫీవర్లు

వర్షాకాలం అంటేనే వ్యాధుల భయం వెంటాడుతోంది. ఖాళీస్థలాలు, నీటి కుంటలలోకి నీరు చేరి జ్వరాలు ప్రబలుతున్నాయి. దోమల వ్యాప్తికి అనుకూలమైన వాతావరణం కావడంతో డెంగ్యూ, మలేరియా తదితర విషజ్వరాలు ఇప్పటికే అధికమయ్యాయి. ఆస్పత్రులు జ్వరబాధితులతో కిటకిటలాడుతున్నాయి. ఇలాంటి సమయంలో డివిజన్లలో తిరిగి నీటి నిల్వలు లేకుండా, ఇళ్ల మధ్య మురుగు కనిపించకుండా, ఖాళీ స్థలాల్లో చెత్తచెదారం లేకుండా చూడాలి. ఒంగోలు కార్పొరేషన్ పరిధిలో అలాంటి వాతావరణం కనిపించడం లేదు.

పారిశుధ్యం మెరుగుపడేనా?

ఒకవైపు నగరంలో పారిశుధ్య సమస్య వేధిస్తుండగా, అందుకు అనుగుణంగా కార్మికులు లేరు. వైసీపీ అండదండలతో పలు సెక్షన్లలో పెత్తనం చేస్తున్న 19మంది కార్మికులను తిరిగి చెత్త సేకరణకు పంపాలి. అలాగే ఆప్కాస్ కింద ఉద్యోగాలు పొంది, కార్యాలయానికి రాని వారిని తొలగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ముఖ్యంగా అకౌంట్ సెక్షన్‌లో ముగ్గురు ఉద్యోగులు ఉండగా, వారికి ఒకొక్కరికి ఒక్కో అటెండర్ ఉండటం చూస్తుంటే వైసీపీ కార్పొరేటర్ల పెత్తనం కార్పొరేషన్‌లో ఏస్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

పారిశుధ్య కార్మికులుగా ఉద్యోగాలు పొందిన వారికి కార్పొరేషన్ నిధుల నుంచి టంచన్‌గా జీతాలు చెల్లిస్తున్నారు. కానీ టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చినా వీరిని మాత్రం కార్యాలయం నుంచి కదలించేవారు లేరని చెప్పుకుంటున్నారు. దీంతో నిత్యం పనిచేసే వారిపైనే భారం పడుతోంది. ఇప్పటికైనా పారిశుధ్య విభాగంలో పూర్తిస్థాయిలో కార్మికులను విధుల్లోకి పంపితేనే నగరంలో పారిశుధ్యం మెరుగుపడదని నగరవాసులు అభిప్రాయపడుతున్నారు.


విజయవాడలో సహాయక చర్యలను అధికారులతో కలిసి పర్యవేక్షిస్తున్న మంత్రి స్వామి

సిబ్బంది.. సామగ్రి

వరద సహాయక చర్యలకు జిల్లా నుంచి విద్యుత్, పారిశుధ్య కార్మికుల తరలింపు

బాధితులకు ఉపశమన కార్యక్రమాల్లో మంత్రి డాక్టర్ స్వామి

ఒంగోలు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : వరద బారిన పడిన విజయవాడ ప్రజలకు తొలి రెండు రోజులు పెద్దఎత్తున భోజనం, మంచినీరు, ఇతర ఆహార పదార్థాలను విభిన్నవర్గాల వారు పంపించగా బుధవారం మనుషులను, యంత్రాలను తరలించారు. ప్రస్తుతం అక్కడ సహాయక చర్యల కోసం ప్రభుత్వపరంగా అవసరమైన సిబ్బంది, ఇతర పరికరాలను పంపిస్తున్నారు. విజయవాడను ముంచెత్తిన ఇటు కృష్ణమ్మ, అటు బుడమేరు కాస్తంత శాంతించాయి. వరద ఉధృతి తగ్గడంతో అక్కడి ప్రజలు బయటకు వస్తున్నారు. అక్కడ ఆహారం కన్నా ఇతర సహాయక చర్యలు అవసరం అధికంగా ఉంది. ప్రధానంగా విజయవాడను మురుగు ముంచెత్తింది. వరదతో కొట్టుకొచ్చిన మట్టి, ఇసుక ఎక్కడికక్కడ మేట వేశాయి. దీంతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది మరోవైపు విద్యుత్ వ్యవస్థ పూర్తిగా దెబ్బతింది. ఈనేపథ్యంలో అక్కడ తక్షణం పారిశుధ్య చర్యలు, విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనుల కోసం సంబంధిత సిబ్బంది, యంత్రాలు, ఇతర వస్తువులు భారీగా అవసరమయ్యాయి. దీంతో పొరుగు జిల్లాల నుంచి సిబ్బంది, మెటీరియల్‌ను పంపాలని ప్రభుత్వం ఆదేశించింది. తదనుగుణంగా జిల్లా నుంచి బుధవారం పారిశుధ్య కార్మికులు, విద్యుత్ సిబ్బంది, ట్రాక్టర్లు, జనరేటర్లు, ఇతర సామగ్రిని తరలించారు. వరద సహాయక చర్యల కోసం ఒంగోలు కార్పొరేషన్ నుంచి మంగళవారం 150 మందిని, బుధవారం మరో 150 మందిని పంపారు.


విజయవాడకు వెళ్తున్న ట్రాక్టర్‌లను పరిశీలిస్తున్న కలెక్టర్ అన్సారియా

అలాగే విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనుల కోసం 120 మంది వివిధ స్థాయి అధికారులు, సిబ్బందిని ఇక్కడి విద్యుత్ శాఖ నుంచి పంపారు. మరో 50మందిని కూడా పంపించే ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే 125 కేవీ సామర్థ్యం ఉన్న రెండు జనరేటర్లను బుధవారం ఎస్ఈ సత్యనారాయణ పంపారు.

సహాయక చర్యల్లో మంత్రి

జిల్లాకు చెందిన రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి విజయవాడలోని వరద బాధిత ప్రజల సహాయక చర్యలలో ప్రత్యక్షంగా పాల్గొంటున్నారు. అక్కడ నీట మునిగిన జక్కంపూడి, వైఎస్ కాలనీలకు ట్రాక్టర్‌లో వెళ్లి బాధితులను పరామర్శించారు. స్థానిక అధికారులు, సిబ్బందితో కలిసి సహాయక చర్యలను పర్యవేక్షించారు. ఆ సందర్భంగా ఒక అపార్ట్‌మెంట్‌లో చిక్కుకున్న ఇద్దరు చిన్నారులను ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది సాయంతో రక్షించే చర్యలు తీసుకున్నారు. జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడుతో కలిసి ఆటోలో వెళ్లి బుడమేరుకు గండ్లుపడిన ప్రాంతాలను స్వామి పరిశీలించారు.

జిల్లా నుంచి ట్రాక్టర్లు

విజయవాడలో సహాయక చర్యల కోసం జిల్లా నుంచి 50 ట్రాక్టర్లను పంపాలని ప్రభుత్వం ఆదేశించడంతో యజమానులతో కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడారు. తక్షణం 13 ట్రాక్టర్లను పంపారు. మిగిలిన వాటిని కూడా పంపనున్నట్లు తెలిపారు. సాంఘిక సంక్షేమ శాఖ అధికారుల విజ్ఞప్తి మేరకు నగరంలోని క్విస్, పేస్ ఇంజనీరింగ్ కళాశాలల యాజమాన్యాలు పదివేల పులిహోర పొట్లాలను విజయవాడ వరద బాధితుల కోసం తరలించాయి. స్థానిక లాయర్‌పేటలోని షిర్డీసాయి కల్చరల్ మిషన్ తరఫున ఆహార పదార్థాలు, మంచి నీటి బాటిళ్లను పంపారు. జిల్లాలోని పలు ప్రాంతాల వారు వరద బాధితుల సహాయార్థం ప్రభుత్వం ప్రకటించిన బ్యాంకు అకౌంట్లకు నగదు కూడా జమ చేస్తున్నారు. ఒంగోలు నుంచి కలెక్టర్ నేతృత్వంలో లక్షా 50వేల ఆహార పొట్లాలు, వాటర్ బాటిళ్లు, బిస్కెట్ ప్యాకెట్లను పంపారు.


విద్యుత్, జనరేటర్లను జెండా ఊపి పంపుతున్న ఎస్.ఈ. సత్యనారాయణ



- రూ.6.72 కోట్లతో ప్రక్రియ ప్రారంభం
- అక్టోబరు 2 నాటికి పూర్తికి ఆదేశం

సొసైటీల కంప్యూటరీకరణ

ఒంగోలు (విద్య), సెప్టెంబరు 4 : గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు వ్యవసాయ రుణాలు, ఎరువులు ఇతర ఉపకరణాలు అందించేందుకు ఏర్పాటు చేసిన ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల కంప్యూటరీకరణకు కేంద్రప్రభుత్వం శ్రీకారం చుట్టింది. సొసైటీల్లో అక్రమాలకు అవకాశం లేకుండా లావాదేవీలు పారదర్శకంగా నిర్వహించేందుకు ఈ ప్రక్రియను చేపట్టింది. జిల్లాలోని సహకార కేంద్ర బ్యాంకు (పీడీసీసీ) పరిధిలోని 172 సొసైటీలు కంప్యూటరీకరణ పనులు ప్రారంభించాయి. మొత్తం రూ.6.72 కోట్లతో ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని సొసైటీలను కంప్యూటరీకరిస్తున్నారు. అక్టోబరు 2 గాంధీ జయంతి నాటికి జిల్లాలో ఆ ప్రక్రియ పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించడంతో అందుకు అనుగుణంగా చర్యలు చేపట్టారు.

సొసైటీకి రూ.3.91 లక్షలు

కంప్యూటరీకరణ కోసం ఒక్కో సొసైటీకి ప్రభుత్వం రూ.3.91లక్షలు వెచ్చిస్తోంది. కంప్యూటర్, యూపీఎస్, వెబ్‌కామ్, బయోమెట్రిక్ స్కానర్, పాస్‌బుక్ ప్రింటర్, విద్యుత్ సౌకర్యం కోసం రూ.1.22 లక్షలు కేటాయించింది. డేటా నిర్వహణ, సైబర్ సెక్యూరిటీకి రూ.72వేలు, కంప్యూటరీకరణపై సొసైటీ సిబ్బంది శిక్షణ కోసం రూ.10వేలు, డేటా ప్రిపరేషన్, డిజిటలైజేషన్, వెరిఫికేషన్‌కు రూ.1.10 లక్షలు, నిర్వహణ, హ్యాండ్లింగ్ సపోర్టుకు రూ.76వేలు వెచ్చించనున్నారు.

జగనన్న కాలనీల్లో అక్రమాలు

- నిబంధనలకు విరుద్ధంగా ఇళ్ల స్థలాలు పొందిన వైసీపీ నాయకులు
- విక్రయించుకొని సొమ్ము చేసుకున్న వైనం
- ఒకే ప్లాట్‌లో ఇద్దరికి పొజిషన్ చూపిన రెవెన్యూ అధికారులు
- పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించిన బాధితులు

దొనకొండ, సెప్టెంబరు 4 : ఇళ్లు లేని పేదలందరికీ స్థలం ఇస్తామని గత వైసీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన జగనన్న లేఅవుట్‌లలో అక్రమాలు చోటుచేసుకున్నాయి. నివేశన స్థల పట్టాల పంపిణీలో ఆపార్టీకి చెందిన స్థానిక నాయకులు అధికారులను లోబర్చుకొని నిబంధనలకు విరుద్ధంగా పొజిషన్ సర్టిఫికెట్లు పొందారు. అనంతరం వాటిని విక్రయించుకొని సొమ్ము చేసుకున్నారు. రెవెన్యూ అధికారులు ఒకే నంబర్‌తో ఇద్దరికి పొజిషన్ సర్టిఫికెట్లు ఇవ్వడం వివాదాస్పదమైంది.

ఒక్కో నాయకుడికి రెండేసి ప్లాట్లు

దొనకొండ సమీపంలోని ఇండ్లచెరువు గ్రామం మీదుగా మార్కాపురం వెళ్లే ప్రధాన రహదారి పక్కన 233/8 సర్వేనంబర్‌లో దాదాపు 70 ప్లాట్లతో జగనన్న లేఅవుట్‌ను ఏర్పాటు చేశారు. నిబంధనలకు అనుగుణంగా ఆన్‌లైన్ విధానం ద్వారా సగం మంది లబ్ధిదారులకు ఇళ్లపట్టాలు మంజూరు చేశారు. మిగిలిన వాటిలో స్థానిక వైసీపీ నాయకులు నిబంధనలకు విరుద్ధంగా మాన్యువల్ పద్ధతిలో బినామీ పేర్లతో ఒక్కొక్కరు రెండేసి ప్లాట్లకు పొజిషన్ సర్టిఫికెట్లు పొందినట్లు సమాచారం. అక్రమమార్గంలో ఇళ్ల పట్టాలు పొందిన వైసీపీ నాయకులు గుట్టుచప్పుడు కాకుండా ఒక్కో ప్లాటు రూ.75 వేల నుంచి రూ.లక్ష వరకు బహిరంగ మార్కెట్‌లో దర్జాగా విక్రయించుకొని సొమ్ము చేసుకున్నారని తెలుస్తోంది.

తహసీల్దార్ కార్యాలయం చుట్టూ బాధితుల ప్రదక్షిణలు

రుద్రసముద్రంలో సమస్య పరిష్కారం కోసం బాధితులు నెలల తరబడి తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా ఫలితం లేకుండా పోయింది. గతంలో పనిచేసిన రెవెన్యూ అధికారులు అక్రమాలకు అండగా నిలవగా, ప్రస్తుత అధికారులు చోద్యంచూస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా సమగ్ర విచారణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.


రుద్రసముద్రంలోని జగనన్న లేఅవుట్‌లో వివాదాస్పదమైన ఇళ్ల ప్లాట్లు

రుద్రసముద్రంలో..

మండలంలోని రుద్రసముద్రం గ్రామంలో మార్కాపురం వెళ్లే ప్రధాన రహదారి పక్కన సర్వేనెంబర్ 182లో దాదాపు 114 ప్లాట్లతో జగనన్న లేఅవుట్ ఏర్పాటు చేశారు. అందులో దాదాపు 95 మందికి పైగా అర్హులైన లబ్ధిదారులకు నిబంధనల మేరకు ఆన్‌లైన్ విధానంలో ఇళ్ల పట్టాలు ఇచ్చారు. మిగిలిన ప్లాట్లను స్థానిక వైసీపీ నాయకులు అప్పటి రెవెన్యూ అధికారులపై ఒత్తిడి పెట్టించి నిబంధనలకు విరుద్ధంగా మాన్యువల్ పద్ధతిలో పొందారు. ఆతర్వాత వచ్చిన రెవెన్యూ అధికారులు ప్రజాప్రతినిధుల సిఫార్సు మేరకు ఇద్దరు ముగ్గురు అర్హులైన లబ్ధిదారులకు రికార్డుపరంగా ప్లాట్ నంబర్లు వేసి ఇళ్ల స్థలాలకు పొజిషన్ సర్టిఫికెట్లు మంజూరు చేశారు. ముందుగా వైసీపీ నాయకులకు ఇచ్చిన స్థలాల నంబర్‌లు ఆన్‌లైన్‌లో లేకపోవడంతో వాటినే మరికొందరికి కేటాయించారు. లబ్ధిదారులు ప్లాట్లలో ఇళ్ల నిర్మాణం చేపట్టబోగా అదే ప్లాట్ నంబర్లతో పొజిషన్ సర్టిఫికెట్లు పొందిన వైసీపీ నాయకులు వారిపై దౌర్జన్యం చేసి నిర్మాణం చేపట్టకుండా అడ్డగించారు. దీంతో బాధితులు పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించారు. పోలీసులు విచారించి ఇద్దరి వద్ద ఉన్న ఇళ్ల ప్లాట్ల పొజిషన్ సర్టిఫికెట్లలో ఏది నకిలీ, ఏది ఒరిజినల్ అన్నది ధ్రువీకరించాలని తహసీల్దార్ కార్యాలయానికి పంపారు.



నేడు గురుపూజోత్సవం

- ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 62 మందికి అవార్డుల ప్రదానం

ఒంగోలు(విద్య), సెప్టెంబరు 4 : ఆచార్య సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో గురుపూజోత్సవాన్ని గురువారం కలెక్టరేట్‌లోని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి స్థానిక శాసనసభ్యుడు దామచర్ల జనార్దన్ అధ్యక్షత వహిస్తారు. సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మేయర్ గంగాడ సుజాత ముఖ్యఅతిథులుగా పాల్గొంటారు. విశిష్ట అతిథులుగా రాజ్యసభ, లోక్‌సభ సభ్యులు, గౌరవ అతిథులుగా శాసనమండలి సభ్యులు, శాసనసభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులుగా కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎస్పీ దామోద్‌తోపాటు పలువురు జిల్లా శాఖ అధికారులు హాజరవుతారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 62మందికి అవార్డులు ప్రదానం చేస్తారు.

దొడ్డవరం సొసైటీపై విచారణకు ఆదేశం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఒంగోలు (విద్య), సెప్టెంబరు 4 : మద్దిపాడు మండలం దొడ్డవరం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో జరిగిన నిధుల కుంభకోణం ఆరోపణలను నిగ్గుతేల్చేందుకు విచారణకు ఆదేశించినట్లు జిల్లా సహకారాధికారి బి.శ్రీనివాసరెడ్డి తెలిపారు. 'దొడ్డవరం సొసైటీలో కుంభకోణం' శీర్షికన బుధవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి ఆయన వివరణ ఇచ్చారు. రెండు నెలల్లోపు విచారణ పూర్తి చేసి సమగ్ర నివేదిక సమర్పించాలని విచారణాధికారిని ఆదేశించినట్లు తెలిపారు. అది అందిన వెంటనే ఆంధ్రప్రదేశ్ సహకార సంఘాల చట్టం 1964 ప్రకారం ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిపై సివిల్, క్రిమినల్, క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని డీసీవో తెలిపారు.

అలసత్వం వీడి అప్రమత్తంగా ఉండండి

నగరంలో పారిశుధ్యంపై దృష్టి పెట్టాలి

ఎమ్మెల్యే దామచర్ల ఆదేశం

తుఫాన్ హెచ్చరికతో కార్పొరేషన్, వైద్యఆరోగ్యశాఖ అధికారులతో సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

ఒంగోలు(కార్పొరేషన్), సెప్టెంబరు 4: "మరో రెండు రోజులు జిల్లాకు తుఫాన్ ముప్పు పొంచి ఉందనే సమాచారం ఉంది. వర్షాలు ఉధృతంగా కురిసి వరదలు వచ్చే అవకాశం ఉంది. ఇప్పటికే వర్షాలు కారణంగా విజయవాడ విలవిలలాడుతుంది. ఇలాంటి పరిస్థితి ఇక్కడ రాకుండా నివారించేందుకు అప్రమత్తంగా ఉండాలి. ఇప్పటికైనా అధికారులు, సిబ్బంది అలసత్వం వీడి పని చేయాలి" అని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ఆదేశించారు. బుధవారం ఒంగోలులోని ఎన్టీఆర్‌భవన్‌లో నగరపాలక సంస్థ, వైద్యఆరోగ్యశాఖ అధికారులతో ప్రత్యేకసమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నగరంలో పారిశుధ్యం అధ్వానంగా ఉందన్నారు. ఎవరు ఎక్కడ పని చేస్తున్నారో సంబంధిత అధికారుకు అయినా తెలుసా అని ప్రశ్నించారు. ప్రజల నుంచి పారిశుధ్యంపై ఫిర్యాదులు వస్తున్నాయని, ఇకపై పనితీరు మార్చుకోవాలని ఆయన స్పష్టం చేశారు. గత ఐదురోజులుగా విజయవాడ పరిస్థితి ఎలా ఉందో చూస్తున్నామని, అలాంటి పరిస్థితులు రాకుండా ఇక్కడ ముందస్తు చర్యలు చేపట్టాని, ఇందుకోసం సిబ్బంది మొత్తం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. కాలువల్లో పూడికతీత పనులు చేపట్టడంతోపాటు, రోడ్లపై చెత్తాచెదారం లేకుండా చూడాలన్నారు. ఎంత పెద్ద వర్షం కురిసినా రోడ్లపై నీరు నిలబడకుండా చేయాలని, ఇందుకోసం డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపరచాలని సూచించారు. అలాగే పనిచేయని కార్మికులపై సీరియస్‌గా యాక్షన్ తీసుకుంటామని, డివిజన్ల వారీగా కార్మికులు ప్రతి ఒక్కరూ పనిచేయాల్సిందేనని తెలిపారు. అలాగే సచివాలయ సెక్రటరీలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, అందరూ ప్రతిరోజు పరిశీలించాలని, పనిచేయని వారిపై కచ్చితంగా చర్యలు తీసుకోవాల్సిందేనని, పారిశుధ్య పనులు చేయకుండా కార్పొరేషన్‌లో ఉంటూ విధులకు గైర్హాజరవుతున్న వారిని, పనిలోకి పంపించాలని అధికారులను దామచర్ల ఆదేశించారు.

పోతురాజుకాలువ పనుల పునఃప్రారంభానికి చర్యలు

నగరంలోని పోతురాజుకాలువ ఆధునికీకరణకు నాటి తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో పనులు చేపట్టామని, ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ పట్టించుకోకపోవడంతోపాటు ఇద్దరు కాంట్రాక్టర్లను మార్చడం, పనులు పూర్తి చేయలేకపోవంతో ఆ పనులు రద్దు అయ్యాయని ఎమ్మెల్యే దామచర్ల తెలిపారు. మరలా పనులు పునః ప్రారంభించేందుకు చర్యలు వేగవంతం చేస్తామన్నారు. అలాగే ప్రతిరోజు బ్లీచింగ్, ఖాళీ స్థలాల్లో నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో ఆయిల్ స్ప్రే, ఫాగింగ్ చేయాలని, సీజనల్ వ్యాధులు రాకుండా చూడాలని ఆదేశించారు. ప్రతి డివిజన్‌లో ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ నిర్వహిచాలని, కార్పొరేషన్ సిబ్బందితోపాటు, వైద్య ఆరోగ్యశాఖ ఆశా వర్కర్లు, అలాగే పార్టీ శ్రేణులు, డివిజన్ నాయకులు, క్లస్టర్ ఇన్‌చార్జులు భాగస్వాములు కావాలని ఆదేశించారు.

ముప్పు వాటిల్లకముందే మేల్కోవాలి

విపత్తులు ప్రభావంతో నష్టం వాటిల్లకముందే ముందస్తు జాగ్రత్తలతో వరద ప్రమాదాన్ని నివారించవచ్చని ఎమ్మెల్యే దామచర్ల తెలిపారు. తాను కూడా నగరంలో పర్యటిస్తానని, ప్రజారోగ్యం మెరుగుకోసం ప్రతి ఒక్కరు కష్టపడి పనిచేయాలని ఆదేశించారు. కమిషనర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఇప్పటికే కార్పొరేషన్‌లో ప్రత్యేక హెల్ప్‌సెంటర్‌తోపాటు, టోల్ ఫ్రీ నెంబరు ఏర్పాటు చేశామన్నారు. ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేస్తేనే, సీజనల్ వ్యాధుల నియంత్రణ, తుఫాన్ ముప్పు నుంచి నగరాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. సమావేశంలో ఇన్‌చార్జి వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పద్మజ, మేయర్ సుజాత, డిప్యూటీ మేయర్ వేమూరి వెంకటసూర్యనారాయణ, టీడీపీ కార్పొరేటర్ దాచర్ల వెంకటరమణయ్య, మాజీ మునిసిపల్ చైర్మన్ మంత్రి శ్రీనివాసరావు, ఎంహెచ్‌వో మనోహర్, శానిటరీ సూపర్‌వైజర్ పిచ్చయ్య, ఇన్‌స్పెక్టర్ షేక్ బాబ్జి, ఆశావర్కర్లు, సచివాలయ సెక్రటరీలు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

వరద బాధితులకు అండగా కొండపి జనసేన

టంగుటూరు, సెప్టెంబరు 4 : విజయవాడ వరద బాధితులకు అండగా మేము సైతం అంటూ కొండపి నియోజకవర్గ జనసేన పార్టీ ముందుకొచ్చింది. 150 కుటుంబాలకు ఆహారం, నిత్యావసరాలు పంపిణీ చేయాలని తీర్మానించుకుంది. నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త కనపర్తి మనోజ్‌కుమార్ ఆధ్వర్యంలో పార్టీ ఆరు మండలాల అధ్యక్షులు, నాయకులు, వీర మహిళలు, దాతల సహకారంతో వాటిని అందించాలని నిర్ణయించారు. ఆదివారం ఉదయం 8గంటలకు టంగుటూరు నుంచి ఆహారం, నిత్యావసరాలను విజయవాడకు తరలించనున్నారు. సాయం చేయాలనుకున్న వారు సెల్‌నెంబర్ 98481 60828ను సంప్రదించాలని మనోజ్‌కుమార్ కోరారు.

రీజనల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారిగా కులశేఖర్

ఒంగోలు(క్రైం), సెప్టెంబరు4: రీజనల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారిగా అదనపు ఎస్పీ జె.కులశేఖర్‌ను నియమిస్తూ బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో విజిలెన్స్ అధికారులకు స్థానచలనం కల్పిస్తూ ఆదేశాలు ఇచ్చారు. ఈ మేరకు ప్రస్తుతం ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహిస్తున్న గుంటూరు రీజనల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కె.ఈశ్వరరావును హెడ్ క్వార్టర్‌లో రిపోర్టు చేయాల్సిందిగా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. గురువారం కులశేఖర్ బాధ్యతలు తీసుకునే అవకాశం ఉంది.

మోదీ స్ఫూర్తితో సభ్యత్వాన్ని తీసుకోవాలి

● కిసాన్‌మోర్చా జాతీయ ఉపాధ్యక్షుడు సురేష్‌రెడ్డి



మాట్లాడుతున్న సురేష్‌రెడ్డి, పక్కన శివారెడ్డి, నాయకులు

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 4: దేశ అభివృద్ధికి నిరంతరం పనిచేస్తున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ భారతీయ జనతా పార్టీ సభ్యత్వాన్ని తీసుకోవాలని కిసాన్‌మోర్చా జాతీయ ఉపాధ్యక్షుడు సురేష్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం ఒంగోలులో అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి వైసీ.యోగయ్యయాదవ్ ఆధ్వర్యంలో చేపట్టిన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత అన్నివర్గాల ప్రజలకు భరోసా కల్పించేలా ప్రధాని నరేంద్రమోదీ పాలన కొనసాగుతోందన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలను అందించడంతో పాటు ప్రపంచంలోనే దేశాన్ని అగ్రగామిగా నిలిపేందుకు మోదీ చేస్తున్న కృషి అభినందించారు. దేశంలో అత్యధిక సభ్యత్వ నమోదు కలిగిన పార్టీ బీజేపీ అని అన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు పీవీ.శివారెడ్డి మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాతనే ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు లభించిందని తెలిపారు. యోగయ్యయాదవ్ మాట్లాడుతూ ఒంగోలు నియోజకవర్గంలో ప్రతి ఒక్కరూ బీజేపీ సభ్యత్వాన్ని స్వీకరించాలని కోరారు. బీజేపీతోనే అన్నివర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పీవీ.కృష్ణారెడ్డి, బొద్దులూరి ఆంజనేయులు, ఈదర మోహన్, కొమ్మి నరసింహారావు, రాయపాటి అజయ్‌కుమార్, గుర్రం రంగనాథ్, కాపూరి వాసు, సీతారామయ్య, గుర్రం సత్యనారాయణ, కాట్రగడ్డ శ్రీనివాసరావు, సంజీవ్‌కుమార్, కె.రవి తదితరులు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్లు నిబంధనలు పాటించకుంటే చర్యలు

● ఎస్పీ దామోదర్



సదస్సులో మాట్లాడుతున్న ఎస్పీ దామోదర్, హాజరైన ఆటోడ్రైవర్లు

ఒంగోలు(క్రైం), సెప్టెంబరు 4: ఆటోడ్రైవర్లు విధిగా నిబంధనలు పాటించాలని, లేకుంటే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ ఏఆర్.దామోదర్ హెచ్చరించారు. బుధవారం ఒంగోలులోని పోలీసు కల్యాణమండపంలో ఆటో డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతు ఆటోడ్రైవర్లు ఆత్మగౌరవం, సేవా దృక్పథంతో పనిచేయాలని హితవు పలికారు. నిబంధనలు పాటిస్తూ ప్రజలతో గౌరవభావంతో ఉండాలని సూచించారు. అసాంఘిక శక్తుల విషయంలో కూడా అప్రమత్తంగా ఉండాలని కోరారు. రహదారి నిబంధనలు పాటించడం ద్వారా ట్రాఫిక్‌కు అంతరాయం ఉండదని, ప్రమాదాలు తగ్గించేందుకు తోడ్పాటు ఇచ్చిన వారు అవుతారని పేర్కొన్నారు. డ్రైవర్ల వద్ద తప్పనిసరిగా సంబంధిత పత్రాలు ఉండాలని ఎస్పీ స్పష్టం చేశారు. ఫేక్ ఇన్సూరెన్సులు వల్ల తమ కుటుంబాలు నష్టపోవడమే కాకుండా సమాజానికి నష్టం వాటిల్లుతుందన్నారు. మహిళలు, వృద్ధులు, చిన్నపిల్లలు పట్ల మర్యాదగా వ్యవహరించాలని సూచించారు. ఆటోడ్రైవర్లకు స్టాండ్లు ఏర్పాటు, వారికి సంక్షేమ కార్యక్రమాలను చూసే బాధ్యత పోలీసుశాఖ తీసుకుంటుందని ఎస్పీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, ఎస్పీ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్రరావు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వై.పాండురంగారావు, సీఐలు అజయ్‌కుమార్, వై.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గ్రానైట్ ఫ్యాక్టరీలు గాడిలో పడేలా ప్రతిపాదనలు

అసోసియేషన్ అత్యవసర సమావేశంలో నాయకులు తీర్మానం



సమావేశంలో పాల్గొన్న ఫ్యాక్టరీ ఓనర్ల అసోసియేషన్ సభ్యులు

చీమకుర్తి, సెప్టెంబరు 4 : సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న గ్రానైట్ ఫ్యాక్టరీలు తిరిగి గాడిలో పడేందుకు అసోసియేషన్ నాయకులు పలు ప్రతిపాదనలు రూపొందించారు. బుధవారం మండలంలోని రామతీర్థం వద్ద ఉన్న వీటీసీలో చీమకుర్తి, బూదవాడ, ఆర్‌ఎల్.పురం, ఏలూరురోడ్ గ్రానైట్ ఫ్యాక్టరీ ఓనర్ల అసోసియేషన్ నాయకులు అత్యవసర సమావేశాన్ని యర్రగుంట్ల శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పాల్గొన్న నాయకులు పరిశ్రమల సంక్షోభం, ఆయా పరిస్థితులు నుంచి బయటపడే మార్గాలపై చర్చించారు. పలు ప్రతిపాదనలను ఏకగ్రీవంగా తీర్మానించారు. త్వరలో బయ్యర్లతో సమావేశం ఏర్పాటు చేసి గిట్టుబాటు ధరలపై చర్చించాలని, ప్రతి ఆదివారం ఉత్పత్తి ప్రక్రియను నిలిపివేయాలని, ఫ్యాక్టరీల్లో వేస్ట్ మెటీరియల్‌ని ఇక నుంచి ఎడ్జ్ కటింగ్ మిషన్ వారికి ఇవ్వకుండా ఎవరి ఫ్యాక్టరీల్లో వారే కటింగ్ చేసుకొని అమ్ముకోవాలని నిర్ణయించారు. అంతేగాకుండా శ్లాబ్ సిస్టంలోకి రానివారు త్వరగా రావాలని తీర్మానించారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్ష, కార్యదర్శులు కాట్రగడ్డ రమణయ్య, నూకల సురేంద్ర, అహ్మద్‌బాష, గోగినేని నాగయ్య, చిన్నపురెడ్డి మస్తాన్‌రెడ్డి, కందిమళ్ల గంగాధరరావు, లగడపాటి శ్రీనివాస్, మేదరమెట్ల భీమన్న, సత్యం, మలినేని వెంకటేశ్వర్లు, రాము, సురేష్, సుబ్బారావు, ఆర్కే పాల్గొన్నారు.

వరి సాగుకు సాగర్‌నీటిని ఇవ్వాలి

● రైతు సంఘం జిల్లా కార్యదర్శి వెంకట్రావు



సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్రావు

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 4 : నాగార్జునసాగర్ కుడికాలువకు పూర్తి స్థాయిలో వరిసాగుకు నీటిని విడుదల చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి పమిడి వెంకట్రావు కోరారు. ఒంగోలులోని సంఘ కార్యాలయంలో బుధవారం జిల్లా అధ్యక్షుడు జె.జయంతిబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వెంకట్రావు మాట్లాడారు. జిల్లాకు సాగునీరు ఆరుతడులుకు మాత్రమే ఇస్తామని, వరిసాగుకుకు ఇవ్వబోమని చెప్పడం దారుణంగా ఉందన్నారు. ప్రస్తుతం డ్యామ్‌లో పుష్కలంగా ఉన్నందున వరిసాగుకు అవసరమైన మేరకు నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. డ్యామ్‌ల నుంచి సముద్రానికి నీరు వృథాగా పోతున్నా వరిసాగుకు ఇవ్వమని అధికార యంత్రాంగం ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. సాగర్‌లో 540 అడుగుల నీరు ఉన్నప్పుడే వరిసాగుకు నీరు ఇచ్చిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. అందువల్ల వరిసాగుకు నీటిని ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాబు, బి.శ్రీనివాసరావు, చిన్నపురెడ్డి, తిరుపతిరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, కె.వెంకటేశ్వర్లు, బ్రహ్మయ్య, కరిచేటి హనుమంతరావు పాల్గొన్నారు.

ఆక్రమణలపై చర్యలు : కమిషనర్



ఆక్రమణల తొలగింపుతో విశాలంగా మారిన రోడ్డు



అడ్డంకులను తొలగిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఒంగోలు(క్రైం), సెప్టెంబరు 4: ఒంగోలు నగరం కొత్తకూరగాయల మార్కెట్‌లో రోడ్ల ఆక్రమణలను తొలగించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చేసినట్లు కార్పొరేషన్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆంధ్రజ్యోతిలో మేమింతే శీర్షికన ప్రచురితమైన కథనానికి కార్పొరేషన్, ట్రాఫిక్ పోలీసు అధికారులు స్పందించారు. మార్కెట్‌లోని రోడ్ల పైన ఉన్న ఆక్రమణలు తొలగించి వాహన రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చేశారు. దీంతో రోడ్లు విశాలంగా మారడంతో పాటు ట్రాఫిక్ అంతరాయం లేకపోవడంతో ప్రజలు ఆంధ్రజ్యోతికి కృతజ్ఞతలు తెలిపారు. మరలా రోడ్లపై ఎలాంటి ఆక్రమణలకు పాల్పడితే నోటీసులు ఇచ్చి శాఖపరమైన చర్యలు తీసుకుంటామని కార్పొరేషన్ అధికారులు హెచ్చరించారు.

అవీ..ఇవీ..

విజయవాడకు జిల్లా విద్యుత్ సిబ్బంది : ఎస్ఈ

ఒంగోలు(క్రైం), సెప్టెంబరు4: విజయవాడ ముంపు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ కోసం జిల్లా నుంచి 150మంది సిబ్బందిని తరలించినట్లు ఎస్ఈ కేవీజీ.సత్యనారాయణ బుధవారం తెలిపారు. జిల్లా నుంచి 100 హైడ్రోజన్ బల్బులు, 125 కేవీ జనరేటర్లు పంపించామని, ఇంకా అవసరం అయితే విద్యుత్ శాఖ మంత్రి ఆదేశాల మేరకు సిబ్బందిని పంపిస్తామని ఆయన పేర్కొన్నారు.

రౌడీషీటర్‌పై కేసు నమోదు

ఒంగోలు(క్రైం), సెప్టెంబరు 4: ఒంగోలులో రౌడీషీటర్ పోలీస్‌స్టేషన్‌పైకి ఎక్కి హల్‌చల్ చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. స్థానిక కబాడీపాలెంనకు చెందిన అజయ్‌కుమార్ అనేక కేసులలో నిందితుడు. అతనిపై రౌడీషీట్ ఉంది. అయితే మద్యం తాగి స్థానికులను ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. దీంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు స్టేషన్‌కు తీసుకురాగా మద్యం మత్తులో ఉన్న అజయ్‌కుమార్ హల్‌చల్ చేశాడు. స్టేషన్ భవనంపై పైకెక్కి ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించాడు. దీంతో టూటౌన్ సీఐ శ్రీనివాసరావు, అజయ్‌కుమార్‌ను ఆసుపత్రికి తరలించారు. మద్యం సేవించినట్లు సర్టిఫికెట్ తీసుకొని అతడిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

సంచీ కోసి రూ.20 వేలు చోరీ

ఒంగోలు(క్రైం), సెప్టెంబరు4: ఆటోలో ప్రయాణిస్తున్న వృద్ధురాలి వద్ద ఉన్న సంచీని గుర్తుతెలియని వ్యక్తులు కోసి రూ.20వేలు అపహరించారు. ఈ సంఘటన బుధవారం ఉదయం ఒంగోలు నగరంలో జరిగింది. వెంగముక్కపాలెంనకు చెందిన పొత్తూరి రోశమ్మ ఒంగోలులోని జయరామ్ హాలు సెంటర్‌లోని స్టేట్‌బ్యాంక్ వద్దకు వెళ్లేందుకు ఆటో ఎక్కింది. ఆమెను ఆటో డ్రైవర్ పార్వతమ్మ గుడి వద్ద దించాడు. అక్కడ నుంచి నడుచుకుంటూ జయరామ్ హాలు సెంటర్ వద్దకు వెళ్ళింది. అక్కడ బ్యాంకులోకి వెళ్లిన రోశమ్మ నగదు కోసం సంచీ చూడగా కట్ చేసి ఉంది. అందులోని నగదు అపహరణకు గురైంది. దీంతో బాధితురాలు వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు విచారిస్తున్నారు.

11న ఒంగోలులో ర్యాలీ



మాట్లాడుతున్న చెన్నయ్య

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 4: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఒంగోలులో ఈనెల 11న జరిగే నిరసన ర్యాలీని విజయవంతం చేయాలని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు బీళ్ల చెన్నయ్య కోరారు. స్థానిక అంబేడ్కర్‌భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితికి మద్దతుగా బీఎస్పీ అధ్యక్షురాలు మాయావతి, మాజీ ఎంపీ హర్షకుమార్‌ల ఆదేశాల మేరకు ఈ నిరసన ర్యాలీని చేపడుతున్నట్లు తెలిపారు. ఈ ర్యాలీలో జిల్లాలోని మాలలందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

జాతీయ ఉపకారవేతన పరీక్ష దరఖాస్తుల గడువు పెంపు

ఒంగోలు(విద్య), సెప్టెంబరు 4 : జాతీయ ఉపకారవేతన పరీక్ష (నేషనల్ మెన్స్ కామ్ మెరిట్ స్కాలర్‌షిప్' దరఖాస్తుల గడువును ఈనెల 17వ తేదీ వరకు పొడిగించినట్లు ప్రభుత్వ పరీక్షల కమిషనర్ డి.దేవానంద్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, జిల్లాపరిషత్, మునిసిపల్, ఎయిడెడ్, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలు, వసతి సౌకర్యం లేని ఏపీ ఆదర్శ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న వారు, కుటుంబ వార్షిక ఆదాయం రూ.3.5 లక్షల లోపు ఉన్న విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. విద్యార్థి ఆధార్ కార్డులో నమోదై ఉన్న విధంగానే విద్యార్థి పేరు, పుట్టిన తేదీ, తండ్రి పేరు నమోదు చేయాలన్నారు. దరఖాస్తుకు ఎటువంటి ధృవీకరణ పత్రాలు అవసరం లేదని, డిసెంబరు 8న పరీక్ష జరిగే నాటికి అవసరమైన ధృవీకరణపత్రాలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. పరీక్ష రుసుం ఓసీ, బీసీ విద్యార్థులకు రూ.100, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.50 చెల్లించాలి. ఈనెల 10నుంచి పరీక్ష ఫీజును ఆన్‌లైన్ అప్లికేషన్‌లో ఇచ్చిన ఎస్‌బీఐ ద్వారా మాత్రమే చెల్లించాలని ఆయన కోరారు.

సీపీఎం ఆధ్వర్యంలో విరాళాల సేకరణ

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 4: విజయవాడ వరద బాధితుల సహాయార్థం సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం ఒంగోలులో విరాళాలు సేకరించారు. స్థానిక ట్రంకురోడ్డు, గాంధీరోడ్డు, బండ్లమిట్ట తదితర ప్రాంతాల్లో విరాళాలు సేకరించినట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో జి.రమేష్, శ్రీనివాసరావు, కంకణాల ఆంజనేయులు, కె.రమాదేవి, ఎస్‌డీ.హుస్సేన్, బాలకోటయ్య పాల్గొన్నారు.

ధర్నాను జయప్రదం చేయాలి



ఇలవరలో మాట్లాడుతున్న వీరారెడ్డి

కొండపి, సెప్టెంబరు 4 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 6న సీపీఐ ఆధ్వర్యంలో ఒంగోలులోని కలెక్టరేట్ వద్ద తలపెట్టిన ధర్నాను జయప్రదం చేయాలని ఆ పార్టీ కొండపి నియోజకవర్గ కార్యదర్శి కె.వీరారెడ్డి పిలుపునిచ్చారు. జనసమీకరణలో భాగంగా ఆయన బుధవారం జరుగుమల్లి, కొండపి మండలాల్లోని గ్రామాల్లో పర్యటించారు. ఈసందర్భంగా ఇలవర (నేతివారిపాలెం)లోని బస్టాండ్ సెంటర్‌లో జరిగిన సభలో మాట్లాడారు. అర్హులైన వారికి వెంటనే రాష్ట్ర ప్రభుత్వం రేషన్ కార్డులు, పింఛన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. రేషన్ దుకాణాల ద్వారా పేదలకు నిత్యావసరాలైన 14రకాల వస్తువులను పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి ఆర్.లక్ష్మి, నాయకులు ప్రభాకర్, బాలాజీ, స్వాములు, అంకయ్య, అంజయ్య, సాయి, ప్రసాద్ పాల్గొన్నారు.

పోషకాహారంతో ఆరోగ్యం



అవగాహన కలిగిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

కొండపి, సెప్టెంబరు 4 : పోషకాహారం తీసుకోవడం వలన ఆరోగ్యంగా ఉండొచ్చని సీడీపీవో మాధవీలత సూచించారు. పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా కొండపి పంచాయతీలోని దాసరెడ్డిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో తల్లులు, గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఇస్తున్న పాలు, గుడ్లు, ఇతర పోషకాహారాన్ని క్రమం తప్పకుండా తీసుకుని ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ విక్టోరియారాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు ఆదిలక్ష్మి, ప్రమీల పాల్గొన్నారు.

రికార్డులు సక్రమంగా నిర్వహించాలి : డీఎం

మద్దిపాడు, సెప్టెంబరు 4: ఎరువులకు సంబంధించిన రికార్డులు సక్రమంగా నిర్వహించాలని మార్క్‌ఫెడ్ డీఎం హరికృష్ణ పేర్కొన్నారు. బుధవారం వెల్లంపల్లి, దొడ్డవరం గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో ఉన్న ఎరువులు, గోదాములను ఆయన పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారులు కిషోర్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

14న జాతీయ లోక్‌అదాలత్

మద్దిపాడు, సెప్టెంబరు 4: కేసుల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఎస్సై శివరామయ్య తెలిపారు. బుధవారం మద్దిపాడు పోలీస్‌స్టేషన్‌లో జాతీయ లోక్ అదాలత్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 14వ తేదీ జరిగే లోక్ అదాలత్ కార్యక్రమంలో కేసులను కక్షిదారులు రాజీమార్గం ద్వారా పరిష్కరించుకోవచ్చన్నారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విరాళాల సేకరణ

చీమకుర్తి, సెప్టెంబరు 4 : విజయవాడ వరద బాధితుల సహాయార్థం మండల ఎస్ఎఫ్ఐ కమిటీ ఆధ్వర్యంలో విరాళాల సేకరణను బుధవారం చేపట్టారు. చీమకుర్తిలోని కళాశాల, పాఠశాలల్లో విద్యార్థుల నుంచి విరాళాలను సేకరించారు. జిల్లా ఉపాధ్యక్షుడు దేవరాజు, నాగుల్‌మీరా, జగదీష్, శ్రీకాంత్, నవజీవన్ పాల్గొన్నారు. అలాగే సీపీఎం నాయకులు కూడా విరాళాలు సేకరించారు.

ఉద్యాన పంటలకు 'ఉపాధి' ఆసరా

మద్దిపాడు, సెప్టెంబరు 4: ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయడం రైతులకు వరంగా మారింది. ఉద్యాన పంటలు సాగుకు మొక్కలను పంపిణీ చేయడంతోపాటు మూడేళ్ల పాటు వాటి పెంపకానికి నిధులు ఇస్తున్నారు. మొత్తం 25 రకాల పూలు, పండ్ల తోటలను సాగు చేసుకోవచ్చు. ఐదు ఎకరాల లోపు భూమి ఉన్న రైతులు అర్హులు. జాబ్‌కార్డ్ ఉన్న రైతులు ఇతర పత్రాలతో మద్దిపాడులోని ఏపీవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని, సాగు చేసే పంటను బట్టి రూ.50 వేల నుంచి రూ.2.50లక్షల వరకు నిధులు ఇస్తారని జేఈ కిరణ్ ఓ ప్రకటనలో తెలిపారు.

వరద బాధితులకు 'పేస్' బాసట



బస్సులో ఆహారాన్ని తరలిస్తున్న కళాశాల నిర్వాహకులు

ఒంగోలు(విద్య), సెప్టెంబరు 4 : విజయవాడలోని వరద బాధితులకు ఒంగోలులోని పేస్ ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యం బాసటగా నిలిచింది. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్ మాట్లాడుతూ వరద బాధితులకు 5వేల మందికి సరిపడా పులిహోరా ప్యాకెట్లు, వాటర్ బాటిళ్లను సిద్ధం చేసి తమ కళాశాల బస్సుల్లో విజయవాడకు పంపించినట్లు తెలిపారు. బుధవారం సాయంత్రం ఈ ఆహార ప్యాకెట్లను తమ కళాశాల అధ్యాపకులు, ఎన్‌సీసీ విద్యార్థులు వరద బాధితులకు పంపిణీ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జీవీకే.మూర్తి, డీన్ సీవీసుబ్బారావు, రూప అక్కేష్, విభాగాధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్విస్ ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో



ఆహారంతో తరలివెళుతున్న క్విస్ కళాశాల వాహనం, సిబ్బంది

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 4: ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాల, బుధవారం 5వేల పులిహార ప్యాకెట్లను విజయవాడ వరద బాధితులకు పంపారు. సాంఘిక సంక్షేమశాఖ ఉప సంచాకులు లక్ష్మానాయక్, ఆ శాఖ సిబ్బంది ఆధ్వర్యంలో ఆహారాన్ని ప్రత్యేకవాహనాల్లో విజయవాడకు తీసుకెళ్లి వరద బా ధితులకు అందించారు.

ముగింపు దశకు ఈ-పంట నమోదు



మల్లవరప్పాడులో పరిశీలిస్తున్న ఏవో స్వర్ణలత

టంగుటూరు, సెప్టెంబరు 4 : మండలంలో వ్యవసాయశాఖ అధికారులు చేస్తున్న ఈ-పంట నమోదు ముగింపు దశకు చేరుకుంది. బుధవారానికి 4,200 ఎకరాల్లో పంట సాగు చేసిన రైతుల వివరాల నమోదుతోపాటు ఈకేవైసీ చేశారు. మండలంలో ఖరీఫ్‌కు సంబంధించి 5,300 ఎకరాల్లో పంటల సాగు జరిగింది. అందులో పచ్చిరొట్ట ఎరువుగా జనుమును 600 ఎకరాల్లో వేశారు. అదిపోను 4,700 ఎకరాల్లో పంటలను ఈ-క్రాప్, ఈకేవైసీ చేయాల్సి ఉంది. ఇప్పటి వరకు 4,200 ఎకరాల్లో పూర్తి చేశారు. ఇక మిగిలి ఉంది జామాయిల్, సుబాబులు, మామిడి తోటలేనని ఏఈవో వెంకటేశ్వర్లు తెలిపారు. ఈప్రక్రియను చివరి రోజైన ఈనెల 15వ తేదీకి పూర్తి చేస్తామని ఆయన తెలిపారు. ఖరీఫ్‌లో పంటలు సాగు చేసిన రైతులు ఈ-క్రాప్ నమోదు చేయించుకోకపోతే గ్రామ సచివాలయంలో కానీ, ఏవో కార్యాలయంలో కానీ సంప్రదించాలని సూచించారు.

చినకండ్లగుంటలో ఫ్యామిలీ డాక్టర్



మహిళతో మాట్లాడుతున్న డాక్టర్లు

కొండపి, సెప్టెంబరు 4 : మండలంలోని చినకండ్లగుంట గ్రామంలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని పెట్లూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో నిర్వహించారు. నోడల్ అధికారి డాక్టర్ మాధవీలత సందర్శించారు. అక్కడికి వచ్చిన రోగులను వివరాలు, కార్యక్రమం ద్వారా అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. పీహెచ్‌సీ డాక్టర్ పి.అనూష, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహానికి భూమిపూజ



భూమిపూజలో పాల్గొన్న దళిత రైట్స్ ఫెడరేషన్ నాయకులు

జరుగుమల్లి (కొండపి), సెప్టెంబరు 4 : అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని దళిత రైట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు టి.అశోక్‌బాబు పిలుపునిచ్చారు. మండలంలోని కామేపల్లిలో బుధవారం అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు జరిగిన భూమి పూజకు ఆయన హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో పుల్లయ్య బోధి, గాండ్ల హరిప్రసాద్ బోధి, అశోక్‌బాబు, చప్పిడి వెంగళరావు, మధిర శేషయ్య, అల్లు వెంకటేశ్వర్లు, ఉజ్వల్, జగదీష్, క్రాంతికుమార్, రాజు, పాలేటి కోటేశ్వరరావు, కె.వి. కృష్ణారావు, బుద్ధకోటి, ఆదినారాయణ పాల్గొన్నారు.

హౌసింగ్ అధికారుల సర్వే

మద్దిపాడు, సెప్టెంబరు 4: అర్హులైన పేదలకు గత చంద్రబాబు నాయుడు ప్రభుత్వంలో ఇల్లు నిర్మించుకున్న వారందరికీ బిల్లులు మంజూరు కోసం బుధవారం హౌసింగ్ ఏఈ హేమలత ఆధ్వర్యంలో గృహాలను పరిశీలించారు. లబ్ధిదారులకు రావాల్సిన బిల్లులను ఆమె సర్వే చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గృహాలకు సంబంధించిన పెండింగ్ బిల్లులను త్వరలో లబ్ధిదారుల ఖాతాలోకి జమ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నవులూరి శివకుమార్, పాటిబండ్ల చెంచయ్య తదితరులు పాల్గొన్నారు.

గోమాతకు అశ్రునయాలతో అంత్యక్రియలు



ఆవు కళేబరాన్ని ఊరేగిస్తున్న గ్రామస్థులు

చీమకుర్తి, సెప్టెంబరు 4 : గోమాతకు అశ్రునయనాలతో అంత్యక్రియలు నిర్వహించిన సంఘటన బుధవారం మండలంలోని నేకునంబాదు, పులివారిపాలెం గ్రామాల్లో జరిగింది. పదిహేను ఏళ్ల క్రితం ఆవును నేకునంబాదు గ్రామంలో ఉన్న శివాలయానికి గ్రామానికి చెందిన రైతు కర్నాటి బ్రహ్మయ్య దానం చేశారు. అప్పటి నుంచి దేవతలాగా ఈ ఆవును నేకునంబాదు, పులివారిపాలెం గ్రామస్థులు కొలుస్తున్నారు. ఇన్నాళ్లు తమలో ఒకటిగా కలిసిపోయిన ఆవు బుధవారం తనువు చాలించింది. దీంతో కన్నీటిపర్యంతమైన గ్రామస్థులు ట్రాక్టర్‌లో గోమాత కళేబరాన్ని ఉంచి రెండు గ్రామాల్లో మేళతాళాలతో ఊరేగించి ఘనంగా అంత్యక్రియలు జరిపారు.

2 టిప్పర్లు, ట్రాక్టర్ పట్టివేత

మద్దిపాడు, సెప్టెంబరు 4: అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు టిప్పర్లు, ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు మద్దిపాడు ఎస్సై శివరామయ్య బుధవారం తెలిపారు. తాళ్లూరు పరిసర ప్రాంతం నుంచి బిల్లులు లేకుండా ఇసుక లోడుతో వస్తున్న వాహనాలను వెల్లంపల్లి సమీపంలో పట్టుకున్నట్లు ఆయన చెప్పారు.

చవితి వేడుకలకు గణనాథుని విగ్రహాలు సిద్ధం

మెరుగులు దిద్దుతున్న నిర్వాహకులు ● ఒంగోలులోని పలుచోట్ల భారీగా ప్రతిమల తయారీ





అమ్మకానికి సిద్ధంగా ఉన్న వినాయక విగ్రహాలు, మెరుగులు దిద్దుతున్న నిర్వాహకుడు

ఒంగోలు(కల్చరల్), సెప్టెంబరు 4: వినాయక చవితి పండుగను పురస్కరించుకుని గణనాథుని విగ్రహాలు సిద్ధమయ్యాయి. ఒంగోలు నగరంలోని పలు ప్రదేశాలలో వినాయక విగ్రహాల తయారీ, వాటికి మెరుగులు దిద్దటం అమ్మకాలు జోరందుకుంటున్నాయి. అలాగే పలు వీధులు, ప్రధానకూడళ్లలో వినాయక మండపాల నిర్మాణం సైతం ప్రారంభం కానుంది. ఇందులో పూజలు నిర్వహించేందుకు 3 మొదలు 15 అడుగుల వరకు విగ్రహాలను వినాయక నవరాత్రి నిర్వాహకులు కొనుగోలు చేస్తుంటారు. అందుకు అనుగుణంగా రాజస్థాన్, బీహార్, కోల్‌కతా వంటి ప్రదేశాలనుంచి వచ్చిన కళాకారులు విగ్రహాలను గత ఆరు నెలలుగా తయారుచేస్తున్నారు. ఇక పండుగ ఈ నెల 7వ తేదీ కావడంతో విగ్రహాలకు రంగులు, ఆభరణాలు వంటి మెరుగులుదిద్దే పనులో వారు నిమగ్నమయ్యారు. అయితే ఇటీవల కురిసిన వర్షాల వల్ల తయారీ కేంద్రాలలోకి నీరు చేరటం, సిద్ధం చేసి ఆరుబయట పెట్టిన కొన్ని విగ్రహాలు దెబ్బతిన్నాయని, ప్రస్తుతం వాటిని మళ్లీ సరిచేసే పనిలో ఉన్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఏదిఏమైనప్పటికీ గురు, శుక్రవారాల్లో విగ్రహాల అమ్మకాలు జోరందుకుంటాయన్న ఆశాభావాన్ని వారు వ్యక్తం చేస్తున్నారు.

ఒంగోలు నుంచి భారీగా ఆహార ప్యాకెట్లు

మంచినీటి బాటిళ్లతో పాటు బిస్కెట్లు, బ్రెడ్లు సరఫరా ● కలెక్టర్ అన్సారియా నేతృత్వంలో ముందుకు వస్తున్న దాతలు

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 4: విజయవాడలోని వరద బాధితులను ఆదుకునేందుకు పలు రంగాల ప్రముఖులు ముందుకు వస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాలతో కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశాలతో జిల్లా కేంద్రమైన ఒంగోలులో బచ్చలబాలయ్య కళ్యాణమండపం, ఏ1 కన్వెన్షన్ హాలులో జిల్లాఅధికార యంత్రాంగం తరుపున ఆహారాన్ని వండించి అక్కడ ప్యాకెట్లను చేసి ప్రత్యేక వాహనాల్లో విజయవాడకు పంపుతున్నారు. బుధవారం ఒంగోలుతో పాటు ఇతర ప్రాంతాల నుంచి లక్షా 50వేల ఆహార ప్యాకెట్లు, 2 లక్షల వాటర్ బాటిళ్లతో పాటు బిస్కెట్ ప్యాకెట్లు, బ్రెడ్లు, అగ్గిపెట్టెలతో పాటు పిల్లలకు సంబంధించిన పలు రకాల ఆహారాన్ని తరలిస్తున్నారు. నాలుగు రోజులు గడుస్తున్నా విజయవాడలో వరద నీరు తగ్గకపోవడంతో అక్కడి ప్రజానీకం అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ అన్సారియా ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ఒక వైపు ప్రభుత్వ పరంగా, మరో వైపు వివిధ రంగాల ప్రముఖులతో పాటు స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులు, కళాశాలలు, పాఠశాలలు, వివిధ సంఘాల ప్రతినిధుల సహకారంతో ఇక్కడ నుంచి ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేసి ఆహారాన్ని, మంచినీటి బాటిళ్లను ఇతర సామాన్లను పంపుతున్నారు. అందుకోసం పలు శాఖల అధికారులను సమన్వయం చేసి వరద బాధితులకు అవసరమైన సహకారాన్ని అందించే దిశగా చర్యలు చేపట్టారు.

సహాయకార్యక్రమాల కోసం ట్రాక్టర్లు..

విజయవాడ వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలను ఆదుకునేందుకు, సహాయ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వీలుగా జిల్లా నుంచి 13 ట్రాక్టర్లను పంపుతున్నట్లు కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. ఒంగోలులోని ఉప రవాణా కమిషనర్ కార్యాలయం నుంచి కలెక్టర్ బుధవారం ట్రాక్టర్ల యజమానులతో మాట్లాడి వాటిని వరద ప్రభావిత ప్రాంతాలకు పంపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వరద సహాయ కార్యక్రమాల కోసం జిల్లానుంచి 50 ట్రాక్టర్లను పంపాలని కోరారని, ప్రస్తుతం 13 పంపుతున్నట్లు తెలిపారు. త్వరలో మిగిలిన ట్రాక్టర్లను కూడా పంపనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డీటీపీ సుశీల తదితరులు పాల్గొన్నారు.



డ్రైవర్లతో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

75 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

బియ్యంతో పాటు మినీలారీ సీజ్

డ్రైవర్ అరెస్టు

ఒంగోలు (క్రైం), సెప్టెంబరు 4: అక్రమంగా రవాణా చేస్తున్న 75 బస్తాల రేషన్ బియ్యంను ఒంగోలు వన్‌టౌన్ పోలీసులు పట్టుకున్నారు. బుధవారం ఉదయం 6గంటల సమయంలో ఒంగోలు నగరం చర్చిసెంటర్‌లో మినీ లారీలో బియ్యం తరలిస్తుండగా పోలీసులు తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా బియ్యం గుర్తించి మినీలారీతో పాటు సీజ్ చేసి లారీ డ్రైవర్ నిరీక్షన్‌ను అరెస్టు చేశారు. ఉలిచి నుంచి పీర్లమాన్యం స్టాక్ పాయింటుకు బియ్యం రవాణా అవుతున్నట్లు పోలీసులు గుర్తించారు. అయితే ఉలిచిలో ఆ బియ్యాన్ని ఎవరు లోడింగ్ చేశారు, పీర్లమాన్యంలో ఎక్కడికి తీసుకెళ్తున్నారో మాత్రం ప్రశ్నార్థకంగా మారింది. లారీ డ్రైవర్ నిరీక్షన్ చెప్పిన ఆధారాల ప్రకారం.. తనకు డ్రైవింగ్ లైసెన్స్ లేదని, దీంతో జీవనోపాధికోసం రాత్రుల పూట, మినీలారీలు, కార్లకు డ్రైవర్‌గా వెళ్తున్నాని పోలీసులకు విచారణలో తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తి అద్దంకి బస్టాండ్‌లో తాను నడిపే మినీలారీని బుక్‌చేసుకుని ఉలిచి తీసుకెళ్లి అక్కడ రహస్యంగా ఉంచిన 3,750 కిలోల రేషన్ బియ్యంను లారీలో ఎత్తించారు. ఆ వ్యక్తి తాను మోటార్‌సైకిల్‌పై ముందు వెళ్తుంటానని, నువ్వు తన వెనుక రావాలని కోరారని చెప్పారు. అయితే డ్రైవర్ నిరీక్షన్ తనకు భయంగా ఉందని చెప్పడంతో అదనంగా రూ.3వేలను ఇస్తానని ఆశ చూపడంతో వచ్చినట్లు ఒప్పుకున్నాడు. దీంతో చర్చి సెంటర్‌లో పోలీసులు లారీని సీజ్‌చేసి బియ్యాన్ని ఒంగోలు ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలించి డ్రైవర్‌ను అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ ఎస్సై కిషోర్ తెలిపారు.

విద్యార్థి దశ నుంచే ఆరోగ్యంపై అవగాహన ఉండాలి

వ్యక్తిత్వ వికాస నిపుణులు లలితశ్రీనివాస్



విద్యార్థులతో మాట్లాడుతున్న క్లబ్ ప్రతినిధులు

ఒంగోలు(కల్చరల్), సెప్టెంబరు 4: విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ ఆరోగ్యం, సంప్రదాయాల పట్ల అవగాహన కలిగి ఉండాలని, సరైన ప్రణాళికతో ప్రతి సబ్జెక్టు మీద పట్టు ఉండటం వల్ల ఉన్నత అవకాశాలు లభిస్తాయని మోటివేషనల్ స్పీకర్ కేఎస్‌వీ.లలితశ్రీనివాస్ పేర్కొన్నారు. వాసవీ క్లబ్ వారోత్సవాల్లో భాగంగా ఒంగోలులోని పీవీఆర్ బాలికల పాఠశాలలో ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో లలితశ్రీనివాస్ మాట్లాడుతూ మాతృభాషపై పట్టు ఉంటేనే ఇరత భాషలను అతి సులువుగా నేర్చుకోగలుగుతామన్నారు. వాసవీక్లబ్ ఒంగోలు, వాసవీక్లబ్ కేసీజీఎఫ్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ వారోత్సవాల్లో క్లబ్ అధ్యక్షుడు నల్లమల్లి బదరీ నారాయణ, యూత్ అధ్యక్షులు కూనల శ్రీనివాసరావు, కార్యదర్శులు పి.నందకుమార్, కె.పవన్‌కుమార్, కోశాధికారులు గుర్రం సునీల్‌కుమార్, గోరంట్ల శ్రీనివాసరావు, పబ్బిశెట్టి వినోద్‌కుమార్, గుర్రం రంగనాథ్, టంగుటూరి రంగస్వామి, నూకల శ్రీనివాసరావు, చీదెళ్ల వెంకటప్రసాద్, భూమా శ్రీనివాసులు తదితర క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.


లండన్ పర్యటన ఉద్దేశం ఏమిటి జగన్ : మంత్రి డోలా

అమరావతి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): లండన్ పర్యటన వెనుక నీ ఉద్దేశమేంటి జగన్? అంటూ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి నిలదీశారు. బుధవారం రాజధాని అమరావతిలోని టీడీపీ జాతీయ కార్యాలయంలో మంత్రి మీడియాతో మాట్లాడారు. 'వరదలతో ప్రజలు ఇన్ని కష్టాలు పడుతుంటే నువ్వు లండన్ ఎందుకు వెళ్తున్నావ్? సంపాదించుకున్న బ్లాక్ మనీని వైట్ చేసుకునేందుకేనా? నువ్వు ఏ కారణంతో లండన్ వెళ్తున్నావో ప్రజలకు చెప్పాల్సిన బాధ్యత నీదే. నువ్వు లండన్ వెళ్తూ.. నీ పేటీఎం బ్యాచ్‌తో పిచ్చి ప్రేలాపనలు పేలితే ఊరుకునేది లేదు. లండన్‌లో ఐదు చోట్ల నీకు అక్రమ ఆస్తులు ఉన్నట్లు సీబీఐ గతంలోనే గుర్తించింది. లండన్‌లో దీవులు కొనుగోలు చేసినట్లు ప్రజలు చెప్తున్నారు. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా మా నాయకుడు చంద్రబాబు ఎప్పుడూ క్షేత్రస్థాయిలో ప్రజల మధ్యే ఉన్నారు. 74 ఏళ్ల వయస్సులో జనం కోసం పని చేస్తున్నారు. జనం కోసం పని చేసే నాయకుడెవరో, జనాన్ని ఇబ్బంది పెట్టే నాయకుడెవరో ప్రజలే గమనిస్తున్నారు. ఐదు నిమిషాలు షో చేసి అమరావతి, కూటమి ప్రభుత్వంపై అబద్ధపు ప్రచారాలు చేస్తే నీకు గుణపాఠం తప్పదు' అని మంత్రి హెచ్చరించారు.

దర్శి ప్రాంతంలో వడ్డీ వ్యాపారుల ఆగడాలు

తనఖా ఆస్తులతో తీసుకున్న అప్పులపై ఎక్కువ వివాదాలు

పోలీస్‌స్టేషన్ల వరకూ వెలుతున్న పేచీలు



దర్శి, సెప్టెంబరు 4 : దర్శి ప్రాంతంలో వడ్డీ వ్యాపారుల ఆగడాలు రోజురోజుకూ అధికమవుతున్నాయి. కొంతమంది అధిక వడ్డీలతో జనాలను ఇబ్బందులు పెడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. కొందరు సంస్థ పేరుతో రిజిస్ట్రేషన్లు చేసుకొని వడ్డీ వ్యాపారాలు చేస్తుండగా, మరికొంత మంది ఎలాంటి రిజిస్ట్రేషన్లు లేకుండా అనధికారికంగా అప్పులు ఇచ్చి వసూలు చేసుకుంటున్నారు. ముఖ్యంగా ఆస్తులను రిజిస్టర్లు చేసుకొని అప్పులు ఇచ్చి అధిక వడ్డీలతో చెల్లించమంటున్నారు. ఇలా అప్పులు తీసుకున్న వారిలో కొందరు గతంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం కూడా చేశారు. ప్రస్తుతం రియల్ భూం మందగించటంతో అప్పులు తీసుకున్న వ్యక్తులు సకాలంలో చెల్లించలేకపోతున్నారు. ఈ నేపథ్యంలో ష్యూరిటీ కోసం రిజిస్టర్లు చేసుకున్న ఆస్తులను వడ్డీ వ్యాపారులు స్వాధీనం చేసుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. న్యాయబద్ధమైన వడ్డీ చెల్లిస్తామని చెబుతున్నప్పటికీ ఆస్తులు వారి పేర ఉన్నాయనే ధీమాతో కొంతమంది వ్యాపారులు వినిపించుకోవటం లేదు. దీంతో కొన్ని పంచాయితీలు పోలీస్‌స్టేషన్ వరకూ వెళ్తున్నాయి. వడ్డీ వ్యాపారులు నోట్లు రాయించుకోవటంతో పాటు ఆస్తులు రిజిస్టేషన్ చేయించుకొని తమకేమి కాదన్న ఉద్దేశంతో రుణగ్రస్తులపై ఒత్తిడి పెంచుతున్నారు. ఈ వివాదాలు ముదిరి తీవ్రమవుతున్నాయి.

ఇటీవల కాలంలో పంచాయితీలు..

దర్శి నగర పంచాయతీ పరిధిలో రెండుమూడునెలలలోపు వడ్డీ వ్యాపారుల పంచాయితీలు భారీ స్థాయిలో నాలుగు వరకు జరిగాయి. కొంత మంది రియల్ ఎస్టేట్ వ్యాపారుల వద్ద తీసుకున్న రుణాలు విషయంలో చివరకు పోలీస్ స్టేషన్ కు వెళ్లి ఏదో రకంగా పరిష్కారం చేసుకోగా మరికొన్ని పేచీలతో నడుస్తూనే ఉన్నాయి. గతంలో వడ్డీ వ్యాపారులు వేధిస్తున్న సంఘటనలు వెలుగులోకి రావటంతో విజయవాడలో అక్రమార్కులపై కాల్‌మనీ కేసులు పెట్టిన విషయం తెలిసిందే. అక్కడ రోజువారీ, నెలవారీ వడ్డీలు వసూళ్లు చేస్తున్న అనేకమందిపై కేసులు నమోదు చేశారు. దర్శి ప్రాంతంలో ఈ పేచీలు రోజురోజుకూ పెరుగుతుండటంతో బాధితులు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఏదోరకంగా న్యాయబద్ధమైన వడ్డీతో అప్పులు చెల్లిస్తామని చెబుతున్నా ఆస్తులకు విలువలు పెరగటంతో వడ్డీ వ్యాపారులు పేచీలు పెడుతుండటంతో సమస్యలు జటిలమవుతున్నాయి. దీంతో జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసి న్యాయం పొందేందుకు పలువురు సిద్ధమవుతున్నట్లు సమాచారం.

ఆన్‌లైన్ రుణాలతోనూ ఇబ్బందులు

ఇటీవల కాలంలో ఆన్‌లైన్ రుణాలు తీసుకొని పలువురు యువకులు వారి ఒత్తిడి తట్టుకోలేక ఇబ్బంది పడుతున్న సంఘటనలు వెలుగులోకి వచ్చాయి. యువకులను ఆన్‌లైన్‌లో పరిచయం చేసుకొని మాయమాటలు చెప్పి రుణాలు ఇస్తున్నారు. వారు వసూళ్లు చేసే వడ్డీ చెల్లించలేక యువకులు ఏం చేయాలో పాలుపోక అల్లాడుతున్నారు. ఇటీవల ముండ్లమూరు మండలంలోని ఓ గ్రామంలో ఓ వ్యక్తి ఆన్‌లైన్ రుణం తీసుకున్నారు. గడువులోపు చెల్లించకపోవడంతో ఆ యాప్ వారు వేధింపులకు పాల్పడ్డారు. అలాగే రుణాలు చెల్లించని వారి బంధువులు కొంత మందికి సంబంధిత వ్యక్తి అశ్లీల ఫొటోలు పంపించి బెదిరింపులకు పాల్పడుతున్నారు. ఇలాంటి సంఘటనలు దర్శి, ముండ్లమూరు మండలాల్లో ఇటీవల కాలంలో వెలుగులోకి వచ్చాయి. కుటుంబ సభ్యులు తెలుసుకొని ఏదోరకంగా ఆ రుణాలు చెల్లించారు. పోలీసులు కూడా ఆన్‌లైన్ రుణాలు తీసుకోవద్దని సూచిస్తున్నారు.

పాతకక్షల నేపథ్యంలో దాడి-ఒకరికి గాయాలు



గాయపడిన జానకిరామ్

ఒంగోలు(క్రైం), సెప్టెంబరు 4: పాతకక్షల నేపథ్యంలో ఇరువురిపై దాడి చేశారు. ఈ సంఘటన ఒంగోలు నగరం కేశవస్వామిపేటలో జరిగింది. రెండు నెలల క్రితం ఓ యువతి ఫొటో ఫేస్‌బుక్‌లో పెట్టినందుకు స్థానిక సీతారామాపురంలో నివాసం ఉండే పూజల దేవా, ఆయన కుమారుడిని గంజాయి బ్యాచ్ ఇష్టానుసారం కొట్టింది. ఈక్రమంలో దేవా కుమారుడు కంటిని కోల్పోయాడు. అప్పటి నుంచి దేవా తమపై దాడికి పాల్పడిన దేవిశెట్టి జానకిరామ్‌పై కక్ష పెంచుకున్నాడు. అయితే అప్పట్లో జానకిరామ్‌పై కేసు నమోదు కావడంతో జైలుకు వెళ్లగా విడుదలై బయటకు వచ్చాడు. ఈనేపథ్యంలో బుధవారం సాయంత్రం జానకిరామ్, తన స్నేహితుడు భానుప్రసాద్ కలిసి బైక్‌పై కేశవస్వామిపేట వద్దకు వచ్చారు. అయితే అప్పటికే అక్కడ ఉన్న దేవా, తన స్నేహితులు ఆవుల అనిల్, మద్దెల డేవిడ్, మరో ఇరువురు యువకులు కలిసి జానకిరామ్‌పై దాడి చేశారు. దీంతో ఆయన తీవ్రంగా గాయపడటంతో రిమ్స్‌కు తరలించారు. అక్కడ జానకిరామ్ చికిత్స పొందుతూ అవుట్ పోస్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

'సుప్రీం' తీర్పును పునఃపరిశీలించాలి



కరపత్రాలను విడుదల చేస్తున్న మాల ఉద్యోగులు

టంగుటూరు, సెప్టెంబరు 4 : ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును పునఃపరిశీలించాలని దళిత సంఘాల ఐక్యవేదిక జాతీయ అధ్యక్షుడు చప్పిడి వెంగళరావు డిమాండ్ చేశారు. ఈనెల 22న చేపడుతున్న హలో మాల.. చలో ఒంగోలు కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను స్థానిక మాల ఉద్యోగుల సంఘ కార్యాలయంలో బోధిసత్వ ధమ్మ రాష్ట్ర ప్రచారకుడు పుల్లయ్య బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంగళరావు మాట్లాడుతూ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగానికి మనువాదులు నాశనం తలపెట్టారన్నారు. ఇందులో భాగమే ఉమ్మడి రిజర్వేషన్లపై ఇచ్చిన తీర్పు అని వ్యాఖ్యానించారు. ఎస్సీ, ఎస్టీలు సంఘటితమై కుట్రలను తిప్పికొట్టాలని వెంగళరావు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అంబేడ్కర్ యూత్ నేత కె.రాజు, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధికి విద్యానికేతన్ విరాళం



సేకరించిన విరాళాలతో హైస్కూల్ విద్యార్థులు

సింగరాయకొండ, సెప్టెంబర్ 4 : మండలంలోని మూలగుంటపాడు పంచాయతీ పరిధిలోని విద్యానికేతన్ హైస్కూల్ విద్యార్థులు, యాజమాన్యం విజయవాడ వరద బాధితులను ఆదుకొనేందుకు ముందుకొచ్చారు. బుధవారం విద్యార్థులు రూ.30వేలు పోగుచేసి ఇవ్వగా, యాజమాన్యం తరపున పాఠశాల డైరెక్టర్ సైకం వెంకటేశ్వరరావు మరో రూ.60వేలు కలిపి మొత్తం రూ.90వేలు సీఎం సహాయ నిధికి విరాళంగా పంపించారు. కార్యక్రమంలో సిబ్బంది మస్తాన్, సిరాజ్, కల్యాణి, రమణి పాల్గొన్నారు.

భర్త మృతితో భార్య బలవన్మరణం



శిరీష మృతదేహం

నాగులుప్పలపాడు, సెప్టెంబరు 4: ఇటీవల భర్త చనిపోవడంతో మనస్థాపానికి గురైన ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన చీర్వానుప్పలపాడులో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చీర్వానుప్పలపాడులోని అంబేడ్కర్‌కాలనీలో నివసిస్తున్న బత్తుల శిరీష (28) భర్త అంకమ్మరావు ఇటీవల మృతిచెందారు. ఒంటరిగా నివశిస్తున్న శిరీష మనస్తాపంతో బుధవారం తన ఇంట్లో ఉరేసుకుని చనిపోయింది. సమాచారం అందుకున్న ఎస్సై బి.శ్రీకాంత్ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.


పెద్దపెద్ద గోతులతో నీరు నిలిచిన ఎర్రగొండపాలెం-త్రిపురాంతకం రోడ్డు

అధ్వానంగా రహదారులు

ఎర్రగొండపాలెం,(పుల్లలచెరువు),సెప్టెంబరు 4:ఇటీవల కురిసిన వర్షాలకు ప్రధాన లింకు రోడ్డులు అధ్వానంగా మారాయి. ఎర్రగొండపాలెం-త్రిపురాంతకం రోడ్డు మరీ అధ్వానంగా ఉండి బురద గుంతగా మారింది. గత ఐదేళ్లలో డబుల్ రోడ్డు వేస్తామని వైసీపీ నేతలు హామీ ఇచ్చి గాలికివదిలేశారు. ఎర్రగొండపాలెంలోని వినుకొండ రోడ్డులోని అయ్యప్పస్వామి దేవాలయం వద్ద సుమారు అర కిలోమీటరు పైగా రోడ్డు మగాణీని తలపిస్తోంది. అదేవిధంగా అయ్యంబొట్లపల్లె నుంచి రామసముద్రం మధ్య రెండు కిలోమీటర్లు, రామసముద్రం నుంచి మిట్టపాలెం వరకు మూరకో గుంతతో రోడ్డు అధ్వానంగా తయారైంది.ఎర్రగొండపాలెం నుంచి త్రిపురాంతకానికి 20 కిలోమీటర్లు పైగా ఉంది.ఈ రోడ్డు ద్వారా గుంటూరు, విజయవాడకు వెళ్లే ప్రయాణికులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. మూడు నెలల క్రితం ఆటో డ్రైవర్లు గుంతల్లో మట్టి పోశారు. ఇప్పుడు వర్షాలకు మట్టి కొట్టుకుపోయి మరి అధ్వానంగా తయారైయింది. ఇప్పటికైనా ఉన్నాతాధికారులు స్పందించి తక్షణమే నూతన రోడ్డును నిర్మించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షులు సుబ్బారావు

హమాలీలకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి

గిద్దలూరు టౌన్, సెప్టెంబరు 4 : హమాలీ ముఠా కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కె.సుబ్బారావు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వివిధ పట్టణాలలో హమాలీ కార్మికులు ఉన్నారని, భవన నిర్మాణ కార్మికుల తరహాలోనే వారికీ సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని తెలిపారు. సంబంధిత సంక్షేమ బోర్డు ద్వారా కార్మికులకు గుర్తింపు కార్డులు, ప్రమాదబీమా పింఛన్, ఇతర సంక్షేమ పథకాలు అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి టి.ఆవులయ్య మాట్లాడుతూ పట్టణంలో వివిధ ముఠా పనులు చేసుకునే కార్మికులు సుమారు 500 మందికిపైగా ఉన్నారని, వీరందరికీ గుర్తింపు కార్డులు కార్మికశాఖ నుంచి అందజేయాలని డిమాండ్ చేశారు. హమాలీలకు సంక్షేమ బోర్డు ఏర్పడేందుకు ఏకం కావాలన్నారు. ఇందుకోసం ఈనెల 10న తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో మార్బుల్, డిజైన్, టైల్స్, పీవోపీ, కార్మికులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

మార్కాపురం వన్‌టౌన్, సెప్టెంబరు 4: ప్రజా సమస్యలను పరిష్కరించాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి అందె నాసరయ్య డిమాండ్ చేశారు. నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని, వివిధ ప్రజా సమస్యలు పరిష్కరించాలని సీపీఐ నిర్వహిస్తున్న దేశవ్యాప్త ఆందోళనలో భాగంగా స్థానిక పూల సుబ్బయ్య భవన్‌లో బుధవారం ఆపార్టీ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మర్రిపాలెం గూడేనికి దారేదీ?

వర్షం కురిస్తే రాకపోకలు బంద్

లేకుంటే ఎలుగుబంట్ల దాడి

అవస్థలు పడుతున్న గిరిజనులు


మర్రిపాలెం వెళ్లే రహదారిలో చప్టాపై ప్రవహిస్తున్న వరదనీరు (ఫైల్)

పెద్ద దోర్నాల, సెప్టెంబరు 4: మండలంలోని మర్రిపాలెం గిరిజన గూడేనికి ప్రధాన రహదారి సక్రమంగా లేకపోవడంతో గ్రామస్థులు నానా అగచాట్లు పడుతున్నారు. వర్షం కురిస్తే ఒక బాధ, కురవక పోతే మరో సమస్యను ఎదుర్కోవలసి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శ్రీశైలం-దోర్నాల ఘాట్ రోడ్డు నుంచి సుమారు 7కిలోమీటర్ల దూరంలో మర్రిపాలెం గిరిజన గ్రామం ఉంది. ఈ గ్రామంలో 250 కుటుంబాలు నివశిస్తున్నాయి. అయితే గ్రామానికి వెళ్లేందుకు నేటికీ సరైన రహదారి లేదు. దీంతో వారి బాధలు వర్ణనాతీతం. ఘాట్ రోడ్డు నుంచి మర్రిపాలెం వెళ్లాలంటే మధ్యలో రాళ్లవాగు దాటాల్సి ఉంది. ఆ వాగుపై దశాబ్దాల క్రితం నిర్మించిన చిన్న పాటి చప్టా శిథిలావస్థకు చేరుకుని రాళ్లు, గుంతలు ఏర్పడ్డాయి. వర్షం కురిస్తే బ్రిడ్జిపై నుంచి వరదనీరు ప్రవహిస్తూ ఉండడంతో రాకపోకలు నిలిచిపోతాయి. మామూలు రోజుల్లో చెంచులను మరో భయం పట్టి పీడిస్తోంది. గ్రామానికి వెళ్లేంత వరకు చిల్లకంప, పొదలు వెదురుగుబుర్ల మధ్య ఎలుగుబంట్లు సంచరిస్తూ దాడులు చేసిన నేపథ్యంలో కొందరు ప్రాణాపాయస్థితికి కూడా చేరుకున్న ఘటనలు ఉన్నాయి. దీంతో గిరిజనులు ఒంటరిగా ప్రయాణించాలంటే వణికిపోతున్నారు.పైగా రేషన్ కూడా చింతల గ్రామంలో ఇస్తుండడంతో మరింత ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షానికి రాళ్లవాగు మూడు రోజులు ఉధృతంగా ప్రవహించింది. ఆ రోజుల్లో రాకపోకలు నిలిచిపోయాయని, ఇప్పటికైనా ప్రభుత్వం, సంబంధిత ఉన్నతాధికారులు స్పందించాలని సమస్యను పరిష్కరించాలని చెంచు గిరిజనులు కోరుతున్నారు.

గిరిజనులకు ధ్రువీకరణ పత్రాలు ఇస్తాం


దోర్నాలలో గిరిజనులతో జరిగిన అవగాహన సదస్సులో మాట్లాడుతున్న టీపీ లాలఅహ్మద్

మార్కాపురం రూరల్, సెప్టెంబర్ 4 . గుర్తింపు పత్రాలు లేని గిరిజనులకు ధ్రువీకరణ పత్రాలను ప్రస్తుతం నిర్వహిస్తున్న ఆధార్ క్యాంప్ ద్వారా మంజూరు చేస్తామని ఎంపీడీవో చందన తెలిపారు. మండలంలోని పెద్ద నాగులవరం గ్రామంలో బుధవారం ప్రధాన మంత్రి జన్‌మన్ కార్యక్రమం ఎంపీడీవో అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పీఎం జన్‌మన్ కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక ఆధార్ క్యాంప్ నిర్వహిస్తామని తెలిపారు. గర్భిణులకు, తల్లులకు పౌష్టికాహారం, గుడ్లు పంపిణీ చేశారు. గ్రామస్థులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపించాలని కోరారు. బాల్య వివాహాలు జరగకుండా ప్రతి ఒక్కరూ అవగాహన కల్పించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో రాందాస్ నాయక్, సీడీపీవో సుశీల, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, ఆశ వర్కర్లు, అంగన్ వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దదోర్నాలలో

పెద్ద దోర్నాల : ప్రధానమంత్రి జన్‌మన్ అమలు ద్వారా చెంచు గిరిజన గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఐటీడీఏ ఎస్‌ఆర్‌ఈజీఎస్ టీఏ లాల అహ్మద్ అన్నారు. బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జన్మన్ ద్వారా గ్రామాలకు రహదారుల నిర్మాణం, విద్యుత్తు సౌకర్యం ఏర్పాటు, ప్రతి ఇంటికీ తాగునీటి కొళాయి ఏర్పాటు, జీవనోపాధులు కల్పించడం, నాణ్యమైన విద్య, వైద్యం అందించడం వంటివి ప్రభుత్వం అందజేస్తుందని, వాటిని గిరిజనులు సద్వినియోగపర్చుకోవాలని కోరారు. ఐటీడీఏ కోఆర్డినేటర్ కే మోహన్‌రావు, ప్రధానోపాధ్యాయులు కనకయ్య, జూనియర్ సహాయకులు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


పొదిలిలో అమ్మకానికి సిద్ధం చేసిన వినాయక విగ్రహాలు

ముస్తాబైన గణనాథులు

పొదిలి, సెప్టెంబరు 4 : వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని పట్టణంలో పలు చోట్ల గణనాథులను ముస్తాబు చేశారు. నగర పంచాయతీ పరిధిలో మార్కాపురం అడ్డరోడ్, పోతవరం, పెట్రోల్‌బంక్ సమీపంలో వినాయక విగ్రహాలను తయారుచేసి విక్రయించేందుకు సిద్ధం చేశారు. నేటి నుంచే గణనాథులను గ్రామాలకు తరలించేందుకు నిర్వాహకులు అమ్మక కేంద్రాల వద్దకు చేరుకున్నారు. ఈ ఏడాది వినాయక విగ్రహాల విక్రయాలపై తయారీదారులు భారీగా ఆశలు పెట్టుకున్నారు.

వినాయక విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

గిద్దలూరు టౌన్, సెప్టెంబరు 4 : వినాయక చవితి పర్వదినం సందర్భంగా ఏర్పాటు చేయనున్న విగ్రహాలకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని స్థానిక అర్బన్ సీఐ కె.సురేష్ ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ, గ్రామాలలో ఏర్పాటు చేసే మండపాలలో వినాయక విగ్రహాల ఏర్పాటుకు నిర్వాహకులు అగ్నిమాపక, పురపాలక, గ్రామపంచాయతీ, విద్యుత్‌శాఖ, పోలీసుశాఖల నుంచి అనుమతులు పొంది పూజలు నిర్వహించుకోవాలని ఆయన ఆ ప్రకటనలో తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలన్నారు.

డాక్టర్లను అందుబాటులో ఉంచాలి

ఎంపీజే నాయకుల డిమాండ్


రోగులతో మాట్లాడుతున్న ఎంపీజే నాయకులు

మార్కాపురం రూరల్, సెప్టెంబరు 4: స్థానిక ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో కిడ్నీ, గుండె సంబంధిత వ్యాధుల వైద్యులను రోగులకు అందుబాటులో ఉంచాలని ఎంపీజే నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎంపీజే ఆధ్వర్యంలో ఈనెల 1 నుంచి 15 వరకు జరుగుతున్న వైద్య ఆరోగ్య హక్కుల పక్షత్సవంలో భాగంగా ఎంపీజే కార్యవర్గ సభ్యులు బుధవారం ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని వివిధ విభాగాలలో రోగులకు అందుతున్న చికిత్స గురించి అడిగి తెలుసుకున్నారు. వైద్యశాలలో డయాలసిస్, గుండె సంబంధిత వ్యాధులను పరీక్షించేందుకు వైద్యం చేసేందుకు అనుభవం కలిగిన వైద్యులు లేకపోవడంతో రోగులు మెరుగైన వైద్యం కోసం గుంటూరు, ఒంగోలు తదితర ప్రాంతాలకు వెళ్లవలసి వస్తుందని తెలిపారు. వెనుకబడిన పశ్చిమ ప్రాంత ప్రజల కోసం మార్కాపురం మండలంలోని రాయవరం గ్రామ పరిధిలో నిర్మిస్తున్న మెడికల్ కాలేజీనీ త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో ఉంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీజే మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు షేక్ అబ్దుల్ రసూల్, పట్టణ అధ్యక్షుడు షేక్ నాగూర్ మీరావలి, ప్రధాన కార్యదర్శి పి.హబీబుల్లా ఖాన్, కమిటీ సభ్యులు కాజా జవాద్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

సభ్యత్వ నమోదు ర్యాలీ

గిద్దలూరు, సెప్టెంబరు 4 : భారతీయ జనతాపార్టీ నాయకులు సభ్యత్వ నమోదు సందర్భంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఆపార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరాల శ్రీనివాసరెడ్డి సభ్యత్వ నమోదును ప్రారంభించారు. పోలింగ్ బూత్ స్థాయి నుంచి సభ్యత్వ నమోదు మొదలు పెట్టాలని కోరారు. గత దశాబ్దకాలంగా మోదీ ఆధ్వర్యంలోని బీజేపీ ప్రభుత్వం దేశంలో చేపడుతున్న సంక్షేమ పథకాల గురించి వివరించి సభ్యత్వ నమోదు చేయించుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి డాక్టర్ జేవీ నారాయణ, జిల్లా ఉపాధ్యక్షులు రామాంజనేయులు, పట్టణశాఖ అధ్యక్షులు ఎ.ఉదయ్‌శంకర్, కిసాన్ మోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పిడతల రమేష్‌రెడ్డి, బీసీ సంఘాల కన్వీనర్ సుబ్బరాయుడు, మైనారిటీ సెల్ అధ్యక్షులు ఖాదర్ వలి, బీజేపీ నాయకులు చంద్రమోహన్, మల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు

మార్కాపురం వన్‌టౌన్ : బీజేపీ నూతన సభ్యత్వ నమోదు కార్యక్రమం బుధవారం నిర్వహించారు స్థానిక దోర్నాల బస్టాండ్‌లో ఈ కార్యక్రమాన్ని నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీ కృష్ణారావు ప్రారంభించి మాట్లాడారు. నాయకులు పి.శ్రీనివాసరావు, బి.కృష్ణ, ఎస్.సరోజిని, లక్ష్మీ, చిన్నయ్య, రామకృష్ణ, వాసవిప్రియ, కరీంబాషా తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు రైతు మృతి

గిద్దలూరు టౌన్, సెప్టెంబరు 4 : పొగాకు బేళ్లను తరలిస్తున్న వాహనంపైన ఉన్న వ్యక్తి చెట్టుకొమ్మ తగిలి మృతి చెందాడు. అందిన సమాచారం మేరకు గిద్దలూరు నగర పంచాయతీ పరిధిలోని కొత్తపల్లె గ్రామానికి చెందిన కమతం వేణుగోపాల్ (32) తోటి రైతులతో కలిసి పొగాకుబేళ్లను లారీకి ఎత్తుకుని వాటిపైనే కూర్చొన్నాడు. లారీ బేస్తవారపేట మండలం సలకలవీడు గ్రా మంలో మరమ్మతులకు గురికావడంతో ముందు భాగంలో కూర్చున్న రైతులు లారీ పైన ఉన్న వేణుగోపాల్‌ను పిలిచారు. ఎంతకీ సమాధానం రాకపోవడంతో లారీ పైకి ఎక్కి చూశారు. వేణుగోపాల్ మృతిచెందినట్లు గుర్తించారు. అయితే లారీపైనున్న రైతుకు మార్గమధ్యంలో చెట్టుకొమ్మ బలంగా తగిలిఉంటదని, దీంతో మృతిచెందాడని భావిస్తున్నారు. వెంటనే మృతదేహాన్ని స్వగ్రామం తరలించారు. ఆయన భార్య ఉన్నారు. గిద్దలూరు సీఐ కె.సురేష్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పౌష్ఠికాహార మాసోత్సవాలు

త్రిపురాంతకం, సెప్టెంబరు 4: గర్భిణులకు, తల్లులకు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అందించే పోషకాహారంపై అవగాహనా కార్యక్రమం మండలంలోని రాజుపాలెంలో బుధవారం జరిగింది. ఈసందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలు మాట్లాడుతూ 100 రోజుల కార్యక్రమంపై వివరించారు. 3 సంవత్సరాలు నిండిన చిన్నారులను తప్పకుండా అంగన్‌వాడీ కేంద్రా ల్లో నిర్వహించే ప్రీ స్కూల్ కు పంపించాలన్నారు. ఈకార్య క్రమంలో కార్యకర్తలు కొండమ్మ, బాలామణి, సువర్ణకుమారి, సరస్వతి, నాగమ్మ, తల్లులు పాల్గొన్నారు.


పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీలు

శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా శ్రీనివాసరెడ్డి

గిద్దలూరు టౌన్, సెప్టెంబరు 4 : గిద్దలూరు నగర పంచాయతీ శానిటరి ఇన్‌స్పెక్టర్‌గా ఎం.శ్రీనివాసరెడ్డి నియమితులయ్యారు. ఆమేరకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చాయి. శ్రీనివాసరెడ్డి అద్దంకి నుంచి గిద్దలూరు మున్సిపాలిటీకి బదిలీ అయ్యారు. గిద్దలూరు మున్సిపాలిటీ మేనేజర్‌గా పి.వి.రంగారావు నియమితులయ్యారు. ఆయన ఒకటి, రెండు రోజుల్లో బాధ్యతలు చేపట్టనున్నారు.

వరద బాధితులకు రూ.10వేల విరాళం

గిద్దలూరు, సెప్టెంబరు 4 : వరదల కారణంగా నష్టపోయిన బాధితులను ఆదుకునేందుకు మానవత సంస్థ తనవంతుగా 10,116 రూపాయల విరాళాన్ని ప్రకటించింది. ఆ మొత్తాన్ని వరద బాధితుల సహాయార్థం సీఎం సహాయనిధికి బ్యాంక్ ద్వారా పంపినట్లు సంస్థ అధ్యక్షులు పాలుగుళ్ళ శివారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

10వ తేదీ వరకే ఉచిత బస్‌పాస్‌లు

పొదిలి, సెప్టెంబరు 4 : 2024 విద్యా సంవత్సరానికి ఉచిత బస్‌పాస్‌లు పాఠశాల విద్యార్థినులకు, 12 సంవత్సరాలలోపు బాలురకు ఈనెల 10వ తేదీవరకు మాత్రమే ఇస్తారని ఎంఈవో శ్రీనివాసరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులందరూ త్వరగా బస్‌పాస్‌లు తీసుకోవాలని సూచించారు. తరువాత కావాలనుకుంటే డబ్బులు చెల్లించి తీసుకోవాల్సి ఉంటుందన్నారు.



కోతకు గురైన రోడ్డుకు చేస్తున్న మరమ్మతులు (ఇన్‌సెట్లో) గతంలో కోతకు గురైన రహదారి (ఫైల్)

రోడ్డుకు మరమ్మతులు

కంభం, సెప్టెంబరు 4 : తీవ్రవాయుగుండం ప్రభావంతో అర్ధవీడు మండలం పెద్దకందుకూరు-శంకరాపురం గ్రామాలకు వెళ్లే తారురోడ్డు కోతకు గురైంది. దీనితో ఆ రెండు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయి మూడు రోజులుగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పంచాయతీరాజ్ అధికారులకు వెంటనే ఆ రోడ్డుకు మరమ్మతులు చేయాలని ఆదేశించడంతో బుధవారం అధికారులు పూర్తిగా దెబ్బతిన్న రోడ్డుకు రిపేరు చేపట్టి వాహనాల రాకపోకలకు వీలు కల్పించారు. దీనితో గ్రామస్థులు ఎమ్మెల్యే అశోక్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.


కాలువలో చెత్త తొలగింపు కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న ఇమ్మడి కాశీనాథ్

కాలువ అభివృద్ధికి తోడ్పాటునిస్తాం

మార్కాపురం వన్‌టౌన్, సెప్టెంబరు 4: మార్కాపురం చెరువు సప్లై చానల్ అభివృద్ధికి ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డితో కలిసి కృషి చేస్తామని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి ఇమ్మడి కాశీనాథ్ అన్నారు. స్థానిక చెరువుకు నీరు అందించే సప్లై ఛానల్‌లో చెత్త తదితర అడ్డంకులను బుధవారం ఆయన తొలగింపజేశారు. నల్లమల్లలో వర్షాలు పడి గుండ్లకమ్మ వాగుకు నీరు వస్తున్నా కాలువ ద్వారా చెరువుకు నీరు చేరలేదని, గత వైసీపీ ప్రభుత్వ హయాంలో చెరువు, కాలువ మరమ్మతులకు కేటాయించిన రూ.2కోట్లు దుర్వినియోగం అయ్యాయని అన్నారు. మార్కాపురం చెరువులో నీరు నిలువ ఉంటే భూగర్భ జలాలు పెరిగి పట్టణ ప్రజల అవసరాలు తీరుతాయన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, కార్యకర్తలు, వీరమహిళలు పాల్గొన్నారు.


దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి నీరజ

ఎరువుల దుకాణం తనిఖీ

త్రిపురాంతకం, సెప్టెంబరు 4: ఏపీ పొగాకు ఉత్పత్తిదారుల సహకార సమాఖ్య ఎరువుల దుకాణంలో మండల వ్యవసాయాధికారిణి కె.నీరజ బుధవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. ఎరువుల భౌతిక నిల్వలను సరిచూశారు. ఎరువులను అధిక ధరలకు విక్రయించినా లేదా కృత్రిమ కొరత సృష్టించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులకు తప్పనిసరిగా కొనుగోలు రసీదులు ఇవ్వాలని సూచించారు. స్టాకు రిజిస్టర్లు, ఎరువులకు సంబంధించిన అన్ని రికార్డులు సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు.

నగరపంచాయతీ కమిషనర్‌గా శ్రీనివాసులు


బాధ్యతలు స్వీకరిస్తున్న కమిషనర్

పొదిలి, సెప్టెంబరు 4 : పొదిలి నగరపంచాయతీ నూతన కమిషనర్‌గా పూసలపాటి శ్రీనివాసులు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణంలో నెలకొన్న సమస్యలను సిబ్బందితో మాట్లాడి వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. పట్టణంలోని సమస్యలు, ఇతర ఇబ్బందులను శానిటరీ ఇన్‌స్పెక్టర్ మారుతీరావ్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి సమస్యల పరిష్కారంపై సిబ్బందికి తగు సూచనలు చేశారు.

కమిషనర్‌ను కలిసిన వీఆర్వోలు

గిద్దలూరు టౌన్, సెప్టెంబరు 4 : ఇటీవల నూతనంగా నియమితులైన మున్సిపల్ కమిషనర్ వెంకటదాసును రెవెన్యూ సిబ్బంది బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియచేశారు. సమావేశంలో జిల్లా వీఆర్వోల సంఘం అధ్యక్షులు రంగయ్య, గిద్దలూరు మండల వీఆర్వోలు అచ్చయ్య, నాగేంద్ర, రంగనాథ్, ఈశ్వర్‌రెడ్డి, రామలింగయ్య, వీరనారాయణ పాల్గొన్నారు.


కమిషనర్‌ను సత్కరిస్తున్న వీఆర్వోలు

అగ్రిగోల్డ్ భూముల్లో జామాయిల్ కర్ర తరలింపుపై కేసు



పోలీస్‌స్టేషనలో జామాయిల్ కర్ర వాహనం

పామూరు, సెప్టెంబరు 4 : జామాయిల్ కర్రతో అ క్రమంగా తరలివెళుతున్న వాహనాన్ని సీఐ భీమానాయక్ తన సిబ్బందితో కలిసి మంగళవారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని గు మ్మళంపాడు గ్రామంలో అగ్రిగోల్డ్ సంస్థకు చెందిన జామాయిల్ తోటలను గు ర్తు తెలియని వ్యక్తులు అక్రమంగా నరికి వాహనం ద్వారా తరలిస్తున్నారని వీఆర్వో శివశంకర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆ మేరకు సీఐ భీమానాయక్ తన సిబ్బందితో వలపన్ని అక్రమంగా తరలివెళుతున్న సుమారు 12 టన్నుల జామాయిల్ లోడు వాహనాన్ని అదుపులో తీసుకొన్నారు. డ్రైవర్ దేవనబోయిన నాగరాజుపై కేసు నమోదు చేశారు.

పిచ్చి కుక్క దాడిలో బాలుడికి గాయాలు

కురిచేడు, సెప్టెంబరు 4 : కురిచేడు మండలం అలవలపాడు గ్రామంలో పిచ్చి కుక్క స్వైరవిహారం చేసింది. పిచ్చి కుక్క దాడిలో బాపట్ల అంకమ్మరావుకు గాయపడ్డాడు. బాలుడి వీపు, చేతిపై బలమైన గాయాలయ్యాయి. బాలుడిని కురిచేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి బాలుడి తల్లిదండ్రులు తీసుకొచ్చారు. బాలుడికి ప్రాథమిక చికిత్స చేశారు. శరీరంపై బలమైన గాయాలు కావడంతో 108 అంబులెన్స్‌లో వినుకొండకు తరలించారు.

దేవస్థాన భూముల్లోని ఆక్రమణల తొలగింపు


ఆక్రమణను తొలగిస్తున్న అధికారులు

పామూరు, సెప్టెంబరు 4 : స్థానిక మదన వేణుగోపాలస్వామి దేవస్థానానికి చెందిన సర్వేనెంబర్ 176/2లోని 13.86 ఎకరాల అర్చకుల మాన్యం భూమిలో రియల్టర్లు తమ వెంచర్‌లోకి వెళ్లేందుకు అక్రమంగా నిర్మించిన రహదారి ఆక్రమణ తొలగింపు చర్యలను ఈవో శ్రీ గిరిరాజు నరసింహబాబు బుధవారం చేపట్టారు. రియల్టర్లు తమ వెంచర్లలోని ప్లాట్లు అమ్ముకొనేందుకు అవసరమైన రహదారి నిర్మాణానికి రూ.30 లక్షలు ఇచ్చి మాన్యం భూమిలో రోడ్డు నిర్మించారని ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో దేవస్థాన భూముల పరిశీలనకు వచ్చిన దేవదాయ ధర్మాశాఖ డిప్యూటి కమిషనర్ మహేశ్వరరెడ్డి మాన్యం భూమిలో నిర్మించి ఉన్న రహదారిని తొలగించి ఫెన్సింగ్ వేసి రక్షణ చర్యలు చేపట్టాలని ఈవోకు ఆదేశించారు. డీసీ ఆదేశాలతో యంత్రాలతో ఆక్రమణ చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు సత్యనారాయణ, మాజీ చైర్మన్ కావిటి సుబ్బయ్య, చైర్మన్ గుర్రం వెంకటేశ్వర్లు, కమిటీ సభ్యులు నరసింహ, పసుపులేటి రఘురాం పాల్గొన్నారు.

వరద బాధితులకు ఆహారం అందజేత


ఆహారం, నీటి ప్యాకెట్లను తీసుకువెళ్తున్న వాహనం వద్ద నేతలు

ముండ్లమూరు, సెప్టెంబరు 4 : మండలంలోని మారెళ్ల గ్రామానికి చెందిన సీనియర్ టీడీపీ నాయకుడు మట్టా సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో విజయవాడలోని వరద బాధితులకు బుధవారం గ్రామం నుంచి ఆహారం, మంచి నీటి ప్యాకెట్లను తరలించారు. సుబ్బారెడ్డి, ఆయన మిత్ర బృందం ఆధ్వర్యంలో ప్రత్యేకంగా వాహనాన్ని ఏర్పాటు చేసి పంపించారు. దర్శి టీడీపీ ఇన్‌చార్జ్ గొట్టిపాటి లక్ష్మి ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో చేకూరి హనుమంతరావు, గార్లపాటి కృష్ణ, టీ లక్ష్మీనారాయణ, దర్శి నియోజవర్గ కన్వీనర్ పూరిమెట్ల యల్లయ్య, గార్లపాడు శ్రీను, సత్యనారాయణ, మీరావలి, రామాంజీ, రఫీ, శ్రీను, సురేష్ పాల్గొన్నారు.

'విజయవాడ' సహాయక చర్యల్లో కోటపాటి


ఆహార ప్యాకెట్లను అందజేస్తున్న కోటపాటి

పామూరు, సెప్టెంబరు 4 : విజయవాడ వరద ప్రభావిత ప్రాంతాల్లో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోటపాటి జనార్దనరావు సహాయక చర్యల్లో పాల్గొంటున్నారు. నిరాశ్రయులకు ఆహార ప్యాకెట్లను అందజేస్తున్నారు. చంద్రబాబు ఆదేశాలతో కనిగిరి, చీరాల ఎమ్మెల్యేలు ఉగ్రనరసింహారెడ్డి, ఎంఎం కొండయ్యతో కలసి వరద ప్రభావిత ప్రాంతాల్లో బోట్లపై పర్యటిస్తు వరద ముంపు ప్రాంతాలను పరిశీలించారు.

వరద బాధితులకు బాప్టిస్టు చర్చి ప్రతినిధుల సాయం


ఆహారం పంపిణీ చేస్తున్న ప్రతినిధులు

కురిచేడు, సెప్టెంబరు 4 : విజయవాడ వరద బాధితులకు కురిచేడుకు చెందిన తెలుగు బాప్టిస్టు చర్చి ప్రతినిధులు బుధవారం ఆహారం పంపిణీ చేశారు. కురిచేడులో ఆ సంస్థ ప్రతినిధులు ఆహారం తయారు చేయించారు. దుస్తులు సేకరించారు. వాటిని విజయవాడకు తీసుకెళ్లి బాధితులకు పంపిణీ చేశారు. చర్చి సభ్యులు కంభంపాటి ఏసుదాస్, మాణిక్యరావు, బాబూరావు, సిర్రయ్య, అజయ్‌కుమార్, మరియబాబు, రిజర్ట్‌సన్, శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

మోపాడులో చిల్లచెట్ల తొలగింపు


చిల్లచెట్లను తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్లు

పామూరు, సెప్టెంబరు 4 : మండలంలోని మోపాడు రిజర్వాయర్ ఆధునికీకరణలో భాగంగా లోపలి ప్రాంతంలో మొలచిన చిల్లచెట్లను ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి ఆదేశాలతో అధికారులు యంత్రాలతో తొలగించే కార్యక్రమాలు చేపట్టారు. తొలగించిన చిల్లచెట్లను తగలబెట్టారు. ఎన్నో ఏళ్లుగా రిజర్వాయర్ లో దట్టంగా పెరిగి ఉన్న చెట్లను తొలగించడంతో ఆయకట్టుదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. త్వరలో జైకా నిధులతో రిజర్వాయర్ కట్టపై పెరిగిన చెట్లను కూడా తొలగించి కట్టను వెడల్పు చేయనున్నట్లు సిబ్బంది చెప్పారు.

కేజీబీవీకి ఇన్‌వర్టర్ బహూకరణ

వీసీపల్లి, సెప్టెంబరు 4 : ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ జన్మదినం సందర్భంగా జనసేన పార్టీ సెంట్రల్ ఆంధ్ర కమిటీ మెంబర్ మాదాసు రమేష్ పీసీపల్లి కేజీబీవి పాఠశాలకు 41వేల విలువైన ఇన్వెర్టర్‌ను బుధవారం అందజేశారు. ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి, మండల విద్యాశాఖ అధికారి ఆర్.శ్రీనివాసులు, ఈఓఆర్డీ మల్లేశ్వరి, కేజీబీవీ ప్రత్యేక అధికారిణి సుజాత, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు వేమూరి రామయ్య, మూలె సత్తిరెడ్డి, మూలె మహేంద్ర, బద్దిపూడి ఎబినేజరు, గుంటగాని జోసెఫ్, కోమటిగుంట్ల వీరయ్య, చిన బ్రహ్మయ్య పాల్గొన్నారు.

గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలి

సీఎస్‌పురం(పామూరు) సెప్టెంబరు 4 : గర్భిణులు, బాలింతలు పోషక విలువైన ఆహారాన్ని తీసుకోవాలని సెక్టార్ సూపర్‌వైజర్ దేవాకృపావరం చెప్పారు. సీఎస్‌పురంలోని రెండు అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం పౌష్టికార మహోత్సవాల కార్యక్రమం నిర్వహించారు.

వడ్డీల పంచాయితీలు



దర్శి ప్రాంతంలో మితిమీరుతున్న వడ్డీ వ్యాపారుల ఆగడాలు
తనఖా ఆస్తులతో తీసుకున్న అప్పులపై ఎక్కువ వివాదాలు
పోలీస్‌స్టేషన్ల వరకూ వెళుతున్న పేచీలు

దర్శి, సెప్టెంబరు 4 : దర్శి ప్రాంతంలో వడ్డీ వ్యాపారుల ఆగడాలు రోజురోజుకూ అధికమవుతున్నాయి. కొంతమంది అధిక వడ్డీలతో జనాలను ఇబ్బందులు పెడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. కొందరు సంస్థ పేరుతో రిజిస్ట్రేషన్లు చేసుకొని వడ్డీ వ్యాపారాలు చేస్తుండగా, మరికొంతమంది ఎలాంటి రిజిస్ట్రేషన్లు లేకుండా అనధికారికంగా అప్పులు ఇచ్చి వసూలు చేసుకుంటున్నారు. ముఖ్యంగా ఆస్తులను రిజిస్టర్లు చేసుకొని అప్పులు ఇచ్చి అధిక వడ్డీలతో చెల్లించమంటున్నారు. ఇలా అప్పులు తీసుకున్న వారిలో కొందరు గతంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం కూడా చేశారు. ప్రస్తుతం రియల్ భూం మందగించటంతో అప్పులు తీసుకున్న వ్యక్తులు సకాలంలో చెల్లించలేకపోతున్నారు. ఈ నేపథ్యంలో ష్యూరిటీ కోసం రిజిస్టర్లు చేసుకున్న ఆస్తులను వడ్డీ వ్యాపారులు స్వాధీనం చేసుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. న్యాయబద్ధమైన వడ్డీ చెల్లిస్తామని చెబుతున్నప్పటికీ ఆస్తులు వారి పేర ఉన్నాయనే ధీమాతో కొంతమంది వ్యాపారులు వినిపించుకోవటం లేదు. దీంతో కొన్ని పంచాయితీలు పోలీస్‌స్టేషన్ వరకూ వెళ్తున్నాయి. వడ్డీ వ్యాపారులు నోట్లు రాయించుకోవటంతో పాటు ఆస్తులు రిజిస్టేషన్ చేయించుకొని తమకేమి కాదన్న ఉద్దేశంతో రుణగ్రస్తులపై ఒత్తిడి పెంచుతున్నారు. ఈ వివాదాలు ముదిరి తీవ్రమవుతున్నాయి.

ఇటీవల కాలంలో నాలుగైదు పంచాయితీలు

దర్శి నగర పంచాయతీ పరిధిలో రెండుమూడునెలలలోపు వడ్డీ వ్యాపారుల పంచాయితీలు భారీ స్థాయిలో నాలుగు వరకు జరిగాయి. కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారుల వద్ద తీసుకున్న రుణాలు విషయంలో చివరకు పోలీస్ స్టేషన్ కు వెళ్లి ఏదో రకంగా పరిష్కారం చేసుకోగా మరికొన్ని పేచీలతో నడుస్తూనే ఉన్నాయి. గతంలో వడ్డీ వ్యాపారులు వేధిస్తున్న సంఘటనలు వెలుగులోకి రావటంతో విజయవాడలో అక్రమార్కులపై కాల్‌మనీ కేసులు పెట్టిన విషయం తెలిసిందే. అక్కడ రోజువారీ, నెలవారీ వడ్డీలు వసూళ్లు చేస్తున్న అనేకమందిపై కేసులు నమోదు చేశారు. దర్శి ప్రాంతంలో ఈ పేచీలు రోజురోజుకూ పెరుగుతుండటంతో బాధితులు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఏదోరకంగా న్యాయబద్ధమైన వడ్డీతో అప్పులు చెల్లిస్తామని చెబుతున్నా ఆస్తులకు విలువలు పెరగటంతో వడ్డీ వ్యాపారులు పేచీలు పెడుతుండటంతో సమస్యలు జటిలమవుతున్నాయి. దీంతో జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసి న్యాయం పొందేందుకు పలువురు సిద్ధమవుతున్నట్లు సమాచారం.

ఆన్‌లైన్ రుణాలతోనూ ఇబ్బందులు

ఇటీవల కాలంలో ఆన్‌లైన్ రుణాలు తీసుకొని పలువురు యువకులు వారి ఒత్తిడి తట్టుకోలేక ఇబ్బంది పడుతున్న సంఘటనలు వెలుగులోకి వచ్చాయి. యువకులను ఆన్‌లైన్‌లో పరిచయం చేసుకొని మాయమాటలు చెప్పి రుణాలు ఇస్తున్నారు. వారు వసూళ్లు చేసే వడ్డీ చెల్లించలేక యువకులు ఏం చేయాలో పాలుపోక అల్లాడుతున్నారు. ఇటీవల ముండ్లమూరు మండలంలోని ఓ గ్రామంలో ఓ వ్యక్తి ఆన్‌లైన్ రుణం తీసుకున్నారు. గడువులోపు చెల్లించకపోవడంతో ఆ యాప్ వారు వేధింపులకు పాల్పడ్డారు. అలాగే రుణాలు చెల్లించని వారి బంధువులు కొంతమందికి సంబంధిత వ్యక్తి అశ్లీల ఫొటోలు పంపించి బెదిరింపులకు పాల్పడుతున్నారు. ఇలాంటి సంఘటనలు దర్శి, ముండ్లమూరు మండలాల్లో ఇటీవల కాలంలో వెలుగులోకి వచ్చాయి. కుటుంబ సభ్యులు తెలుసుకొని ఏదోరకంగా ఆ రుణాలు చెల్లించారు. పోలీసులు కూడా ఆన్‌లైన్ రుణాలు తీసుకోవద్దని సూచిస్తున్నారు.

వరద ప్రాంతాల్లో ఉగ్ర పారిశుధ్య చర్యలు


శానిటేషన్ పనులు చేయిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

కనిగిరి, సెప్టెంబరు 4 : రాజధానిలో వరద ప్రభావిత ప్రాంతాల్లో ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర సహాయక చర్యల్లో నిమగ్నమయ్యారు. బుధవారం విజయవాడలోని 41వ డివిజన్‌లో ప్రతి వీధిని, ఇంటిని సందర్శిస్తూ పారిశుధ్య చర్యలు చేపట్టారు. కార్పొరేషన్, అగ్నిమాపక, పారిశుధ్య సిబ్బంది, హెల్త్ సిబ్బందితో ఓ బృందంగా ఏర్పడి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర ప్రతి ఇంటి పరిస్థితిని స్వయంగా వెళ్ళి పరిశీలించారు. అగ్నిమాపక సిబ్బందిచే ప్రతి ఇంటిలో పేరుకుపోయిన బురదను వాటర్‌గన్ సాయంతో శుభ్రం చేయించారు. అదేవిధంగా ఇంటిలోని గృహోపకరణాలను కూడా నీటితో శుభ్రం చేయించారు. కార్పొరేషన్ సిబ్బందిచే సైడు డ్రెయిన్‌లలో పేరుకు పోయిన చెత్త, చెదారాలను తొలగించి పారిశుధ్య నిర్మూలన చర్యలు చేపట్టారు. అదేవిధంగా ప్రతి ఇంటి సందర్శనకు వెళ్ళినపుడు ఆయా గృహాల వాసులకు ఏవైనా అనారోగ్య సమస్యలు ఉన్నాయో విచారించి ఆరోగ్య సిబ్బందిచే వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేయించారు. అదేవిధంగా ప్రతి ఇంటికి ప్రత్యేక ట్యాంకర్ల ద్వారా మంచినీటిని పోయించారు. అదేవిధంగా వాడుకనీటిని కూడా వేరుగా డ్రమ్ములకు పట్టించారు. ఇంటి ఆవాసాల్లో ఉన్న చెత్తకుప్పలను తొలగించి వేయించే ఏర్పాట్లు చేశారు. బృందంతో కలసి నిరంతరం సహాయక పనులను చేయిస్తున్నారు. దోమలు ప్రబలకుండా ఫాగింగ్, బ్లీచింగ్ చల్లించే ఏర్పాట్లు చేశారు. ఆయన వెంట కనిగిరి ప్రాంతానికి చెందిన టీడీపి నాయకలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తూర్పుగంగవరంలో వ్యాపారులకు నోటీసులు


తూర్పుగంగవరంలో రోడ్డు ఆక్రమించి తోపుడు బండ్లు ఏర్పాటు చేసిన దృశ్యం

తాళ్లూరు, సెప్టెంబరు 4 : మండలంలోని తూర్పు గంగవరం గ్రామంలో రోడ్లు ఆక్రమించి వ్యాపారాలు చేస్తూ ట్రాఫిక్‌కు ఇబ్బందులు కల్గిస్తున్న వారికి గ్రామపంచాయతీ కార్యదర్శి టి.అజయ్‌కీర్తి బుధవారం నోటీసులు జారీ చేశారు. గ్రామంలో చీమకుర్తి రోడ్డు నుంచి దర్శి వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణదారులు సైడు కాలువలు దాటి రోడ్డును ఆక్రమించి బంకులు, తోపుడు బండ్లు, టీదుకాణాలు రేకులు ఏర్పాటు చేశారు. దీంతో రోడ్డు ఇరుకుగా మారి రాకపోకలకు అవరోధంగా మారింది. తరచూ ట్రాఫిక్‌కు ఇబ్బందులు ఎదరవుతున్నాయి. సైడు కాలువలను ఆనుకుని రోడ్లపై వ్యాపారాలు సాగిస్తున్నందున వాటిని తొలగించేందు గ్రామ సర్పంచ్ చర్యలు చేపట్టారు. ఆ మార్గంలో సైడుకాలువలను ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్న 200 మందికి నోటీసులు జారీ చేశారు. 7 రోజులలోపు స్వచ్ఛందంగా ఆక్రమణలు తొలగించాలని కార్యదర్శి చెప్పారు. ఆక్రమణలు తొలగించకుంటే పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం పంచాయతీ తొలగించి అందుకు అయిన ఖర్చును వసూలు చేస్తామన్నారు.

ముండ్లమూరులో ముమ్మరంగా పారిశుధ్య కార్యక్రమాలు


కాలువలు శుభ్రంచేస్తున్న కార్మికులు

ముండ్లమూరు, సెప్టెంబరు 4 : ముండ్లమూరులో 15 రోజుల నుంచి ముమ్మరంగా పారిశుధ్య కార్యక్రమాలు చేపడుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మురుగు కాలువలను శుభ్రం చేయలేదు. దీంతో కాలువలు పూడుకుపోయాయి. ఐదు రోజుల క్రితం కురిసిన వర్షాల వల్ల నీరు బయటకు పోకపోవటంతో ప్రజల ఇళ్ల ముందు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గ్రామ టీడీపీ నాయకులు మేదరమెట్ల వెంకటరావు, సర్పంచ్ ఒద్దిపోగు ఆదిలక్ష్మి గురవయ్య, మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు సోమేపల్లి శ్రీనివాసరావులు పంచాయతీ అధికారులతో మాట్లాడి కాలువల్లో పేరుకుపోయిన మురుగును తొలగించేటట్లు ఏర్పాటు చేశారు. దీంతో బస్టాండ్ సెంటర్‌లోని ప్రధాన కాలువతో పాటు గ్రామంలో ఉన్న పలు కాలువల్లో పేరుకుపోయిన మురుగును తొలగించే కార్యక్రమం చేపట్టారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి ఈ రాజశేఖరరెడ్డి దగ్గరుండి పారిశుధ్య కార్యక్రమాలు చేయిస్తున్నారు.

పీసీపల్లి మండలంలో...

పీసీపల్లి, సెప్టెంబరు 4 : సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్తగా మండలంలోని అన్ని గ్రామాల్లో బుధవారం పంచాయతీ సిబ్బంది పారిశుధ్య కార్యక్రమం చేపట్టారు. ఇటీవల కురిసిన వర్షాలకు పలు గ్రామాల్లోని ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి అన్ని గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమం చేపట్టాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ఆ మేరకు గ్రామాల్లోని వీధుల్లో మురుగు ఉన్నచోట బ్లీచింగ్ చల్లించారు. ఈ పనులను ఈఓఆర్డీ మల్లేశ్వరి, పంచాయతీ కార్యదర్శులు పర్యవేక్షించారు.

కురిచేడులో గ్యాస్ సిలిండర్ల కష్టాలు

కురిచేడు, సెప్టెంబరు 4: మండలంలో గ్యాస్ వినియోగదారులకు కష్టాలు మొదలయ్యాయి. అధిక శాతం మందికి వినుకొండ హెచ్‌పీ గ్యాస్ కంపెనీ నుంచి, మరికొంత మందికి దొనకొండ ఐఓసీ నుంచి సిలిండర్లు వస్తాయి. కురిచేడులో భారత్ గ్యాస్ ఏజెన్సీ కూడా ఉంది. అధికశాతం మంది ఇప్పటికీ వినుకొండ నుంచి హెచ్‌పీ వినియోగదారులే ఉన్నారు. వినుకొండ హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ వారికి విజయవాడ పక్కనే ఉన్న కొండపల్లి వద్ద నుంచి గ్యాస్ సిలిండర్లు వస్తాయి. విజయవాడలో వరదలతో జనజీవనం అస్తవ్యస్తం కావడంతోపాటు రాకపోకలు కష్టతరంగా మారాయి. దీంతో వినుకొండ ఏజెన్సీకి సిలిండర్ల పంపిణీ ఆగింది. వర్షాలకు ముందు కూడా నాలుగు రోజుల పాటు గ్యాస్ సిలిండర్ల పంపిణీ జరగలేదు. వర్షాలతో మరో నాలుగు రోజులపాటు సిలిండర్ల రాలేదు మొత్తంమీద వారం రోజులకు పైగా గ్యాస్ సిలిండర్లు పంపిణీ లేకపోవడంతో వినియోగదారులకు గ్యాస్ కష్టాలు మొదలయ్యాయి. వెంటనే సిలిండర్లు పంపిణీ చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు.

నేరాల అదుపునకు చర్యలు తీసుకోవాలి

అడిషనల్ ఎస్పీ(క్రైం) శ్రీధర్‌రావు

ముండ్లమూరు, సెప్టెంబరు 4 : మండలంలోని నేరాలకు పోలీసులు అడ్డుకట్ట వేయాలని, చిన్నపాటి నేరం కూడా జరగకుండా చూడాలని జిల్లా అడిషనల్ ఎస్పీ(క్రైం) శ్రీధర్‌రావు చెప్పారు. ఆయన బుధవారం సాయంత్రం ముండ్లమూరు పోలీసు స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా సీఐ వై రామారావు, ముండ్లమూరు, తాళ్ళూరు ఎస్‌ఐలు వై నాగరాజు, ఎస్ మల్లికార్జునరావులతో సమావేశం అయ్యారు. ఇటీవల మండలంలో జరుగుతున్న ట్రాన్స్‌ఫారాల చోరీలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రతి పంచాయతీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకొని దొంగతనాలు అరికట్టాలని చెప్పారు.

మారెళ్ల స్కూల్ బస్సు సర్వీసు పొడిగింపు

ముండ్లమూరు, సెప్టెంబరు 4 : మండలంలోని మారెళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చదువుకొనేందుకు వచ్చిన విద్యార్థులకు మక్కెనవారిపాలెం, జమ్మలమడక తిరిగి వెళ్లేందుకు ప్రతి రోజూ బస్సు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితుల్లో మారెళ్ల గ్రామానికి చెందిన మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు మట్టా సుబ్బారెడ్డి ఇటీవల దర్శి టీడీపీ ఇన్‌చార్జ్ గొట్టిపాటి లక్ష్మి, లలిత సాగర్‌ల దృష్టికి ఈ విషయం తీసు కుపోయారు. వెంటనే స్పందించిన లక్ష్మీ సాగర్ దంపతులు అద్దంకి డిపో మేనేజరుతో మాట్లాడారు. అనంతరం రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపా టి రవి కుమార్‌తో మాట్లాడి ముండ్లమూరు నుంచి మారెళ్ల వరకు వ చ్చే ఆర్టీసీ బస్సును జమ్మలమడక, మక్కెనవారిపాలెం వరకు పొడిగించారు.

జూదరులకు జైలు

కనిగిరి, సెప్టెంబరు 4: పేకాట ఆడుతూ పట్టుబడ్డ ఆరుగిరికి కనిగిరి జూనియర్ సివిల్‌కోర్టు జడ్జి భరత్‌చంద్ర ఒక్కొక్కరికి రూ.3వేల జరిమానా, 5రోజులు జైలుశిక్ష విధించినట్లు ఎస్‌ఐ త్యాగరాజు బుధవారం తెలిపారు. గత నెలలో పట్టణంలోని ఏ1 లాడ్జిలో పేకాట ఆడుతుండగా పోలీసులు ఆకస్మిక దాడి చేసి పట్టుకున్నారు. ఈ మేరకు ఆరుగురికి అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి కోర్టుకు పంపారు. దీంతో బుధవారం జడ్జి వారికి జైలుశిక్ష, జరిమానా విధించారు.

అవాంఛనీయ సంఘటనలకు పాల్పడితే చర్యలు

కనిగిరి, సెప్టెంబరు 4: వినాయకచవితి వేడుకల్లో అవాంఛనీయ ఘటనలకు పాల్పడిత కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ ఖాజావలి హెచ్చరించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బుధవారం శాంతి సమావేశం జరిగింది. సమావేశంలో ఎస్‌ఐ త్యాగరాజు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన అధికారులు

పీసీపల్లి, సెప్టెంబరు 4 : మండలంలోని పెదయిర్లపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో అధికారులు, టీడీపీ నాయకులు బుధవారం మొక్కలు నాటారు. ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ప్రతిఒక్కరూ తమ ఇళ్లు, నివాస ప్రాంతాల్లో మొక్కలు నాటాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పోలం లక్ష్మీదేవి, ఎంఈవో ఆర్.శ్రీనివాసులు, ఈఓఆర్డీ మల్లేశ్వరి, టీడీపీ గ్రామకమిటీ అధ్యక్షుడు కొండపనాయుడు, ఉప్పుగుండ్ల శివరామయ్య, పాలూరి మహేంద్ర, రమణారెడ్డి, మాదాసు రమేష్, ఎన్‌ఆర్జీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ మాదాసు చినబ్రహ్మయ్య పాల్గొన్నారు.

కాలం చెల్లిన స్తంభాలను మార్చాలి

పామూరు, సెప్టెంబరు 4 : కాలం చెల్లిన విద్యుత్ స్తంభాలను, తీగలను మార్చి ప్రమాదాలు జరగకుండా నివారణ చర్యలు తీసుకోవాలని కోరుతు సీపీఎం ఆధ్వర్యంలో ఏఈ షేక్ జిలాని బాషకు బుధవారం వినతి పత్రం అందజేశారు. పట్టణంలో ఉన్న పాత స్తంభాలను మార్చి వేలాడుతున్న తీగలను సరిచేయాలని సూచించారు. వార్డు మెంబరు షేక్ ఇస్మాయిల్, షేక్ అల్లభక్ష్, కే శంకర్, సిహెచ్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

తూర్పుగంగవరం రేషన్ డీలర్ అంజమ్మ రాజీనామా

తాళ్లూరు, సెప్టెంబరు 4 : మండలంలోని తూర్పుగంగవరం 10 నంబర్ రేషన్ షాపు డీలర్ యత్తపు అంజమ్మ తన డీలర్ షిప్‌కు రాజీనామా చేశారు. ఆ మేరకు రాజీనామాపత్రాన్ని తహసీల్దార్ సింగారావుకు బుధవారం అందజేశారు. అనారోగ్యంతో డీలర్ షిప్ నిర్వహణ కష్టంగా ఉన్నందున రాజీనామా చేస్తున్నానని, వెంటనే ఆమోదించాలని ఆమె కోరారు.

టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు మృతి

పీసీపల్లి, సెప్టెంబరు 4 : మండలంలోని మారెళ్ల గ్రామానికి చెందిన టీడీపీ గ్రామకమిటీ అధ్యక్షుడు పరిమి వెంకటేశ్వర్లు(52) అనారోగ్యంతో మంగళవారం రాత్రి మృతి చెందాడు. ఇటీవల వెంకటేశ్వర్లు ఆరోగ్యం బాగలేక చికిత్స కోసం వైద్యశాలకు వెళ్లాడు. గుంటూరు వైద్యశాలలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. మృతదేహాన్ని కుటుంబసభ్యులు బుధవారం మారెళ్లకు తీసుకువచ్చారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు నివాళులర్పించారు.

నూతన విద్యుత్ స్తంభాల ఏర్పాటు



విద్యుత్ స్తంభాల ఏర్పాటు చేస్తున్న ఏఈ జిలాని

పామూరు, సెప్టెంబరు 4 : పట్టణంలోని అంకాలమ్మవీధిలో నూతన విద్యుత్ స్తంభాల ఏర్పాటు పనులను ఏఈ షేక్ జిలాని బాష బుధవారం పర్యవేక్షించారు. ఎంపీటీసీ సభ్యుడు ఆకుపాటి వెంకటేష్ నూతన విద్యుత్ స్తంభాలు లేక ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఎమ్మెల్యే ఉగ్ర దృష్టికి తెచ్చారు. ఈ నేపథ్యంలో ఉగ్ర ఆదేశాలతో అంకాలమ్మ వీధిలో నూతన విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి ప్రజల సమస్యను పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో నీరుకట్టు నాయబ్‌రసూల్, లైన్‌మెన్ షేక్ కాలేషా, చిట్టిబాబు సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు ప్రారంభం

పామూరు, సెప్టెంబరు 4 : బీజేపీ సభ్యత్వాల నమోదుకు ప్రజల నుంచి ఆదరణ లభిస్తుందని ఆ పార్టీ అసెంబ్లీ కన్వీనర్ కేవీ రమణయ్య చెప్పారు. మండల పార్టీ అధ్యక్షుడు చినసుబ్బయ్య అధ్యక్షతన పార్టీ సభ్యత్వాలను బుధవారం చేపట్టారు. 8800002024 నెంబర్‌కు మిస్డ్ కాల్ ఇచ్చి సభ్యత్వం నమోదు చేయించుకోవచ్చని రమణయ్య తెలిపారు. కేవీ సుబ్బారావు, ఉమ్మడిశెట్టి శ్రాను, విజయకుమార్‌చారి, కోటా సురేష్, కే గోపాల్,బీ హజరత్, సీహెచ్ మల్లికార్జున, శ్రీనివాసులు, వెంకటచరణ్, చల్లగుండ్ల గోకుల్, గణేష్, పాడే అరవింద్, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

పీఎంశ్రీ పాఠశాలలపై ప్రత్యేక శ్రద్ధ

సీఎస్‌పురం(పామూరు), సెప్టెంబరు 4 : పీఎంశ్రీ పాఠశాలలపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టి అభివృద్ధి చేస్తున్నట్లు ఎంఈవో రాజాల కొండారెడ్డి చెప్పారు. సీఎస్‌పురంలోని పీఎంశ్రీ ఉన్నత పాఠశాలను హెచ్‌ఎం ఖాదరున్నీసాతో కలిసి బుధవారం పరిశీలించారు. స్వచ్ఛ పక్వాడా కార్యక్రమంలో భాగంగా ప్రతి రోజు అన్ని పాఠశాలల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని, అందుకు సంబంధించిన ఫొటోలను గూగుల్ లింక్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు.

వరి సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలి

దర్శి, సెప్టెంబరు 4 : వరిసాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలని వ్యవసాయాధికారి బాలకృష్ణానాయక్ సూచించారు. మండలంలోని చెరువుకొమ్ముపాలెంలో బోర్ల కింద సాగుచేసిన వరిపైరును సిబ్బందితో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువులు, పురుగుమందులు తగు మోస్తాదులో వాడుకోవాలన్నారు. సాగు చేసిన పైర్లను కచ్చితంగా ఈ క్రాప్ చేసుకోవాలని చెప్పారు.

చెడు వ్యసనాలకు బానిసలైతే విచక్షణ కోల్పోతారు

దొనకొండ, సెప్టెంబరు 4 : యువత చెడువ్యసనాలకు బానిసలైతే విచక్షణ కోల్పోయి అన్ని విధాల నష్టపోతారని స్థానిక గౌతమి డిగ్రీ కాలేజి ప్రిన్సిపల్ రామయోగి చెప్పారు. బుధవారం కాలేజీలో డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాలకు బానిసై ఆ గుర్తింపును కోల్పోవద్దని సూచించారు. మత్తు పదార్థాల వలన జరిగే అనర్థాలను మహిళా పోలీస్ శిరీష వివరించారు. ఈ కార్యక్రమంలో కాలేజీ అడ్మిన్ ఎఫ్రాయిమ్(నాని), అధ్యాపకులు దేవదానం, వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.


అరవింద వారధిపై చేరిన చెత్తను ఎత్తిపోస్తున్న ఎక్స్‌కవేటర్

నష్టం.. కష్టం

వర్షాలు, వరదలతో బీభత్సం

నీటిలో నానుతున్న పంట పొలాలు

- దిక్కుతోచని స్థితిలో రైతులు కన్నీటి పర్యంతం
- లంక గ్రామాల్లో సర్వం కోల్పోయిన కుటుంబాలు
- వరద ఉధృతికి కొట్టుకుపోయిన రోడ్లు, ట్రక్కులు, గోడలు


రేపల్లె : పల్లెపాలెంలో బురదమయమైన ఇంట్లో వస్తువులను శుభ్రం చేసుకుంటున్న మహిళలు

వరుణుడు విరామం తీసుకున్నాడు. కృష్ణమ్మ కరుణించింది. వర్షాలు, వరదల బీభత్సం బుధవారం నుంచి బయటపడుతుంది. కృష్ణా నదీ పరివాహక ప్రాంతం గ్రామాలు, లంకల్లో ఎవరిని కదిపినా కన్నీటి సంద్రమే. పంటలు కోల్పోయి కొందరు.. వ్యవసాయసామగ్రి గల్లంతై మరికొందరు.. మూగజీవాలు కనిపించక పలువురు.. ఇళ్లకు నష్టం వాటిల్లి కొందరు.. ఇలా ఎక్కడ చూసినా వరద బీభత్స బాధితులు కనిపిస్తున్నారు. ఎటు చూసినా నీరు.. కళ్లల్లో కన్నీటి వరద.. సర్వం కోల్పోయి కట్టుబట్టలతో మిగిలిన స్థితి పలువురిది. కృష్ణమ్మ మహోగ్రంతో గొడ్డు, గోద, పొలం, పుట్ర ఏదీ అక్కరకు రాకుండా పోయిందని లంకలు, పరివాహక గ్రామాల్లోని ప్రజలు కన్నీటి పర్యంత మవుతున్నారు. వరద తగ్గుముఖం పట్టడంతో పంటలకు, ఆస్తులకు ఏరీతిలో.. ఎంతమేర నష్టం వాటిల్లిందో బాధితులు చూసుకుంటున్నారు. ఇక ఉమ్మడి గుంటూరు జిల్లావ్యాప్తంగా అధికారులు నష్టం అంచనాల్లో నిమగ్నమయ్యారు. పంటల నష్టం లెక్కించేందుకు వ్యవసాయ, ఉద్యానశాఖలు ప్రత్యేక బృందాలను నియమించాయి. ప్రాథమిక అంచనాల్లోనే వేల ఎకరాలు ఉండటంతో వర్షాలు, వరద బీభత్స నష్టం అపారమని తెలుస్తోంది.

తెనాలి, బాపట్ల(ఆంధ్రజ్యోతి), కొల్లూరు, కొల్లిపర, సెప్టెంబరు 4: కృష్ణమ్మ ప్రకోపానికి నదీపరివాహక గ్రామాలు, లంకలు విలవిలలాడిపోయాయి. ప్రకాశం బ్యారేజీ నుంచి రికార్డు స్థాయిలో నీటి ప్రవాహంతో వర్షం వరదగా మారి పొలాలను కబళించింది. కొల్లూరు, భట్టిప్రోలు, చుండూరు మండలాల పరిధిలో ఉద్యాన పంటలతో పాటు వరి కూడా పూర్తిగా నీట మునిగింది. బ్యారేజీకి ఎగువన భారీ వర్షాలు, కృష్ణానదికి వరదతో పల్నాడు ప్రాంతంలో కూడా చాలావరకు పంటలకు అపార నష్టం వాటిల్లింది. మూడు రోజులుగా నీటిలోనే పంటలు నానిపోయాయి. పత్తి, కంది తదితర పంటలకు తీవ్రంగా నష్టం జరిగినట్లు రైతులు తెలిపారు. పంటలతో పాటు పలువురు ఆస్తులు కూడా నష్టపోయారు. లంక గ్రామాల్లో గృహాలు, ప్రభుత్వ ఆస్తులు దెబ్బతినగా వాణిజ్య పంటలు కూడ తుడిచి పెట్టుకుపోయాయి. కృష్ణమ్మ వరద ఉధృతికి రేకుల షెడ్లు, పూరిళ్లు కూలిపోగా ప్రహరీలు పడిపోయాయి. ట్రాక్టర్ ట్రక్కులు తిరగబడి దెబ్బతినిపోయాయి. నిల్వ చేసిన ధాన్యం, ఇతర పంట దిగుబడులు చాలాప్రాంతాల్లో తడిసిపోయాయి. లంక గ్రామాల్లో ఉన్న ప్రజా పంపిణీ దుకాణాల్లో ప్రభుత్వం సరఫరా చేసిన రేషన్ బియ్యం కూడా తడిసి పోయింది. కృష్ణమ్మ లంక గ్రామాల ప్రజల జీవితాలను తలకిందులు చేసేసింది. వరదకు ముందు పండించి ఇంటికితెచ్చి దాచుకున్న పంటనూ వదలకుండా ముంచేసింది. నిన్నటి వరకు ప్రాణాలు దక్కితే చాలన్న ఆలోచనతో ఉన్నవారికి చివరకు ఆ ప్రాణం, వంటిపై దుస్తులే మిగిలాయి. మునిగిన ఇళ్లన్నీ బురదమయమై దుర్గంధం వెదచల్లుతుంటే, వాటిలో తలదాచుకోవడానికీ నానా తంటాలు పడాల్సిన దారుణ పరిస్థితి పలు ప్రాంతాల్లో నెలకొంది. ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న సాయం తాత్కాలికంగా కడుపు నింపుతుండటంతో కాస్తంత సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఎవరిని కదిపినా తీర్చలేని బాధలు, పూడ్చలేని నష్టాలే. కృష్ణా నదీ పరివాహక గ్రామాల్లో వరద తగ్గుముఖం పట్టాక బుధవారం ఇళ్లన్నీ నీటి నుంచి బయటపడ్డాయి. చాలావరకు రహదారులూ కోతపడిపోయి, గండ్లతో నడవడానికి కూడా వీలులేని విధంగా మారి కనిపించాయి. నాలుగు రోజులుగా వరద నీటిలో లంక గ్రామాలన్నీ మునిగిపోయిన సంగతి తెలిసిందే. మూడు రోజుల పాటు ఇళ్లలో తలదాచుకోలేక, డాబాలపైకి ఎక్కినా, కరెంట్ లేక చీకటిలోనే దోమలతో నరకాన్ని అనుభవించామని బాధితులు వాపోయారు. కొల్లూరు మండలం జువ్వలపాలెం, మునగలపల్లిలంక, భట్టిప్రోలు మండలం చింతమోటు, పెసర్లంక, పెదలంక, కృష్ణనగర్, పల్లెపాలెం వంటి గ్రామాలు ఇంకా కొంతమేర వరదలోనే ఉన్నాయి. కొల్లూరు నుంచి లంక గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారి పూర్తిగా కోతపడిపోయి గండ్లమయంగా మారింది. ముఖ్యమంత్రి పర్యటన సమాచారంతో బుధవారం అధికారులు రోడ్లను సరిచేసే పనులు మొదలుపెట్టారు. నది మధ్యలో ఉన్న లంకలకు ఏకైక మార్గమైన అరవింద వారధిపై చెత్త, ముళ్లకంపలు పేరుకుపోయాయి. వరదకు కొట్టుకు వచ్చిన చెత్తా చెదారాలతో పాటు మూగజీవాల కళేబరాలతో అరవింద వారధి నిండిపోయింది. దోనేపూడి నుంచి పోతార్లంక వెళ్లే దారుల పరిస్థితీ దారుణంగా ఉంది. అరటి, కంద, పసుపు, కూరగాయలు, తమలపాకు, బొప్పాయి తదితర పంటలన్నీ పనికిరాకుండా పోయాయి. అరటి తదితర పంటలు దిగుబడి తీసుకునే తరుణంలో వరద కోలుకోలేని దెబ్బతీసిందని రైతులు కన్నీటి పర్యంతమయ్యారు. కొల్లూరు, భట్టిప్రోలు, కొల్లిపర, రేపల్లె మండలాల పరిధిలో 5,200 ఇళ్ల వరకు వరద నీటిలో మునిగిపోయాయి. వీటిలో 3,900 ఇళ్ల వరకు బయటపడితే, భట్టిప్రోలు మండలంలో మిగిలిన ఇళ్లు ఇంకా నీటిలోనే ఉన్నాయి. బయటపడిన ఇళ్లలో సర్వం తడిచి, పనికిరాకుండాపోతే, వారికి బంక మట్టే మిగిలింది. గృహోపకరణాలు, విద్యుత్తు పరికరాలు, ఎలక్ట్రానిక్ పరికరాలు తడిచి పనికిరాకుండా పోయాయి. మూడు రోజులుగా చీకట్లో ప్రజలు అల్లాడిపోయారు. బుధవారం వరద తగ్గగానే పనులు మొదలుపెట్టి 25 గ్రామాల్లో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. ప్రాథమిక అంచనా ప్రకారం విద్యుత్ శాఖకు రూ.80 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు సమాచారం.

నేడు లంక గ్రామాలకు చంద్రబాబు

- కొల్లూరు, భట్టిప్రోలు మండలాల్లో సీఎం పర్యటన

వేమూరు: కొల్లూరు, భట్టిప్రోలు మండలాల పరిధిలోని వరద ప్రభావిత లంక గ్రామాల్లో గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటించనున్నారు. ముఖ్యమంత్రి పర్యటన బుధవారం ఖరారైంది. దీంతో అధికారులు హుటాహుటిన ఏర్పాట్లు చేస్తున్నారు. వేమూరు మార్కెట్ యార్డు వద్ద నిర్మించిన హెలిప్యాడ్‌కు ప్రత్యేక హెలికాప్టర్ ద్వారా చేరుకుని అక్కడి నుంచి రోడ్డు మార్గాన కొల్లూరు, భట్టిప్రోలు మండలాల పరిధిలోని గ్రామాల్లో చంద్రబాబు పర్యటించనున్నారు. బాధితులను పరామర్శించి దెబ్బతిన్న పంటలను పరిశీలించనున్నారు. అవసరమైతే ముఖ్యమంత్రి బస కోసం వేమూరులోని బాపట్ల పార్లమెంటరీ స్థాయి టీడీపీ అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు గృహాన్ని, ఆర్యవైశ్య కల్యాణ మండపాన్ని కలెక్టర్ వెంకటమురళి పరిశీలించారు. చంద్రబాబు రెండు రోజులు వేమూరులో ఉండేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. రేపల్లె ప్రాంతంలో కూడా పర్యటించే ఆలోచనలో సీఎం ఉన్నట్లు సమాచారం. ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను మంత్రులు అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు తదితరులు పరిశీలించారు.


రేపల్లె : బొబ్బర్లంక గ్రామంలో పునరావాస కేంద్రంలో ఉన్న ప్రజల సమస్యలను వింటున్న మంత్రులు అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్


మోర్తోట ముక్తేశ్వరస్వామి దేవాలయంలో అడుగుమేర తగ్గిన వరద


భట్టిప్రోలు మండలం వెల్లటూరు లంకల్లో వరద ముంపులోనే పసుపు పైరు


వరద ఉధృతికి దెబ్బతిన్న బొప్పాయి తోట

తగ్గిన ఉధృతి..

నాగార్జునసాగర్ జలాశయం నుంచి నీటి విడుదల ఆగింది. ప్రకాశం బ్యారేజీ నుంచి నీటి విడుదల 4 లక్షలు క్యూసెక్కులకు పరిమితం చేశారు. దీంతో నదిలో వరద ఉధృతి తగ్గుముఖం పట్టింది. మంగళవారం వరకు కృష్ణానది కరకట్టకు అనుకుని ప్రవహించిన నీరు ప్రస్తుతం నదిలో మాత్రమే ప్రవహిస్తుంది. ఎనిమిది అడుగుల మేర వరద ఉధృతి తగ్గింది. నదీ పరివాహక ప్రాంతంలో లంకగ్రామాలకు వెళ్లే రోడ్లు బయటపడ్డాయి. బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు చూస్తే చాలా వరకు వరద తగ్గుముఖం పట్టడంతో పంటలు నీటిలో నుంచి బయటపడుతున్నాయి. కొన్ని చోట్ల పల్లపు ప్రాంతాల్లో మాత్రం పంటలు నీటిలో నానుతున్నాయి.

అధైర్యపడొద్దు.. ఆదుకుంటాం

మంత్రులు అనగాని, గొట్టిపాటి

అధిక వర్షాలు, వరదలకు నష్టపోయిన వారిని అన్ని విధాలా ఆదుకుంటామని మంత్రులు సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. కరకట్ట వెంబడి ఉన్న గ్రామాల్లో మంత్రులు బుధవారం పర్యటించి బాధితులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. వైసీపీ ప్రభుత్వం చేసిన తప్పు లే ఇప్పుడు ప్రజలకు శాపంలా మారాయన్నారు. గృహాలు కోల్పోయిన వారికి స్థలాలు ఇచ్చి పక్కా గృహాలు నిర్మించేందుకు కృషి చేస్తామన్నారు. ఆర్థికంగా ఆదుకునే దిశగా ముందుకు వెళ్తామన్నారు. ప్రభుత్వం ప్రజలకు అండగా నిలిచి ఆర్థికంగా ఆదుకుంటుందని తెలిపారు.


కొట్టుకుపోయిన కొల్లూరు - ఆవులవారిపాలెం రహదారి




వరద ఉధృతికి బోల్తా పడి దెబ్బతిన్న ట్రక్కులు


ఓలేరు పల్లెపాలెంలో సామగ్రిని శుభ్రం చేస్తున్న తల్లి, కుమారుడు


పెనుమూడి: పల్లెపాలెంలో వరద ఉధృతికి కూలిన ఇంటి గోడలు


పల్లెపాలెంలో ఇంట్లో నీటిని బయటకు ఎత్తిపోస్తూ...


భట్టిప్రోలు : వెల్లటూరు నుంచి లంక గ్రామాలకు వెళుతున్న ప్రజలు


భట్టిప్రోలు : ఇంట్లో నీరును బయటకు ఎత్తిపోస్తూ..


ఆవులవారిపాలెంలో వరదకు తడిసిపోయిన ధాన్యం


అరవింద వారధిపై పనులను చర్చిస్తున్న ప్రత్యేక అధికారి, కలెక్టర్, ఎమ్మెల్యే ఆనందబాబు

బాపట్ల జిల్లాలో..

42,000 హెక్టార్లలో మునిగిన వరి

బాపట్ల(ఆంధ్రజ్యోతి): బ్యారేజీ నుంచి రికార్డు స్థాయిలో వచ్చిన వరద పొలాలను కబళించింది. కొల్లూరు, భట్టిప్రోలు, చుండూరు మండలాల పరిధిలో ఒక్క ఎకరం కూడా చేతికొచ్చే పరిస్థితి లేదు. వరిలో ఎకరాకు ఇప్పటికే పెట్టుబడి దాదాపు పదివేల వరకు పెట్టిన పెట్టుబడి మొత్తం నష్టపోయినట్లేనని రైతులు తెలిపారు. 45,000 హెక్టార్లలో పైర్లు నీటమునగగా ఇందులో వరి వాటానే 42,000 హెక్టార్లుగా ఉంది. మిగిలిన 3,000 హెక్టార్లలో మినుము, శనగ ఉంది. పంట నష్టపోయిన మండలాల్లో బాపట్లలో అత్యధికంగా 5,850, అమర్తలూరు 4,150, చుండూరు 5,000 చెరుకుపల్లి 4,200, వేమూరు 3,800 హెక్టార్లుగా అంచనా వేశారు. కర్లపాలెంలో 2520, భట్టిప్రోలులో 1,800 రేపల్లెలో 3,000 హెక్టార్లుగా అధికారులు ప్రాథమిక నివేదికలో పొందుపర్చారు. లంక గ్రామాల్లో ఉద్యాన పంటలు 4,614 హెక్టార్లలో నష్టపోయినట్లు సమాచా రం. వరి, ఉద్యాన పంటల నష్టంతో జిల్లాలో 48,000 మంది రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. వరద పూర్తిగా తగ్గాక ఈ నష్టం అంచనాలు మరింత పెరిగే అవకాశం ఉందని అన్నదాతలు అభిప్రాయపడుతున్నారు.


ఇంకా ముంపులోనే పెనుమూడి పల్లెపాలెం

గుంటూరు జిల్లాలో..

33,345 హెక్టార్లలో పంట నష్టం

జిల్లాలో ఏడుగురు జల సమాధి

గుంటూరు(ఆంధ్రజ్యోతి): వర్షాలు, వరదల కారణంగా జిల్లాలో 75,153 మంది ప్రజలు ఇబ్బందులు పడ్డారు. 35,345.2 హెక్టార్లలో పంట నష్టం జరిగినట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. ఇందులో వ్యవసాయ పంటలు 31,751.2, ఉద్యాన పంటలు 3594 హెక్టార్లలో ఉన్నాయి. 8,116 ఇళ్లు నీట మునిగాయి. ఏడుగురు వరదలో చిక్కుకుని ప్రాణాలు కోల్పోయారు. వరద తగ్గుముఖం పట్టడంతో 10 క్యాంపులను మూసేశారు. ఆర్అండ్‌బీ పరిధిలో 969 కిలో మీటర్లు దెబ్బతినగా 24 చోట్ల గండ్లు పడ్డాయి. తాత్కాలిక మరమ్మతులకు రూ.1,128 లక్షలు, శాశ్వత మరమ్మతులకు రూ.11,315 లక్షల నిధులు అవసరమౌతాయని గుర్తించారు. పంచాయతీరాజ్ శాఖ పరిధిలో దెబ్బతిన్న 113 రోడ్ల తాత్కాలిక మరమ్మతులకు రూ.1,171 లక్షలు, శాశ్వత మరమ్మతులకు రూ.9,098.45 లక్షలు అవసరమని అంచనా వేశారు. నాలుగు మున్సిపాలిటీల పరిధిలో 24.93 కిలోమీటర్ల రోడ్లు, డ్రెయిన్లు 6.395 కిలోమీటర్ల పొడవునా ధ్వంసమయ్యాయి. ఈ మేరకు నష్టం అంచనాలను రూపొందించి కలెక్టర్ నాగలక్ష్మి ప్రభుత్వానికి నివేదించారు.


వరదలకు పూర్తిగా దెబ్బతిన్న టమోటా తోట

పల్నాడు జిల్లాలో..

నష్టం.. రూ.56 కోట్లు

- 28,201 ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు
- వ్యవసాయ, ఉద్యానశాఖలు ప్రాథమిక అంచనా
- పూర్తి స్థాయిలో లెక్కింపునకు ప్రత్యేక బృందాలు

నరసరావుపేట(ఆంధ్రజ్యోతి): వర్షాలు.. వరదల కారణంగా జిల్లాలో పంటలకు అపార నష్టం వాటిల్లింది. నీట మునగడంతో పంటలు ఆదిలోనే దెబ్బతినడంతో రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు. పొలాల్లో నీరు నిలిచి పంటలు ఉరకెత్తుతున్నాయి. కాపు దశలోనే పత్తి పంట దెబ్బతినడంతో రైతులు ఆవేదన చెందుతున్నాయి. ప్రభుత్వ సాయం కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు. ప్రాథమిక అంచనా ప్రకారం 28,201 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్లు అధికారులు గుర్తించారు. రెండు రోజుల్లో పంట నష్టం అంచనా 7 వేల ఎకరాలు పెరిగింది. ఈ లెక్కల ప్రకారం ఇప్పటికి దాదాపు రూ.56 కోట్ల వరకు పంట నష్టం వాటిలినట్లు ప్రాథమిక అంచనా. పంట నష్టం పూర్తి స్థాయిలో లెక్కించేందుకు వ్యవసాయ శాఖ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసింది. మండల, గ్రామ స్థాయిలో ఈ బృందాలు పంట నష్టం లెక్కించే ప్రక్రియను బుధవారం జిల్లా అంతటా పారంభించాయి. వ్యవసాయ శాఖ అంచనా ప్రకారం 27,013 ఎకరాల్లో పత్తి, వరి, కంది తదతర పంటలకు నష్టం వాటిల్లింది. ఉద్యాన పంటలు 1,188 ఎకరాల్లో దెబ్బతిన్నట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. ఉద్యాన పంటలకు భారీగానే నష్టం వాటిల్లింది. 1,187 ఎకరాల్లో అరటి, పసుపు, మిరప తదితర పంటలకు నష్టం వాటిల్లిందని ఉద్యాన శాఖ తెలిపింది. పిడుగురాళ్ల, ముప్పాళ్ల మండలాల్లో పసుపు పంట దెబ్బతింది. నరసరావుపేట, గురజాల, అమరావతి, అచ్చంపేట, పెదకూరపాడు, చిలకలూరిపేట, సతెనపల్లి మండలాల్లో ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లింది.



కాకినాడ తీరంలో ఉన్న మత్స్యకారులు

మత్స్యకారులు క్షేమం

రేపు గ్రామానికి రాక

ఎమ్మెల్యే ఏలూరికి కృతజ్ఞతలు తెలిపిన కుటుంబ సభ్యులు

చినగంజాం, సెప్టెంబరు 4 : జీవనోపాధి కోసం చేపల వేటకు వెళ్లి సముద్రంలో చిక్కుకున్న రుద్రమాంబపురం మత్స్యకారులతో పాటు మరో ఆరుగురు ఎట్టకేలకు కాకినాడ తీరానికి క్షేమంగా చేరుకున్నారు. మండలంలోని మోటుపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని రుద్రమాంబపురం గ్రామానికి చెందిన మత్స్యకారులు కొండూరి రాముడు, బసంగారి జయరాజు, కాటంగారి బాబూరావు, ఆవల మునియ్యతో పాటు మరో ఆరుగురు మత్స్యకారులు బతుకుదెరువు కోసం గత నెల 23వ తేదీన ఐఎన్‌డీటీఎన్02 ఎంఎం 2210 నెంబరు గల మహాలక్ష్మీ ఐరన్ బోటులో చెన్నై నుంచి సముద్రంలో చేపల వేట చేసుకుంటూ విశాఖపట్నం తీరం వరకు వెళ్లారు. నాలుగు రోజుల కిందట విశాఖ తీరంలో 52 నాటికల్ మైళ్ల దూరంలో బోటు ఇంజన్ దెబ్బతినడంతో సముద్రం మధ్యలో బోటు ఆగిపోయింది. ఆ విషయాన్ని తోటి మత్స్యకారులు బోటు యజమానికి సమాచారం అందించారు. బోటు యజమాని ఈ విషయాన్ని మత్స్యకారుల కుటుంబసభ్యులకు తెలిపారు. మత్స్యకారులు సముద్రంలో చిక్కుకున్న విషయాన్ని రుద్రమాంబపురం గ్రామస్థులు, కుటుంబసభ్యులు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు దృష్టికి ఈ నెల 1వ తేదీన తీసుకెళ్లారు. ఎమ్మెల్యే ఏలూరి వెంటనే రెవెన్యూ, హోంమంత్రులు అనగాని సత్యప్రసాద్, వంగలపూడి వనిత దృష్టికి తీసుకెళ్లారు. మత్స్యకారులను సురక్షితంగా తీసుకొచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. తక్షణమే స్పందించిన మంత్రులు రెవెన్యూ, కోస్ట్ గార్డ్, కమాండ్ కంట్రోల్, మత్స్యశాఖ అధికారులకు సమాచారమిచ్చారు. రంగంలో దిగిన కోస్ట్‌గార్డ్స్ గాలింపు చర్యలు చేపట్టి సముద్రం మధ్యలో ఉన్న బోటును గుర్తించి, వెంటనే రెండవ రోజు బోటును మరమ్మతు చేయించి మంగళవారం అర్ధరాత్రికి కాకినాడ తీరానికి చేరేలా చేశారు. కాకినాడ తీరానికి చేరుకున్న మత్స్యకారులు ఎమ్మెల్యే ఏలూరి ఫోన్ చేసి కృతజ్ఞతలు తెపారు. క్షేమంగా మత్స్యకారులు కాకినాడ సముద్రతీరానికి చేరుకోవడంతో మత్స్యకారుల కుటుంబసభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. తమ కుటుంబసభ్యులను సురక్షితంగా ఇళ్లకు చేర్చేందుకు కృషి చేసిన మంత్రులు వంగలపూడి అనిత, అనగాని సత్యప్రసాద్, ఎమ్మెల్యే ఏలూరికి కుటుంబసభ్యులు, గ్రామస్థులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రుద్రమాంబపురం గ్రామానికి చెందిన నలుగురు మత్స్యకారులు కాకినాడ నుంచి బయలుదేరి గురువారం గ్రామానికి చేరుకుంటారని బంధువు ప్రళయకావేరి వెంకటేష్ బుధవారం తెలిపారు.

సీఐగా మల్లికార్జునరావు బాధ్యతలు



బాధ్యతలు స్వీకరిస్తున్న సీఐ మల్లికార్జునరావు

మేదరమెట్ల, సెప్టెంబరు 4 : అద్దంకి రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బుధవారం డి.మల్లికార్జునరావు బాధ్యతలు స్వీకరించారు. అద్దంకి రూరల్ సీఐగా పని చేస్తున్న శివరామకృష్ణారెడ్డి వీఆర్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో మల్లికార్జునరావు బాధ్యతలను స్వీకరించారు. కొరిశపాడు, జె.పంగులూరు, మేదరమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో జాతీయ రహదారులలో ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు చేపడతామన్నారు. వాహనదారులు నిబంధనల మేరకు అన్ని పత్రాలను కలిగి ఉండాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠినచర్యలు తీసుకుంటామన్నారు. శాంతి భద్రతలకు ఎవరూ విఘాతం కల్గిస్తే ఉపేక్షించమన్నారు.

రెండు రేషన్ దుకాణాలపై 6ఏ కేసు

ఇంకొల్లు, సెప్టెంబరు 4 : ఇంకొల్లులో రెండు రేషన్ దుకాణాలలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ అధికారులు ఆకస్మికంగా నిర్వహించారు. రెండు దుకాణాల నిర్వాహకులపై 6ఏ కేసు నమోదు చేశారు. 1వ నెంబర్ దుకాణంలో 33 క్వింటాళ్ల రేషన్ బియ్యం అదనంగా ఉన్నట్లు గుర్తించారు. 41వ నెంబర్ రేషన్‌దుకాణంలో 10 క్వింటాళ్ల బియ్యం అదనంగా ఉండడంతో అధికారులు 6ఏ కేసు నమోదు చేశారు. ఈ తనిఖీల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో పాటు వీఆర్వో సురేష్ ఉన్నారు.

ఆర్‌బీ చానల్‌లో గుర్రపుడెక్క తొలగింపు

ఎమ్మెల్యే ఏలూరి ఆదేశంతో చర్యలు చేపట్టిన ఇరిగేష్ అధికారులు

రైతుల హర్షం



ఆర్బీ చానల్‌లో తూటికాడను తొలగిస్తున్న సిబ్బంది

చినగంజాం, సెప్టెంబరు 4 : మండల పరిధిలోని రాజుబంగారుపాలెం కాలువలో పూడిక తీత, గుర్రపుడెక్క, తూటికాడ, చిల్ల చెట్ల తొలగింపు కార్యక్రమాన్ని బుధవారం చేపట్టారు. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సహకారంతో సంతరావూరు లాకుల వద్ద నుంచి కడవకుదురు శివారు వరకు రాజుబంగారుపాలెం కాలువలో(ఆర్‌బీ చానల్) యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టారు. గత నాలుగు సంవత్సరాల నుంచి కాలువలో మరమ్మతులు చేయకపోవడంతో కాలవలో గుర్రపుడెక్క, తూటికాడ, మెరకలు ఏర్పడి పంట పొలాలకు సరిగా నీటి పారుదల లేక రైతులు పంటల సాగుకు ఇబ్బందులు పడ్డారు. ఇబ్బందులు పడుతున్న రైతుల పరిస్థితులను తెలుసుకొని ఎమ్మెల్యే ఏలూరి వెంటనే పనులు చేపట్టాలని ఇరిగేషన్ శాఖాధికారులను ఆదేశించారు. దీంతో నీటి పారుదల శాఖాధికారులు ఆర్‌బీ చానల్‌లో పూడికతీత పనులు, గుర్రపుడెక్క, తూటికాడ, చిల్ల చెట్లను తొలగిస్తున్నారు. పనులపై కడవకుదురు ప్రాంత రైతులు నక్కల వీరరాఘవులు, కేశన బాలయ్య, మదాసు ప్రసాద్, గేని వెంకటేశ్వర్లు, అనంత వెంకటేశ్వరరావు, తోటకూర శ్రీనివాసరావు, వెంకటరావు, ఎస్.శివన్నారాయణ తదితర రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై దాడి

ముగ్గురు యువకులపై కేసు

మార్టూరు, సెప్టెంబరు 4 : ఆర్టీసీ బస్సులో డ్రైవర్‌పై చేయిచేసుకోవడంతోపాటు మహిళా కండక్టరు విధులకు ఆటంకం కలిగించిన ముగ్గురు యువకులపై బుధవారంరాత్రి స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ మహమ్మద్ బాషా తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఒంగోలు డిపోకు చెందిన పల్లెవెలుగు హయ్యర్ బస్సు గుంటూరు నుంచి ఒంగోలు వస్తుండగా మార్టూరు టౌన్‌లోకి వచ్చే క్రమంలో సర్వీసురోడ్ వద్ద బస్సు ముందు మార్టూరు గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు బత్తినేని శ్రీనివాసరావు, గొర్రె వేణు, గజ్జల సాంబశివరావు రెండు ద్విచక్ర వాహనాలపై అడ్డదిడ్డంగా ప్రయాణిస్తున్నారు. డ్రైవరు గంటా రవికుమార్ బస్సు హారన్ మోగించారు. దీనిపై ఆగ్రహానికి గురైన ముగ్గురు యువకులు బస్సును ఆపి డ్రైవరుతో వాదన పెట్టుకొని చేయిచేసుకున్నాడు. అదే బస్సులో ప్రయాణిస్తున్న టంగుటూరు పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ బాదం సుబ్బారెడ్డితోపాటు మహిళా కండక్టరు దీవెనకుమారితో కూడా వాదనకు దిగారు. దీనిపై కండక్టరు ఫిర్యాదు మేరకు పోలీసులు ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకొని వారిపై కేసు నమోదు చేశారు.

నేడు గురుపూజోత్సవం

ఒంగోలు(విద్య), సెప్టెంబరు 4: ఆచార్య సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో గురుపూజోత్సవాన్ని గురువారం కలెక్టరేట్‌లోని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి శాసనసభ్యుడు జనార్దన్ అధ్యక్షత వహిస్తారు. మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మేయర్ గంగాడ సుజాతలు పాల్గొంటారు.

కదలం.. మెదలం..!

నగరంలో చీపురు పట్టే వారు కరువు

విజయవాడ వెళ్లిన 300 మంది శానిటరీ వర్కర్లు

కొందరు ఆర్డరు లేకుండా అటెండర్లుగా ఆఫీసులో తిష్ట

వారికి అధికారులు, వైసీపీ కార్పొరేటర్ల ఆశీస్సులు

ఎక్కడ చెత్త అక్కడే.. మెరుగుపడని పారిశుధ్యం

పూడుకుపోయిన డ్రైనేజీలు.. రోడ్లపైనే మురుగు

వర్షాలతో వెంటాడుతున్న వ్యాధుల భయం

పూర్తిస్థాయిలో విధుల్లో ఉంటేనే ప్రజారోగ్యానికి భరోసా

-ఒంగోలులో పారిశుధ్యం సరిగా లేదు. ఎవరు ఎక్కడ పనిచేస్తున్నారో తెలియదు.. ఇకపై నిర్లక్ష్యం వీడాలి. అప్రమత్తంగా ఉండాలి. వర్షాలు కురుస్తున్నాయి.. వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. అలసత్వం వీడి ప్రతిఒక్కరూ పనిచేయాలి. పారిశుధ్యం మెరుగుపరచాలి. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలి. లేకుంటే చర్యలు తప్పవు

- బుధవారం కార్పొరేషన్ అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఎమ్మెల్యే దామచర్ల

-పారిశుధ్యం మెరుగుకే మొదటి ప్రాధాన్యత. నగరం పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలకు మంచి సేవలు అందించినట్లు. అప్పుడే అందమైన నగరంగా తీర్చిదిద్దవచ్చు. వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవడంతోపాటు డ్రైనేజి వ్యవస్థను మెరుగుపరుస్తాం. కార్మికులందరూ పనిలో ఉండాల్సిందే.

-నగర కమిషనర్ వెంకటేశ్వరరావు ఇటీవల బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా మీడియాతో మాట్లాడారు.

నగరంలో చీపురు పట్టేవారు కరువయ్యారు. ఎక్కడి చెత్త అక్కడే ఉంటోంది. ఎటుచూసినా పరిస్థితి అధ్వానంగా మారింది. దీనికి తోడు వరద బాధిత ప్రాంతాల్లో యుద్ధప్రాతిపదికన పారిశుధ్యం మెరుగుకోసం 300 మందిపైనే కార్మికులను విజయవాడ పంపారు. పేరుకు కార్పొరేషన్ అయినా, హోదాకు అనుగుణంగా పనిచేసేవారు కరువయ్యారు. కార్మికులుగా చేరి, ఆ తర్వాత పెత్తనం చేయడానికి మేస్త్రీలుగా అవతారమెత్తారు. కొందరు వర్కర్లు పనిచేయకుండా ముఖం చాటేస్తూ, పలుకుబడితో కార్యాలయంలో ఆర్డర్ లేకుండానే అనధికారికంగా అటెండర్లుగా కొనసాగుతున్నారు. దీంతో నగరంలో పారిశుధ్య పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

ఒంగోలు (కార్పొరేషన్), సెప్టెంబరు 4 : నగరంలో పారిశుధ్యం పడకేసింది. వర్షాల సీజన్‌లో సాధారణంగానే అస్తవ్యస్తంగా తయారవుతుంది. అయితే నగరపాలక సంస్థ యంత్రాంగం అప్రమత్తంగా ఉండి యుద్ధప్రాతిపదికన మెరుగైన చర్యలు చేపట్టాల్సి ఉంది. అయితే గత ప్రభుత్వ నీలినీడలు ఇంకా కార్పొరేషన్‌ను వెంటాడుతూనే ఉన్నాయి. సిబ్బందిని ఇంకా ఆ జాఢ్యం వీడలేదు. ఇటీవల భారీవర్షాల కారణంగా నీటమునిగిన విజయవాడలో సహాయక చర్యల కోసం ఒంగోలు నుంచి 300 మంది వరకు పారిశుధ్య కార్మికులు, మరో ముప్పై మంది శానిటరీ సెక్రటరీలు, మరికొందరు ఇన్‌స్పెక్టర్లు వెళ్లారు. అయితే ఉన్న అరకొర సిబ్బందిలో కొందరు అధికారుల ఇళ్లల్లో పనిచేస్తుండగా, మరికొందరు మేయర్ ఇంటిలో కార్మికులుగా కొనసాగుతున్నారు. దీంతో ప్రస్తుతం వీధులు ఊడ్చేవారు కరువయ్యారు. గత రెండు రోజులుగా నగరంలో చెత్త ఎత్తేవారు కనిపించకపోవడంతో కుప్పలు పేరుకుపోతున్నాయి. మరోవైపు కురుస్తున్న వర్షాల కారణంగా వ్యాధుల భయం వెంటాడుతోంది. మరోవైపు గత ప్రభుత్వ హయాంలో కార్మికులుగా చేరిన కొందరు కార్యాలయం నుంచి కాలు బయటపెట్టం అంటూ తిష్ట వేసి కూర్చుకున్నారు. ఇప్పటికైనా అధికారులు కార్యాలయంలో అవసరం లేకపోయినా అనధికారకంగా కొనసాగుతున్న పారిశుధ్య కార్మికులను తిరిగి పనిలోకి పంపితే తప్ప, నగరంలో కొంతమేర అయిన పారిశుధ్యం మెరుగుపడే పరిస్థితి కనిపించడం లేదు.

రెండేళ్ళుగా కార్పొరేషన్ కార్యాలయంలో తిష్ట

బాలినేని శ్రీనివాసరెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో తన అనుచరుల కోసం ఇష్టారాజ్యంగా ఉద్యోగాలకు సిఫారసులు చేశారు. ఆప్కాస్ కింద 56మందికి ఉద్యోగాలు ఇచ్చారు. శానిటరీ, ఇంజనీరింగ్ విభాగాల్లో పనిచేస్తున్న వీరికి నెలనెలా రూ.21వేల వేతనం చెల్లిస్తున్నారు. మరోవైపు కొవిడ్ సిబ్బంది కింద మరో 100 మందికి పైగా ఉద్యోగాలు ఇవ్వగా వీరికి నెలకు రూ.18వేలు చెల్లిస్తున్నారు. అయితే వీరిలో ముప్పై మంది మాత్రం పనిలోకి వెళుతుండగా, మిగిలిన వారు మాత్రం నేటికి వైసీపీ కార్పొరేటర్ల అండదండలతో కార్యాలయం వదిలివెళ్లడం లేదు. ఇదిలా ఉంచితే వీరు కార్యాలయంలో కూడా చీపురు పట్టరు. ఫైళ్లు అందించరు. వారిని చూసి రెగ్యులర్ ఉద్యోగులు సైతం విస్తుపోతున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో పారిశుధ్య కార్మికులుగా ఉద్యోగాలు పొందిన వారికి కార్పొరేషన్ నిధుల నుంచి టంచన్‌గా జీతాలు చెల్లిస్తున్నారు. కానీ టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చినా వీరిని మాత్రం కార్యాలయం నుంచి కదలించేవారు లేరని చెప్పుకుంటున్నారు. దీంతో నిత్యం పని చేసే వారిపైనే భారం పడుతోంది. ఇప్పటికైనా పారిశుధ్య విభాగంలో పూర్తిస్థాయిలో కార్మికులను విధుల్లోకి పంపితేనే నగరంలో పారిశుధ్యం మెరుగుపడదని నగరవాసులు అభిప్రాయపడుతున్నారు.

పూర్తిస్థాయిలో పారిశుధ్యం మెరుగుపడేనా?

ఒకవైపు నగరంలో పారిశుధ్య సమస్య వేధిస్తుండగా, అందుకు అనుగుణంగా కార్మికులు లేరు. వైసీపీ అండదండలతో పలు సెక్షన్లలో పెత్తనం చేస్తున్న 19మంది కార్మికులను తిరిగి చెత్త సేకరణకు పంపాలి. అలాగే ఆప్కాస్ కింద ఉద్యోగాలు పొంది, కార్యాలయానికి రాని వారిని తొలగించాల్సిన అవసరం ఎంతైన ఉంది. అకౌంట్ సెక్షన్‌లో ముగ్గురు ఉద్యోగులు ఉండగా, వారికి ఒకొక్కరికి ఒక్కో అటెండర్ ఉండటం చూస్తుంటే వైసీపీ కార్పొరేటర్ల పెత్తనం ఏస్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.



నగరంలో పేరుకుపోయిన చెత్త

పనిచేసేవారు తక్కువ.. పెత్తనం చేసేవారు ఎక్కువ

ఒక్కో సెక్షన్‌లో కనీసం ముగ్గురు అటెండర్లు ఉండటం ఏ ప్రభుత్వ కార్యాలయంలో కనిపించని పరిస్థితి. అది ఒక్క ఒంగోలు కార్పొరేషన్ కార్యాలయంలోనే స్పెషల్‌గా కనిపిస్తుంది. గత వైసీపీ ప్రభుత్వ పాలనలో రాజకీయ పలుకుబడితో వర్కరుగా చేరిన కొందరు ఆ పార్టీ కార్యకర్తలు చీపురు పట్టుకోరు. ఇదిలా ఉంచితే కార్యాలయంలో కూడా వీరు చేసే పని పెద్దగా ఏమీ లేదని అధికారులే వెల్లడించడం విశేషం. వచ్చామా.. పోయామా.. అన్నట్లు ఉండటం ఇదీ అనధికార అటెండర్ల వ్యవహారశైలి. వీరి తీరుతో కార్పొరేషన్ కార్యాలయంలో పనిచేసేవారు తక్కువ, పెత్తనం చేసేవారు ఎక్కువ అనే పరిస్థితి నెలకొంది. కాగా గత వైసీపీ పాలనలో ఆడిందే ఆట పాడిందే పాటగా కొనసాగిన పారిశుధ్య కార్మికులు ప్రభుత్వం మారినా వీరి తీరు మాత్రం మారడం లేదు. వీరికి కార్యాలయంలోని కొందరు అధికారుల ఆశీస్సులతోపాటు, వైసీపీ కార్పొరేటర్ల అండదండలు పుష్కలంగానే ఉన్నాయి. అందుకే ఆర్డరు కాపీలు కూడా లేకుండా రెండేళ్లుగా వారిని కార్యాలయంలో కుర్చీ వేసి మరి మర్యాద చేసి నెలనెలా జీతాలు ఇస్తున్నారు.

వెంటాడుతున్న వైరల్ ఫీవర్స్

వర్షాకాలం అంటేనే వ్యాధుల భయం వెంటాడుతుంది. ఖాళీస్థలాలు, నీటి కుంటలలోకి నీరు చేరి జ్వరాలు ప్రబలుతాయి. దోమల వ్యాప్తికి అనుకూలమైన వాతావరణం కావడంతో డెంగ్యూ, మలేరియా తదితర విషజ్వరాలు ఇప్పటికే అధికమయ్యాయి. ఆస్పత్రులు జ్వరబాధితులతో కిటకిటలాడుతున్నాయి. ఇలాంటి సమయంలో డివిజన్లలో తిరిగి నీటిన్విలలు లేకుండా, ఇళ్ల మధ్య మురుగు కనిపించకుండా ఖాళీస్థలాల్లో చెత్తచెదారం లేకుండా చూడాలి. ఒంగోలు కార్పొరేషన్ పరిధిలో అలాంటి వాతావరణం కనిపించడం లేదు.

సిబ్బంది.. సామగ్రి

వరద సహాయక చర్యలకు జిల్లా నుంచి

విద్యుత్, పారిశుధ్య కార్మికుల తరలింపు

ప్రత్యక్షంగా బాధిత ప్రజలకు ఉపశమన

కార్యక్రమాల్లో మంత్రి డాక్టర్ స్వామి



విజయవాడలోని ముంపుప్రాంతాల్లో పర్యటిస్తున్న మంత్రి స్వామి

ఒంగోలు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : వరద బారిన పడిన విజయవాడ ప్రజలకు తొలి రెండు రోజులు పెద్దఎత్తున భోజనం, మంచినీరు, ఇతర ఆహార పదార్థాలను విభిన్నవర్గాల వారు పంపించగా బుధవారం మనుషులను, యంత్రాలను పంపారు. ప్రస్తుతం అక్కడ సహాయక చర్యల కోసం ప్రభుత్వపరంగా అవసరమైన సిబ్బంది, ఇతర పరికరాలను పంపిస్తున్నారు. విజయవాడను ముంచెత్తిన ఇటు కృష్ణమ్మ అటు బుడమేరులు కాస్తంత శాంతించాయి. వరద ఉధృతి తగ్గడంతో అక్కడి ప్రజానీకం బయటకు వస్తున్నారు. అక్కడ ఆహారం కన్నా ఇతర సహాయక చర్యలు అవసరంగా అధికంగా ఉంది. ప్రధానంగా విజయవాడ నగరం అంతా మురుగు రోడ్లు, ఇళ్లను ఏకం చేసింది. వరదతో కొట్టుకొచ్చిన మట్టి, ఇసుక, ఇతర మురుగు నగరాన్ని ముంచెత్తింది. దీంతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది మరోవైపు విద్యుత్ వ్యవస్థ పూర్తిగా దెబ్బతింది. ఈ నేపథ్యంలో అక్కడ తక్షణం పారిశుధ్య చర్యలు, విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనుల కోసం సంబంధిత సిబ్బంది, యంత్రాలు, ఇతర వస్తువులు భారీగా అవసరమయ్యాయి. దీంతో పొరుగు జిల్లాల నుంచి సిబ్బంది, మెటీరియల్‌ను పంపాలని ప్రభుత్వం ఆదేశించింది. తదనుగుణంగా జిల్లా నుంచి బుధవారం పారిశుధ్య కార్మికులు, విద్యుత్ సిబ్బంది, ట్రాక్టర్లు, జనరేటర్లు ఇతర సామగ్రిని తరలించారు. వరద సహాయక చర్యల కోసం ఒంగోలు కార్పొరేషన్ నుంచి మంగళవారం 150 మ ంది కార్మికులను పంపించారు. తిరిగి ఇక్కడి నుంచి మరో 150 మందిని పంపారు. అలాగే విద్యుత్ పునరుద్ధరణ పనుల కోసం 120 మందిని వివిధ స్థాయి అధికారులు, సిబ్బందిని ఇక్కడి విద్యుత్ శాఖ నుంచి పంపారు. మరో 50మందిని కూడా పంపించే ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే 125 కేవీ సామర్థ్యం ఉన్న రెండు జనరేటర్లను బుధవారం ఎస్ఈ సత్యనారాయణ పంపారు.

జిల్లా నుంచి ట్రాక్టర్లు

అలాగే అక్కడ సహాయక చర్యలు కోసం జిల్లా నుంచి 50 ట్రాక్టర్లను పంపాలని ప్రభుత్వం ఆదేశించడంతో యజమానులతో కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడారు. తక్షణం 13 ట్రాక్టర్లను పంపారు. మిగిలిన వాటిని కూడా పంపనున్నట్లు తెలిపారు. సాంఘిక సంక్షేమ శాఖ అధికారుల విజ్ఞప్తి మేరకు నగరంలోని క్విస్, పేస్ ఇంజనీరింగ్ కళాశాలల యాజమాన్యం పదివేల పులిహోర పొట్లాలను విజయవాడ వరద బాధితులకు తరలించారు. స్థానిక లాయర్‌పేటలోని షిర్డిసాయి కల్చరల్ మిషన్ తరపున ఆహార పదార్థాలు, మంచినీటి బాటిళ్లను పంపారు. జిల్లాలోని పలు ప్రాంతాల వారు వరద బాధితుల సహాయార్థం ప్రభుత్వం ప్రకటించిన బ్యాంకు అకౌంట్లకు నగదు కూడా జమ చేస్తున్నారు. ఒంగోలు నుంచి ప్రభుత్వ ఆదేశాలతో కలెక్టర్ తమీమ్ అన్సారియా నేతృత్వంలో లక్షా 50వేల ఆహార పొట్లాలు, వాటర్ బాటిళ్లు, బ్రేడ్లు, బిస్కెట్ ప్యాకెట్లను ప్రత్యేక వాహనాల్లో పంపారు.

సహాయక చర్యలలో మంత్రి

ఇదిలా ఉండగా జిల్లాకు చెందిన సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి విజయవాడలోని వరద బాధిత ప్రజల సహాయక చర్యలలో ప్రత్యక్షంగా పాల్గొంటున్నారు. అక్కడ నీట మునిగిన జక్కంపూడి, వైఎస్ కాలనీలకు ట్రాక్టర్‌లో వెళ్లి బాధితులను పరామర్శించారు. స్థానిక అధికారులు, సిబ్బందితో కలిసి సహాయక చర్యలను పర్యవేక్షించారు. ఆ సందర్భంగా ఒక అపార్ట్‌మెంట్‌లో చిక్కుకున్న ఇద్దరు చిన్నారులను ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది సాయంతో రక్షించే చర్యలు తీసుకున్నారు జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుతో కలిసి ఆటోలో వెళ్లి బుడమేరుకు గండ్లుపడిన ప్రాంతాలను పరిశీలించారు.

రూ.6.72 కోట్లతో సొసైటీలు కంప్యూటరీకరణ

అక్టోబరు 2 నాటికి పూర్తికి ఆదేశం

ఒంగోలు(విద్య), సెప్టెంబరు 4 : గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు వ్యవసాయ రుణాలు, ఎరువులు ఇతర ఉపకరణాలు అందించేందుకు ఏర్పాటు చేసిన ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల కంప్యూటరీకరణకు కేంద్రప్రభుత్వం శ్రీకారం చుట్టింది. సొసైటీల్లో అక్రమాలకు అవకాశం లేకుండా లావాదేవీలు పారదర్శకంగా నిర్వహించేందుకు సొసైటీల కంప్యూటరీకరణ దోహదం చేస్తుంది. జిల్లాలోని సహకార కేంద్ర బ్యాంకు(పీడీసీసీ) పరిధిలోని 172 సొసైటీలు కంప్యూటరీకరణ పనులు చేపట్టారు.

ఒక్కొక్క సొసైటీకి రూ.3.91 లక్షలతో మొత్తం రూ.6.72 కోట్లతో ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని సొసైటీలను కంప్యూటరీకరణ ప్రక్రియ వేగంగా సాగుతుంది. అక్టోబరు 2 గాంధీ జయంతి నాటికి జిల్లాలో ఆ ప్రక్రియ పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించడంతో అందుకు అనుగుణంగా చర్యలు చేపట్టారు.

సొసైటీకి 3.91 లక్షలు

ఒక్కొక్క సొసైటీకి కంప్యూటరీకరణకు ప్రభుత్వం రూ.3.91లక్షలు వ్యయం చేస్తోంది. కంప్యూటర్, యూపీఎస్, వెబ్‌కామ్, బయోమెట్రిక్ స్కానర్, పాస్‌బుక్ ప్రింటర్, ఎలక్ట్రికల్ ఏర్పాట్లకు రూ.1.22 లక్షలు, డేటా నిర్వహణకు, సైబర్ సెక్యూరిటీకి రూ.72వేలు, కంప్యూటరీకరణపై సొసైటీ సిబ్బందికి శిక్షణకు రూ.10వేలు, డేటా ప్రిపరేషన్, డిజిటలైజేషన్, వెరిఫికేషన్‌కు రూ.1.10 లక్షలు, నిర్వహణ, హ్యాండ్లింగ్ సపోర్టుకు రూ.76వేలు వ్యయం చేయనున్నారు.

జగనన్న కాలనీల్లో అక్రమాలు

- నిబంధనలకు విరుద్ధంగా

స్థలాలు పొందిన వైసీపీ నాయకులు

- విక్రయించుకొని సొమ్ము చేసుకున్న వైనం

- ఒకే ప్లాటుపై ఇద్దరికి మంజూరు

- పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించిన బాధితులు



రుద్రసముద్రంలో వివాదాస్పదమైన ఇళ్ల స్థలాల ప్లాట్లు

దొనకొండ, సెప్టెంబరు 4 : ఇళ్లు లేని పేదలందరికీ స్థలం ఇస్తామని గత వైసీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన జగనన్న లేఅవుట్‌లలో అక్రమాలు చోటుచేసుకున్నాయి. ఇళ్ల పట్టాల పంపిణీలో ఆపార్టీకి చెందిన స్థానిక నాయకులు అధికారులను లోబర్చుకొని నిబంధనలకు విరుద్ధంగా పొజిషిన్ సర్టిఫికెట్లు పొందారు. రెవెన్యూ అధికారుల సహకారంతో అక్రమ మార్గంలో ఇళ్ల స్థలాల ప్లాట్లు పొందిన వైసీపీ నాయకులు వాటిని విక్రయించుకొని సొమ్ము చేసుకున్నారు.

దొనకొండ సమీపంలోని ఇండ్లచెరువు గ్రామం మీదుగా మార్కాపురం వెళ్లే ప్రధాన రహదారి పక్కన 233/8 సర్వేనెంబర్‌లో దాదాపు 70 వరకు ఇళ్ల స్థలాల ప్లాట్లతో జగనన్న లేఅవుట్‌ను ఏర్పాటుచేశారు. నిబంధనలకు అనుగుణంగా ఆన్‌లైన్ విధానం ద్వారా సగం మంది లబ్ధిదారులకు ప్లాట్లు కేటాయించి ఇళ్లపట్టాలు మంజూరు చేసినట్లు సమాచారం. మిగిలిన ప్లాట్లు స్థానిక వైసీపీ నాయకులు నిబంధనలకు విరుద్ధంగా మాన్యువల్ పద్ధతిలో బినామీ పేర్లతో ఒక్కో నాయకుడు రెండేసి ప్లాట్లకు పొజిషియన్ సర్టిఫికెట్లు పొందినట్లు సమాచారం. అక్రమమార్గంలో ఇళ్ల పట్టాలు పొందిన వైసీపీ నాయకులు గుట్టుచప్పుడు కాకుండా ఒక్కో ప్లాటు రూ.75 వేల నుంచి రూ.లక్ష వరకు బహిరంగ మార్కెట్‌లో దర్జాగా విక్రయించుకొని సొమ్ము చేసుకున్నారని తెలుస్తోంది.

రుద్రసముద్రం గ్రామ సర్వేనెంబర్ 182లో దాదాపు 114 ప్లాట్లతో జగనన్న లేఅవుట్ ఏర్పాటుచేశారు. అందులో దాదాపు 95 మందికి పైగా అర్హులైన లబ్ధిదారులకు నిబంధనల మేరకు ఆన్‌లైన్ విధానంలో ఇళ్ల పట్టాలు ఇచ్చారు. మిగిలిన ప్లాట్లను స్థానిక వైసీపీ నాయకులు బదిలీపై వెళ్లిన రెవెన్యూ అధికారులపై ఒత్తిడి పెట్టించి అక్రమమార్గంలో మాన్యువల్ పద్ధతిలో ప్లాట్లకు పొజిషియన్ సర్టిఫికెట్లు పొందారు. అనంతరం బాధ్యతలు చేపట్టిన రెవెన్యూ అధికారులు ప్రజాప్రతినిధుల సిఫార్సు మేరకు ఇద్దరు ముగ్గురు అర్హులైన లబ్ధిదారులకు రికార్డు పరంగా ప్లాట్ నెంబర్లు వేసి ఇళ్ల స్థలాలకు పొజిషియన్ సర్టిఫికెట్లు మంజూరు చేశారు. వారికి కేటాయించిన ప్లాట్లలో ఇళ్ల నిర్మాణం చేపట్టబోగా అదే ప్లాట్ నెంబర్లతో పొజిషియన్ సర్టిఫికెట్లు పొందిన వైసీపీ నాయకులు వారిపై దౌర్జన్యం చేసి నిర్మాణం చేపట్టకుండా అడ్డగించారు. దీంతో బాధితులు పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించారు. పోలీసులు విచారించి ఇద్దరి వద్ద ఉన్న ఇళ్ల ప్లాట్ల పొజిషిన్ సర్టిఫికెట్లలో ఏది నకిలీ, ఏది ఒరిజనల్ ధ్రువీకరించాలంటూ తహసీల్దార్ కార్యాలయానికి పంపారు. సమస్య పరిష్కారం నిమిత్తం బాధితులు నెలల తరబడి తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా నేటికీ ఎటువంటి పలితం లేదు. ఇన్ని అక్రమాలు జరుగుతున్నా రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ చోద్యం చూస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. అధికారులు విచారణ చేపట్టి అక్రమమార్గంలో పొందిన పట్టాలను రద్దుచేసి అర్హులైన లబ్ధిదారులకు న్యాయం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

వరద బాధితులకు అండగా

- ఏలూరి పిలుపుతో ముందుకొస్తున్న దాతలు
- కొనసాగుతున్న ఆహార ప్యాకెట్ల తరలింపు
- చీరలు, నగదు సాయం

బల్లికురవ, సెప్టెంబరు 4 : జిల్లా ఉన్నతాధికారులు, విద్యుత్ మంత్రి గొట్టిపాటి సూచనల మేరకు మంగళవారం బల్లికురవ, సంతమాగులూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయాల ద్వారా వరద బాధితులకు ఆరు వేల అహార పొట్లాలను వాహనాల ద్వారా విజయవాడకు పంపించారు. బల్లికురవ ఇన్‌చార్జి ఎంపీడీవో రాంబాబు, సంతమాగులూరు ఈవోపీఆర్డీ ప్రసాదరావు పర్యవేక్షణలో ఆరు వేల అహార పొట్లాలను తయారు చేయించి ప్యాకింగ్‌తో విజయవాడుకు పంపించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు ఎవరైన వరద బాధితులను ఆదుకునేందుకు ముందుకు రావచ్చు అని కోరారు. ముఖ్యమంత్రి సహాయ నిధికి విరాళాలు సమర్పించాలని వారు కోరారు.

ఆర్య వైశ్యుల సాయం



ఆహారాన్ని తీసుకువెళ్తున్న మార్టూరు ఆర్య వైశ్యులు

విజయవాడలోని వరద బాధితులకు ఆదుకునేందుకు మార్టూరులో వ్యాపారాలు చేసుకుంటున్న ఆర్య వైశ్యులు బుధవారం సాయం అందించారు. వరద బాధితులకు ఆహార పొట్లాలను అందించేందుకు ఆర్యవైశ్య కల్యాణ మండపంలో 2500 ఆహార పొట్లాలను తయారు చేయించారు. వాటికి తోడు 3వేల వాటర్ బాటిళ్లను, బిస్కట్లు, చీరలను వాహనాలలో విజయవాడకు తరలించి బాధితులకు స్వయంగా అందజేశారు. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సూచన మేరకు ఆర్య వైశ్యులు సహాయాన్ని అందించారు. కార్యక్రమంలో గుర్రం శ్రీను, మద్దు నాని, కనమర్లపూడి ఆంజనేయులు,, గట్టా యానాదిరావు, మామిడిపాక హరిప్రసాద్, కనమర్లపూడి శివయ్య, శ్రీరాం రవిశంకర్,ఆత్మకూరి పవన్ కల్యాణ్ పాల్గొన్నారు.



బల్లికురవ, సంతమాగులూరు నుంచి వరద బాధితులకు తరలిస్తున్న ఆహార పొట్లాలు

రూ.50వేల సాయం

యద్దనపూడి, (మార్టూరు) సెప్టెంబరు 4 : యద్దనపూడి మండలంలోని పూనూరు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ కూటమి నాయకులు వరద బాధితులకు అండగా తమ వంతు సాయంగా బుధవారం రూ.50వేలను వసూలు చేశారు. ఈ మొత్తాన్ని వారు వరద బాధితులకు అందిస్తామన్నారు. ఏలూరి సాంబశివరావు సూచన మేకు సహాయ సహకారాలను అందిస్తామని నాయకులు తెలిపారు.

బాబున్నారు..అధైర్య పడొద్దు

ఎమ్మెల్యే కొండయ్య



విజయవాడ శివారు ప్రాంతంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, సెప్టెంబరు 4 : ముఖ్యమంత్రి చంద్రబాబు అండగా ఉన్నారని, ఎవరూ అధైర్యపడవద్దని విజయవాడ వరద బాధితులకు ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య భరోసా కల్పించారు. రెండు రోజులుగా ముఖ్యులతో కలసి విజయవాడ లోతట్టు ముంపు ప్రాంతాల్లో కొండయ్య పర్యటిస్తున్నారు. భోజనం ప్యాకెట్లు, పాలప్యాకెట్లు, మంచి నీళ్ల బాటిళ్లను దగ్గరుండి పంపిణీ చేయిస్తున్నారు. బాధితులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుంటే వైసీపీ నేతలు అసత్య ప్రచారాలు చేయడాన్ని ప్రజలు ఈసడించు కుంటున్నారని అన్నారు. అనంతరం స్థానికులతో ఆయన మాట్లాడారు. ఆయన వెంట పలువురు టీడీపీ నాయకులు ఉన్నారు.

మంత్రి గొట్టిపాటి సహకారంతో తరలివెళ్తున్న ఆహారం

- 7వేల లీటర్ల పాలు, 20వేల వాటర్‌బాటిళ్లు
- నేడు కూడా పంపిణీ



పాలప్యాకెట్లను పంపిణీ చేస్తున్నశ్రేణులు

అద్దంకి, సెప్టెంబరు 4 : వరద బాధితుల కోసం అద్దంకి నుంచి మంత్రి గొట్టిపాటి రవికుమార్ సహకారంతో విజయవాడకు బుధవారం 7వేల లీటర్ల పాలు, 20వేల వాటర్‌బాటిళ్లను తీసుకెళ్లి పంపిణీ చేశారు. సోమ, మంగళవారాల్లో ఇక్కడ తయారు చేయించి 65వేల మందికి భోజనాలు, వాటర్ బాటిళ్లను పంపించారు. బుధవారం 7వేల లీటర్ల పాలు, 20వేల వాటర్ బాటిళ్లను విజయవాడలోని రాజేశ్వరపేటకు పంపించారు. గురువారం కూడా 50వేల పాలప్యాకెట్లు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. విజయవాడ లో ఎక్కువ మంది పాలప్యాకెట్‌లు అవసరం కావడంతో మంత్రి రవికుమార్ అద్దంకి నుంచి పంపిస్తున్నారు.

బాధితులకు బ్రెడ్లు, పాల ప్యాకెట్లు

స్వయంగా అందజేసిన టీడీపీ కార్యకర్త



వాహనాన్ని పంపిస్తున్న కార్యకర్త శంకరరావు

విజయవాడలో వరద బాధితుల బాధితుల కోసం చంద్రబాబు పడుతున్న కష్టాన్ని టీవీలో చూసి చలించిన అద్దంకి పట్టణానికి చెందిన టీడీపీ కార్యకర్త కురిచేటి శంకరరావు సుమారు 60వేల రూపాయలతో బ్రెడ్, పాలప్యాకెట్‌లు, వాటర్‌బాటిళ్లను బుధవారం అద్దంకిలో కొనుగోలు చేసి ప్రత్యేక వాహనంలో విజయవాడకు తీసుకు వెళ్లారు. తానే స్వయంగా ట్రాలీ ఆటోలో వెళ్లి విజయవాడలోని భవానిపురం, సితార సెంటర్, కబేరా సెంటర్, జక్కంపూడి సెంటర్ లలో బాధితులకు అందజేశారు. కౌన్సిలర్ అత్తులూరి రమేష్ ఆయనవెంట ఉన్నారు.

ఏలూరి పర్యవేక్షణలో ఆహారం పంపిణీ

మార్టూరు : విజయవాడలోని వరద బాధితులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని, ఎవరూ అధైర్యపడవద్దని, ప్రజల క్షేమమే బాధ్యతగా ముఖ్యమంత్రి చంద్రబాబు పనిచేస్తున్నారని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు బుధవారం ప్రకటనలో తెలిపారు. ఏలూరి రెండోరోజూ విజయవాడలో హోంమంత్రి వంగలపూడి అనితతో కలిసి ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు బాధితులను పరామర్శించారు. వరదబాధితుల వద్దకు వెళ్లి పరామర్శిస్తున్నారు. ఆయన విజ్ఞప్తి మేరకు నియోజకవర్గం నుంచి తరలివెళ్తున్న ఆహార పొట్లాలను, మంచినీరు, పాల ప్యాకెట్లను ఆయన దగ్గరుండి బాధితులకు అందేలా చూస్తున్నారు. సీతారాంనగర్, విద్యాధరపురంలో ఏలూరి పర్యటిస్తున్నారు. మరోవక్క ఏలూరి పిలుపుతో పర్చూరు వాణిజ్య విభాగం, ఆర్య వైశ్య సంఘం వారు పెద్ద ఎత్తున వరద బాధితులకు ఆహారం, దుస్తులను సమకూర్చి తరలిస్తున్నారు. దేవరపల్లికి చెందిన కొమ్మాలపాటి సురేష్ రూ.50వేల విలువైన ఆహారాన్ని పంపించారు. యద్దనపూడి మండలం పూనూరు గ్రామానికి చెందిన నాయకులు ఆహార పొట్లాలను, జాగర్లమూడికి చెందిన పార్టీ నేతలు హనుమయ్య లక్షా10 వేలు, దూళ్లిపాళ్ల వెంకటస్వామి రూ.లక్ష విలువైన ఆహారం, వాటర్ బాటిళ్లను విజయవాడకు పంపించారు.



బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఏలూరి

మణికేశ్వరం గ్రామాన్ని సందర్శించిన వైద్యులు, అధికారులు

- జ్వరాలపై ఇంటింటి సర్వే
- జోరుగా పారిశుధ్య కార్యక్రమాలు



ఇంటింటి సర్వే చేస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అద్దంకిటౌన్, సెప్టెంబరు 4 : మణికేశ్వరం గ్రామాన్ని బుధవారం ఎంపీడీవో దేవ సేన కుమారి, వైద్యాధికారులు డాక్టర్ మనోజ్, డాక్టర్ హరికృష్ణ తమ సిబ్బంతో కలిసి ఇంటింటి సర్వే నిర్వహించారు. బుధవారం గ్రామంలో విష జ్వరాలపై ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి స్పందించిన అధికారులు, వైద్యులు గ్రామంలోకి వెళ్లి జ్వరాలతో బాధ పడుతున్న వారిని ఇంటింటి సర్వే ద్వారా గుర్తించారు. ఎంపీడీవో దేవసేన కుమారి గ్రామంలో పర్యటించి జ్వరాలపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో విషజ్వరాలు ప్రబలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. గ్రామంలో పారిశుద్యం పనులు చేట్టాలని, మురుగునీటి నిల్వలు లేకుండా, దోమలు వ్యాప్తి కాకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలు జ్వరాలపై అ వగాహన కలిగి ఉండి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె తెలిపారు. గత వారంరోజుల కిందట గ్రామంలో జ్వర పీడితులను సర్వే చేసి, మందులు అందించడం జరిగిందని వైద్యులు తెలిపారు. ప్రస్తుతం గ్రామంలో 46 మందికి జ్వరాలు ఉండగా , వారిలో కొందరికి జ్వరం తగ్గి, ఒళ్ల నొప్పులతో బాధపడుతున్నారని, మరికొంతమంది ఇతర సమస్యలతో బాధపడుతున్నారని తెలిపారు. ప్రధానంగా చికున్ గున్యా, టైఫాయిడ్ జ్వరాలుగా తెలిపారు. గురువారం గ్రామంలో మరోసారి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయనున్నట్లు వైద్యులు తెలిపారు. ప్రజలు గమనించి మెరుగైన వైద్య సౌకర్యాలున్న ప్రభుత్వ వైద్యశాలలను ఉపయోగించుకోవాలన్నారు.

కత్తెర పురుగు నివారణకు చర్యలు తీసుకోండి

మేదరమెట్ల, సెప్టెంబరు 4 : మొక్కజొన్న పైరుకు ఆశిస్తున్న కత్తెర పురుగు ఉధృతం కాకుండా సస్యరక్షణ చర్యలు చేపట్టాలని అద్దంకి ఏడీఏ కె. ధన్‌రాజ్ తెలిపారు. బుధవారం మేదరమెట్లలో మొక్కజొన్న, కంది, మినుము పైర్లను వ్యవసాయ అధికారి శ్రీనివాసరావుతో కలిసి ఆయన పరిశీలించారు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో లేత పంటలలో పోషక లోపాలు రాకుండా మల్టి-కె, లేదా పొటాషియం నైట్రేట్‌ను వారం తేడాతో రెండు సార్లు పిచికారీ చేసుకుంటే లోపాలను నివారించుకోవచ్చు అన్నారు. మొక్కజొన్నలో కత్తెర పురుగును నివారించుకోవడానికి కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలను అకుల మోములలో వేయాలన్నారు. ఇమ్మామెక్టిన్ బెంజోఎయిట్‌ను పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో వీఏఏ శ్రీకీర్తి, హసీనా, సంతోష్, రైతులు పాల్గొన్నారు.



మొక్కజొన్నను పరిశీలిస్తున్న ఏడీఏ ధన్‌రాజ్

టిడ్కో ఇళ్ల వద్ద సబ్‌స్టేషన్ ఏర్పాటు పనులు ప్రారంభం

అద్దంకి, ఆగస్టు 4 : శింగరకొండ సమీపంలోని టిడ్కో గృహ సముదాయాల వద్ద సబ్ స్టేషన్ ఏర్పాటుకు బుధవారం పనులను ప్రారంభించారు. ఈఈ నల్లూరి మస్తాన్‌రావు ఆధ్వర్యంలో సబ్‌స్టేషన్ ఏర్పాటు చేసే ప్రాంతంలో జంగిల్ క్లియరెన్స్ చేయించి మార్కింగ్ ఇచ్చారు. సబ్‌స్టేషన్ పనులు వేగవంతంగా పూర్తిచేయటం జరుగుతుందని ఈఈ మస్తాన్‌రావు తెలిపారు. టెక్నికల్ ఎఈ బాలకోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న విద్యుత్ శాఖ ఈఈ నల్లూరి మస్తాన్‌రావు

జ్వరాలు రాకుండా జాగ్రత్తగా ఉండండి

అద్దంకిటౌన్, సెప్టెంబరు 4 : సీజనల్‌గా వచ్చే విష జ్వరాలు రాకుండా ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని గాజులపాలెం యూపీహెచ్‌పీ వైద్యుడు డాక్టర్ గొట్టిపాటి జయసింహ తెలిపారు. బుధవారం అద్దంకి పట్టణంలోని రాజీవ్‌కాలనీలో సచివాలయం వద్ద జ్వరం పీడితుల కోసం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. జ్వరంతో బాధపడుతున్న వారిని ఆరోగ్య కార్యకర్తలతో ఇంటింటి సర్వే ద్వారా గుర్తించారు. వారిని పరీక్షించి మందులను అందజేశారు. ఎటువంటి ఇబ్బంది కలిగినా వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చి చికిత్స తీసుకోవాలని, అక్కడ అన్ని రకాలు పరీక్షలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మురుగు నీరు నిల్వలు లేకుండా చేసుకోవాలన్నారు. మొత్తం 30 మంది రోగులను పరీక్షించి మందులు అందజేసినట్లు డాక్టర్ జయసింహ తెలిపారు. కార్యక్రమంలో వైద్య, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ జయసింహ

శ్రీనన్నోరమ్మకు ప్రత్యేక పూజలు

పర్చూరు, సెప్టెంబరు 4 : పర్చూరు మండలం ఉప్పుటూరు గ్రామంలో ఉన్న శ్రీనన్నోరమ్మ అమ్మవారికి బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. నల్లగొర అమ్మవారి ఆడపడుచుగా భక్తులు కొలుస్తారు. కార్యక్రమంలో భాగంగా అమ్మ వారికి ఆడపడుచుగా నల్లగొర్ల కుటుంబీకులు పర్చూరు నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జి నల్లగొర్ల శివ శ్రీలక్ష్మి జ్యోతి సారెను సమర్పించి భక్తిని చాటుకున్నారు.అనంతరం ప్రసాదాలు పంపిణీచేశారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



పౌష్టిక ఆహార పదార్థాలను చూపిస్తున్న అంగన్‌వాడీలు

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

చినగంజాం, సెప్టెంబరు 4 : పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని ఇంకొల్లు సెక్టార్ సీడీపీవో టీ.ఝాన్సీ అన్నారు. మండలంలోని పెద గంజాం గ్రామం ఎస్సీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవాలలో భాగంగా బుధవారం పోషకాహారంపై బాలింతలకు, గర్భిణులకు జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను తీసుకోవడం ద్వారా వ్యాధి నిరోధిక శక్తి కలిగి ఆరోగ్యంగా, ఆర్థికంగా ఉంటారని సీడీపీవో సూచించారు. ప్రతి ఒక్కరూ సమతుల ఆహారం తీసుకోవాలన్నారు. పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను అంగన్‌వాడీ కార్యకర్తలు తయారు చేసి వాటిని ప్రదర్శించారు. పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాల వలన కలిగే ప్రయోజనాలను బాలింతలకు, గర్భిణీ స్త్రీలకు వారు వివరించారు. బాలామృతం ప్యాకెట్లను సీడీపీవో తల్లులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పెదగంజాం సెక్టార్ సూపర్‌వైజర్ కే.వాణిశ్రీ, అంగన్‌వాడీ కార్యకర్తలు జయలక్ష్మీ, విజయలక్ష్మీ, కవిత, బేబి, పద్మ, మల్లేశ్వరి, సౌభాగ్యం, శివనాగేశ్వరి, ఆయాలు, ఏఎన్‌ఎం నాగుల కోటేశ్వరి, గర్భిణిలు, బాలింతలు పాల్గొన్నారు.

చీరాలటౌన్ : గర్భిణులు, బాలింతలు ఆహార నియమాలను క్రమంగా పాటించడం వలన సంపూర్ణ ఆరోగ్యంగా జీవిస్తారని అర్బన్ ఏసీడీపీవో సుచిత్ర అన్నారు. పురపాలక పరిధిలోని ఉజిలీపేట అర్బన్ అంగన్వాడీ కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవం(పోషణ మాహ్) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఏ ఆహారంలో పౌష్టికత లభిస్తోందో వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కుముద్వతి, ఏఎన్‌ఎం కల్యాణి, అంగన్వాడీ కార్యకర్త కళావతి, బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.

హోమియో మందుల పంపిణీ



హోమియో మాత్రలను పంపిణీ చేస్తున్న సభ్యులు

అద్దంకిటౌన్, సెప్టెంబరు 4 : ప్రజలు సీజనల్‌గా వచ్చే వ్యాధులపై అవగాహన కలిగి తగు జాగ్రత్తలు తీసుకోవాలని డిపో మేనేజర్ బీ రామ్‌మోహన రావు అన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో బుధవారం డెంగ్యూ, విష జ్వరాలు రాకుండా ముందస్తు జాగ్రత్తగా వేసుకునేందు ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులకు హోమియో మాత్రలను ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య, హోమియో డాక్టర్ కావూరి రఘుచంద్, రోటరీ కార్యదర్శి మురళీసుధాకరరావు, ట్రెజరర్ శ్రీనివాసరావు, దేవపాలన, చంద్రమౌళి, శ్రీరామచంద్రమూర్తి, ఆంజనేయులు, రామకోటేశ్వరరావు, భువనేశ్వరి, త్రిమూర్తులు, కోటయ్య, నాగయ్య పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాసంపై అవగాహన

చీరాల, సెప్టెంబరు 4 : వైఏ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బుధవారం వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో రామచంద్రమిషన్ హార్ట్‌ఫుల్‌నెస్ మెడిటేషన్ కోఆర్డినేటర్ శ్రీకాంత్ విద్యార్థినులకు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు వల్లంపట్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ వారి ఆదేశాల మేరకు కేసీ గుప్తా జయంతి వారోత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు చెప్పారు. విద్యార్థినుల సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం ప్రసంగీకులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు వీబీవీ సత్యనారాయణ, సాతులూరి బాలాజీ రామకృష్ణ, మువ్వల వేణుగోపాల్, తూతిక మల్లికార్జునరావు, పోలిశెట్టి శ్యాంసుందర్ పాల్గొన్నారు.

15 వరకు ఈకేవైసీ గడువు

పంగులూరు, సెప్టెంబరు 4 : ఖరీఫ్‌లో రైతులు సాగు చేసిన పంటల వివరాలను ఈ నెల 15వ తేదీలోగా ఈకేవైసీని చేయించుకోవాలని వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి తెలిపారు. బుధవారం ఏవో సుబ్బారెడ్డి మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా పంటల బీమా పథకాన్ని అమలు చేస్తున్నాయన్నారు. వర్షాభావ పరిస్థితుల్లో పంట నష్టం వాటిల్లిన రైతులకు ఈ పథకం ఆసరాగా నిలుస్తుందన్నారు. పంటల బీమా పొందేందుకు రైతులు తమ పంటలకు తప్పనిసరిగా ఈకేవైసీని చేయించుకోవాలని సూచించారు. ఈ నెల 15లోగా ఈకేవైసీని చేయించకపోతే బీమా వర్తించదని తెలిపారు. వ్యవసాయ సిబ్బంది పంట సాగవుతున్న పొలాలకు వెళ్లి ఈకేవైసీని చేస్తారని, రైతులు సంబంధిత పత్రాలు, ఆధార్ కార్డు, మొబైల్ నెంబర్‌తో సిద్ధంగా ఉండాలన్నారు. సాగు భూమివద్ద రైతులతో ఫొటో తీసుకుని వారి వేలిముద్రతో ఈకేవైసీని పూర్తి చేస్తారని తెలిపారు. నిర్ణీత గడువులోగా సంబంధిత రైతులు ఈకేవైసీని పూర్తి చేయించుకోవాలని ఏవో కోరారు.

విజయవాడకు పారిశుధ్య కార్మికులు


ఇంకొల్లు, సెప్టెంబరు 4 : ఇంకొల్లు నుంచి పారిశుధ్య కార్మికులు బుధవారం బాపట్ల జిల్లా కొల్లూరు మండల ప్రాంత వరద బాధిత ప్రాంతానికి బయలుదేరి వెళ్లారు. అక్కడ పారిశుధ్య పనుల్లో భాగస్వామ్యం అయ్యేందుకు కార్యదర్శి కోటి నాగయ్య ఆధ్వర్యంలో పలువురు కార్మికులు తరలి వెళ్లారు. అక్కడ పరిస్థితి అదుపులోకి వచ్చే వరకూ పనులు చేస్తారని తెలిపారు.

ఉపాధ్యాయుల కృషితో సమాజం ముందుకు

అద్దంకిటౌన్, సెప్టెంబరు 4 : ఉపాధ్యాయుల కృషి సమాజాన్ని ముందుకు నడిపించేందుకు ఎంతగానో తోడ్పడుతుందని, ఉపాధ్యాయుల సేవలను గుర్తించి వారికి ప్రోత్సహించడం అభినందనీయమని ఎంఈవో గంగాధరరావు అన్నారు. గురుపూజోత్సవాన్ని పురస్కరించుకొని ముందస్తుగా బుధవారం మారం వారి సేవాసదన్‌లో పుట్టంరాజు బుల్లెయ్య, రామలక్ష్మమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో మండలంలోని విద్యారంగంలో విశేష కృషి చేస్తున్న పలువురు ఉపాధ్యాయులకు పురస్కారాలను ప్రదానం చేశారు. వారణాసి రఘురామశర్మ అధ్యక్షతన జరిగిన ఈ సన్మాన కార్యక్రమంలో ఉపాధ్యాయులు కోవి మల్లికార్జునరావు, పాములపాటి రాజశేఖర్, శానంపూడి నాగమల్లిక, మానికొండ ధనలక్ష్మిని ట్రస్ట్ అధ్యక్షుడు పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, శైలజ దంపతులు పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సమాజంలో ఉపాధ్యాయుల ప్రాతను పలువురు వర్ణించారు. కార్యక్రమంలో చప్పిడి వీరయ్య లక్కరాజు శ్రీనివాసరావు, చుండూరి మురళీసుధాకరరావు, డాక్టర్ యూ దేవపాలన, చంద్రశేఖర్, డీపీఎం సత్యనారాయణ, వెంకటప్ప, మహమ్మద్ రఫీ, శ్రీనివాసరావు, రాజశేఖర్, పోలిరెడ్డి, శి వరామ కోటేశ్వరరావు, కుమార్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. ఏపీటీఎఫ్ నాయకులు పాల్గొన్ని ఉపాధ్యాయులను సన్మానించారు.



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ట్రస్ట్ సభ్యులు





ప్రపంచాన్ని మార్చే శక్తివంతమైన ఆయుధం విద్య మాత్రమేనని ఎంతోమంది మేధావులు చెప్పారు. అంతటి శక్తివంతమైన ఆయుధాన్ని ప్రజలకు అందించేవారు, మనిషిని పరిపూర్ణమైన వ్యక్తిగా తీర్చిదిద్దే క్రాంతి ప్రదాతలు ఉపాధ్యాయులు. ఎగిరే గాలిపటం విద్యార్థి అయితే దానికి ఆధారమైన దారం గురువు. శిష్యుడు ఏ తీరానికి చేరాలన్నా ఆ చుక్కాని దిశానిర్దేశం ఉండాల్సిందే!. అందుకే సమాజంలో తల్లి, తండ్రి తర్వాత గురువును దైవంగా భావిస్తారు.. పూజిస్తారు. బోధన వృత్తి నుంచి దేశ సార్వభౌమాధికారి స్థాయికి ఎదిగిన మహామనిషి సర్వేపల్లి రాధాకృష్ణన్. ఆయన జయంతి సందర్భంగా ఏటా సెప్టెంబరు ఐదవ తేదీన ఉపాధ్యాయ దినోత్సవం జరుపుకుంటున్నారు. ఈ వేడుకలకు జిల్లా సిద్ధమైంది.

ఆచార్య దేవోభవ!

- భావిభారత పౌరుల తయారీలో ఉపాధ్యాయుడే కీలకం
- నేడు సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి
- 60 మంది టీచర్లకు ఉత్తమ అవార్డులు

నెల్లూరు (విద్య), సెప్టెంబరు 4 : విద్యార్థి జీవితాన్ని ప్రభావితం చేసేది ఉపాధ్యాయుడే. ఎక్కువ మంది విద్యార్థులు పాఠశాల స్థాయిలో ఉపాధ్యాయులను నిజమైన గురువులుగా చెప్పుకుంటారు. ఉపాధ్యాయులకు ఆదర్శంగా నిలిచిన వ్యక్తి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్. విద్యార్థి జీవన గమనాన్ని నిర్దేశించి విలువలు ఎలా ఉండాలో అధ్యాపక లోకానికి చాటిచెప్పిన మహనీయుడు ఆయన. తమిళనాడులోని తిరుత్తణిలో జన్మించిన రాధాకృష్ణన్ విద్యార్థికి ఉపాధ్యాయుడికి మధ్య సంబంధం ఎలా ఉండాలో విడమరిచి చెప్పారు. అధ్యాపకుడిగా, ఉపకులపతిగా, దౌత్యవేత్తగా, ఉపరాష్ట్రపతిగా, రాష్ట్రపతిగా ఆయన సేవలు నిరుపమానం. ఆయన అధిరోహించిన శిఖరాలు ఆయన జీవితంలోని అసాధారణ కోణాలను వెల్లడిచేస్తాయి. ఉపాధ్యాయ వృత్తి నుంచి రాష్ట్రపతి వరకు ఉన్నతి సాధించిన ఆయన్ను స్మరించుకుంటూ ఆయన జయంతి రోజున ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకోవడం ఆనవాయితీగా మారింది.

● 60 మందికి గురు సత్కారం

ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లాలో ముగ్గురు ప్రధానోపాధ్యాయులు, 24 మంది స్కూల్ అసిస్టెంట్లు, 33 మంది సెకండరీ గ్రేడ్ టీచర్లు మొత్తం 60 మంది ఉపాధ్యాయులు ఉత్తమ పురస్కారాలను అందుకోబోతున్నారు. గురువారం నగరంలోని కలెక్టరేట్‌లో ఉన్న తిక్కన ప్రాంగణంలో ఉదయం 10 గంటలకు సన్మాన కార్యక్రమాలు నిర్వహించేందుకు విద్యాశాఖ-సమగ్రశిక్షలు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాయి. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణరెడ్డితోపాటు ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజా ప్రతినిధులు, కలెక్టర్ ఆనంద్, ఎస్పీ జి.కృష్ణకాంత్, జేసీ కార్తీక్, కమిషనర్ ఎం.సూర్యతేజ హాజరవుతారని డీఈఓ రామారావు, ఎస్ఎస్ఏ ఏపీసీ సీహెచ్.ఉషారాణి తెలిపారు.



ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలి

ఉపాధ్యాయ దినోత్సవం నాడు ఉపాధ్యాయుల్లో వెలుగులు నిండేలా పాలకులు నిర్ణయం తీసుకోవాలి. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిస్తున్న తల్లిదండ్రులకు భరోసా ఇవ్వడంతోపాటు ప్రోత్సాహకాలూ అందించాలి. విద్యను ప్రైవేటీకరణ నుంచి కాపాడటంతోపాటు ప్రాథమిక విద్యలో మాతృభాషలో బోధన కొనసాగించాలి. గతంలో జరిగిన తప్పులు పునరావృతం కాకుండా ఉపాధ్యాయుల గౌరవం పెరిగేలా నిర్ణయాలు తీసుకోవాలి. హక్కులను కాపాడుతూ వారికి అందించాల్సిన రాయితీలను, సౌలభ్యాలను అందించేందుకు ప్రభుత్వాలు కృషి చేయాలి.

- జీవీ.చలపతిశర్మ, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

ప్రయోగాల మాస్టర్ సుధాకర్



విద్యార్థులకు ప్రయోగ మెలకువలు నేర్పుతున్న సుధాకర్

పొదలకూరు : పొదలకూరు బాలుర ఉన్నత పాఠశాలలో భౌతిక రసాయన శాస్త్ర ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న ఏవీ సుధాకర్ వైజ్ఞానిక ఆలోచనలతో శాస్త్రీయ వైఖరిని పెంపొందించుకుని ఎన్నో ప్రశంసలు అందుకున్నారు. రసాయన శాస్త్ర పీజీ పట్టా అందుకుని ప్రముఖ కంపెనీల్లో అవకాశాలు వచ్చినా ఉపాధ్యాయ వృత్తిపై ఉన్న మమకారంతో ఉపాధ్యాయుడిగా కొనసాగుతున్నారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్న ఏకైక సైన్స్ క్లబ్ పొదలకూరు ఉన్నత పాఠశాలలో ఉంది. దాని ద్వారా అనేక వైజ్ఞానిక సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తూ జాతీయస్థాయిలో మూడుసార్లు అవార్డు అందుకున్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు సైతం వైజ్ఞానిక భావాలు అందించాలని ఇటువంటి నిశ్చయంతో తన తల్లిపేరిట నెల్లూరులోని తన ఇంటిపై సుమారు రూ.10లక్షలతో ఏవీఎం కిడ్స్ సైన్స్ కార్నర్‌ను ఏర్పాటు చేశారు. ప్రతి ఆదివారం ఉచితంగా విద్యార్థులకు అవకాశం కల్పిస్తూ వారిలో విజ్ఞాన శాస్త్ర పట్ల భయాన్ని పోగొట్టి భావిశాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు అవకాశం కల్పిస్తున్నారు. నాసా బార్క్ ఐఏఎస్ఎఫ్ ఎన్‌టీఎస్‌సీ వంటి ప్రతిష్ఠాత్మక సదస్సులకు హాజరై ప్రశంసలు పొందారు.

బహుముఖ ప్రజ్ఞశాలి ప్రసాద్



ఆత్మకూరు : పట్టుదల.. క్రమశిక్షణ.. అంకితభావం.. కర్తవ్య నిర్వహణలో న్యాయం చేయాలనే సంకల్పం డాక్టర్ ఎం ప్రసాద్ సొంతం. ఆత్మకూరులోని ప్రభుత్వ హైస్కూల్‌లో తెలుగు పండిట్ ఉన్న ఆయన మాతృబాష తోపాటు హిందీ, ఇంగ్లీషు, తమిళం, మళయాళం, కన్నడం, సంస్కృత బాషల్లో ప్రావీణ్యం సంపాదించారు. విద్యా బోధనతోపాటు విద్యార్థులకు అవసరమైన కథలను ఇతర భాషల్లో నుంచి తర్జుమా చేసి బోధిస్తున్నారు. వ్యాసాలు, కవితలు, పాటలతోపాటు విద్యార్థులకు కోలాటం, జానపద నృత్యాలను నేర్పుతుంటారు. 30కిపైగా జాతీయ సదస్సులు, 15 అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొని తాను రచించిన వ్యాసాలను సమర్పించారు. అందుకే ఎన్నో సంస్థలు, భాషాభిమానులు ఆయన్ను సత్కరించారు. ఉద్యోగ బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తున్నందుకు జిల్లాస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక అయ్యారు.



భావిభారత పౌరుల్లో ఉత్సాహం నింపుతూ..

అనంతసాగరం : ఈయన పేరు చల్లా చంద్రశేఖర్‌రెడ్డి చిలకలమర్రి ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడు. చదువుతోపాటు పర్యావరణంపై విద్యార్థులకు ప్రత్యేక తర్ఫీదు ఇవ్వడంతోపాటు సామాజిక అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. స్వాతంత్ర్య సమరయోధుల జీవిత చరిత్రలు తెలిసేలా కార్యక్రమాలు నిర్వహిస్తూ భావిభారత పౌరుల్లో ఉత్సాహం నింపుతున్నారు. ఇటీవల జరిగిన జాతీయ అంతరిక్ష క్విజ్ పోటీల్లో ఆయన పాల్గొనగా, ఇస్రో చైర్మన్ ఎస్ సోమనాథ్ నుంచి ప్రశంస పత్రం లభించింది.

మనుసున్న మాస్టార్లు వీరు!



పిల్లలకు విద్యాసామగ్రి ఇస్తున్న ఉపాధ్యాయులు బాబు, ఫణిరాజు

ఉదయగిరి రూరల్ : పాఠశాలకు వెళ్లామా.. పాఠాలు బోధించామా.. ఇంటికెళ్లామా అనే ఆలోచనతో ఆ ఉపాధ్యాయులు పని చేయడం లేదు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, విద్యార్థులకు ఉత్తమ బోధనతోపాటు వసతుల కల్పనే లక్ష్యం విధులు నిర్వహిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు ఉదయగిరి మండలం జీ.అయ్యవారిపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు బాబు, ఫణిరాజులు. తమ పాఠశాల ఆవరణలో ఫలాలు, పూలు, ఆయుర్వేద మొక్కలను విద్యార్థులతో నాటించి సంరక్షణ బాధ్యతలు చేపడుతున్నారు. మొక్కల పెంపకం వల్ల కలిగే లాభాలు, పర్యావరణ పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను పిల్లలకు వివరిస్తున్నారు. అలాగే తమ సొంత నిధులతో ప్రతిఏటా విద్యార్థులకు నోట్‌పుస్తకాలు, ఇతర సామగ్రి అందజేస్తున్నారు. పాఠశాలలో గ్రంథాలయం ఏర్పాటు చేసి, 300 రకాల పుస్తకాలను సమకూర్చారు. ప్రతిరోజు తప్పనిసరిగా యోగా తరగతులు నిర్వహించడమేగాక, నవోదయ ప్రవేశ పరీక్షలకు విద్యార్థులకు శిక్షణ ఇచ్చి ఉచితంగా మెటీరియల్ అందజేస్తారు. విద్యార్థులకు చిత్రలేఖనం పోటీల్లో తర్ఫీదు ఇవ్వడంతోపాటు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విద్యార్థులకు బహుమతులు అందజేస్తూ అందరిచేత మన్ననలు పొందుతున్నారు.





● సాయం చేయండి : కలెక్టర్

నెల్లూరు (హరనాథపురం) : వరద బాధితులకు సహాయం చేసి ఆదుకోవాలని కలెక్టర్ ఆనంద్ జిల్లావాసులను కోరారు. వరద బాధితులకు ఆహార పదార్థాల సేకరణ కోసం కలెక్టరేట్ ప్రాంగణంలోని డీఎస్వో కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయించినట్లు చెప్పారు. బిస్కెట్లు, బ్రెడ్, పాలు, వాటర్ బాటిళ్లు తదితర ఆహార పదార్థాలను స్వచ్ఛందంగా ఈ కౌంటర్‌లో అందజేయాలన్నారు. వీటిని ప్రత్యేక వాహనంలో విజయవాడకు తరలించనున్నట్లు చెప్పారు. ఆహార పదార్థాలు అందచేసేవారు ఏఎస్ఓ అంకయ్య ఫోన్ నెం. 8500040699లో సంప్రదించాలన్నారు.

● నగదు జమ చేయాలనుకునే వారు సీఎం రిలీఫ్ ఫండ్ ఎస్‌బీఐ ఖాతా నెం.38588079208. ఐఎఫ్ఎస్‌సీ నెం. 0018884, యూనియన్ బ్యాంకు ఖాతా నెం. 110310100029039, ఐఎఫ్ఎస్‌సీ నెం.: యూబీఐఎన్ 0830798 ఏపీ సెక్రటేరియట్ వెలగపూడి బ్రాంచి ఖాతాకు చెల్లించవచ్చని తెలిపారు. కలెక్టరేట్‌లోని డీఆర్‌ఓకు అందజేసే చెక్కులను సీఎంఆర్ఎఫ్ ఖాతాకు జమ చేయనున్నట్లు కలెక్టర్ చెప్పారు.

● : జిల్లాలోని రిజిస్ట్రేషన్లు-స్టాంపులశాఖ ఉద్యోగులు రూ.1.93 లక్షల విరాళాన్ని వారి రాష్ట్ర అసోసియేషన్ ద్వారా సీఎం సహాయనిధికి అందచేశారని ఆ శాఖ డీఐజీ కిరణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. తాను వ్యక్తిగతంగా రూ.25 వేలు పంపినట్లు తెలిపారు. రెవెన్యూ సిబ్బంది నెల్లూరు నుంచి ఏడు వాహనాల్లో ఫుడ్ ప్యాకెట్లు, వాటర్ బాటిళ్లను సిద్ధం చేసి పంపారు.



ఆపన్న హస్తం అందిద్దాం!

- బెజవాడ బాధితులను ఆదుకుందాం! ● ఇప్పటికే విరివిగా విరాళాలు
- ధాన్యం, నిత్యావసరాలూ అందజేత ● కలెక్టరేట్‌లో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు

నెల్లూరు (హరనాథపురం): రాష్ట్రంలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మిక పెన్షనర్లు, గ్రామ సచివాలయ సిబ్బంది తమ ఒక రోజు వేతనాన్ని రాష్ట్ర ఖజానాకు జమ చేస్తున్నారని ఏపీఎన్జీవో సంఘం జిల్లా అధ్యక్షుడు మన్నేపల్లి పెంచలరావు చెప్పారు. ఎన్జీవో హోంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఏపీజేఏసీ చైర్మన్ శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి హృదయరాజులు ముఖ్యమంత్రిని కలిసి ఒక రోజు మూలవేతనాన్ని సెప్టెంబరు నెల జీతం నుంచి మినహాయించి రాష్ట్ర ఖజానాకు జమచేయాలని వినతిపత్రం ద్వారా కోరినట్లు చెప్పారు.

● నెల్లూరు (సాంస్కృతికం) : ది నెల్లూరు ఆర్య వైశ్య బులియన్ మర్చంట్స్ అండ్ పాన్ బ్రోకర్స్ అసోసియేషన్ సభ్యులు రూ.3,01,116 విరాళంగా ఇచ్చారు. ఆ మేరకు చెక్కును జీఎస్టీ జాయింట్ కమిషనర్ ఎ.రవీంద్రనాథ్‌రెడ్డికి అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శోభన్‌బాబు, కొండా ప్రవీణ్‌శంకర్, ఆడిటర్ ఏవీఎస్ కృష్ణమోహన్‌రావు పాల్గొన్నారు. అలాగే భారత సేవా ఫౌండేషన్ సభ్యులు 16,516 విలువగల ఆయుర్వేద సబ్బులు, పేస్టులను కమిషనర్ సూర్యతేజ ద్వారా బాధితులకు పంపారు.

● జలదంకి : మండలంలోని ఎన్డీఏ కూటమి నాయకులు ప్రత్యేక వాహనం ద్వారా విరాళాలు సేకరించారు. అన్నవరం, జలదంకి గ్రామాలలో ప్రజల నుంచి బియ్యం, నిత్యావసర సరుకులు సేకరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మునగాల తిరుమలరెడ్డి, రామక్రిష్ణారెడ్డి, రామచైతన్య, అశోక్, ముప్వా శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.



నెల్లూరు : రూ.3 లక్షల చెక్కును అందిస్తున్న బులియన్ మర్చంట్స్ నాయకులు

● కందుకూరు : నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు రూ.లక్ష విరాళం అందజేశారు. వలేటివారిపాలెం, కందుకూరు జడ్పీటీసీ సభ్యుల భర్తలు ఇంటూరి హరిబాబు, తొట్టెంపూడి శ్రీనివాసరావు, కందుకూరు ఎంపీపీ భర్త ఇంటూరి మాధవరావు, సర్పంచులు సబ్ కలెక్టరు శ్రీపూజను కలిసి డీడీ అందజేశారు. అలాగే ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో వాటర్‌బాటిళ్లు, బిస్కెట్ ప్యాకెట్లు సిద్ధం చేసి, ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ద్వారా బాధితులకు పంపిణీ చేయనున్నట్లు వారు తెలిపారు. అలాగే హోటల్స్ అండ్ రెస్టారెంట్ల యజమానులు రూ.50వేలు అందజేస్తున్నట్లు తెలిపారు.

స్వాతంత్ర్య సమరోద్యమ సమయంలోనైనా.. విపత్కర పరిస్థితుల్లోనైనా దొడ్డ మనసు ప్రదర్శించడం, మేమున్నామంటూ ఆపన్న హస్తం అందించడం సింహపురీయుల ప్రత్యేకత.

ఆనాడు బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా సుదీర్ఘ కాలం నడిచిన స్వాతంత్ర్య పోరాటానికి జిల్లావాసులు పెద్ద ఎత్తున ఆర్థిక సాయం అందించారు. బకింగ్‌హాం కెనాల్ మీదుగా జిల్లా నుంచి భారీగా ధాన్యపు రాశులు ఉద్యమకారులకు పంపారు. స్వాతంత్ర్య అనంతరం కూడా నెల్లూరు ప్రజలు పలు సందర్భాల్లో భారీ విరాళాలతో మానవత్వం చాటుకున్నారు. దివిసీమ ఉప్పెన మొదలు దేశంలో ఎక్కడ ఏ విలయం జరిగినా, సాటి మనిషికి సాయం అవసరం అనిపించే ఏ సందర్భంలోనైనా మేమున్నామంటూ బాధితులకు అండగా నిలబడి, తమ వంతు సాయం చేశారు.

ఇప్పుడు అన్నపూర్ణలాంటి కోనసీమకు కష్టమొచ్చింది. వరద బీభత్సానికి బెజవాడ కన్నీటి చెలమయ్యింది. సంపన్న ప్రాంతంగా గుర్తింపు పొందిన ప్రాంతం పిడికెడు మెతుకుల కోసం చేయి చాస్తోంది. ఈ విపత్కర పరిస్థితుల్లో మరోసారి నెల్లూరువాసులు తమ దానగుణం చాటుకోవాల్సిన అవసరం ఏర్పడింది. ఇప్పటికే ఎంతోమంది దాతలు సాయం అందిస్తున్నారు. జిల్లాకు చెందిన పూర్వ ఉపరాష్ట్రపతి వెంకయ్య కుటుంబం, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి దంపతులు భారీగా విరాళాలు అందజేశారు. పలువురు దాతలు నేరుగా ముఖ్యమంత్రి సహాయనిధి బ్యాంక్ ఖాతాలకు అందజేస్తున్నారు. కలెక్టర్ ద్వారా మరి కొందరు నిధులు సమకూరుస్తున్నారు. విజయవాడ గుండెపై ప్రకృతి చేసిన గాయం మాన్పలేకపోయినా కనీసం ఆ బాధ నుంచి అక్కడి ప్రజలకు కాసింత ఉపశమనం కలిగించడానికి అవసరమైన సాయం అందాలంటే అందరూ తలో చేయి వేయాలి. నెల్లూరీయుల గొప్ప మనసు మరోసారి చాటుకోవాలి.

- నెల్లూరు (ఆంధ్రజ్యోతి)

సహాయక చర్యల్లో మేము సైతం

నెల్లూరు, (ఆంధ్రజ్యోతి) : విజయవాడలో వరద సహాయక చర్యల్లో మేము సైతం అంటూ జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో అధికారులు, ఉద్యోగులు తరలివెళ్లారు. ప్రభుత్వ ఆదేశాలతో పలు శాఖల ఉద్యోగులను బృందాలుగా విభజించి పంపారు. పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణ, విద్యుత్ పునరుద్ధరణ, బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించే పనిలో భాగంగా మున్సిపాలిటీలు, పంచాయతీల్లోని పారిశుధ్య సిబ్బందిని, విద్యుత్ సిబ్బందిని, ఫైర్, పోలీసు సిబ్బందిని తరలించారు. జాయింట్ కలెక్టర్ కార్తీక్, ఆత్మకూరు ఆర్డీవో మధులతలు మొదటి రోజు నుంచీ సహాయక చర్యల్లో భాగమయ్యారు. విద్యుత్ శాఖ నుంచి లైన్‌మన్ మొదలు ఈఈ స్థాయి వరకు సుమారు 200 మంది అధికారులు, సిబ్బంది విజయవాడలో ఉన్నారు. పంచాయతీ విభాగం నుంచి 60 టీంలు (ఒక్కో టీంలో ఆరుగురు)గా విభజించి మొత్తం 360 మంది పారిశుధ్య నిర్వహణలో పని చేస్తున్నారు. పోలీసు శాఖ నుంచి కానిస్టేబుల్ మొద లు డీఎస్పీ వరకు కలిపి 400 మంది విధుల్లో ఉన్నారు. అగ్నిమాపక శాఖకు సంబంధించి 70 మంది సిబ్బంది సహాయక చర్యల్లో భాగస్వా ములై ఉన్నారు. నెల్లూరు, పొదలకూరు మినహా జిల్లాలో మిగిలిన అన్ని ఫైర్ ఇంజన్లు విజయవాడకు వెళ్లాయి. నెల్లూరు కార్పొరేషన్ నుంచి 166 మంది పారిశుధ్య కార్మికులు, నలుగురు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ఐదుగురు సచివాలయం సిబ్బంది, పది మంది పారిశుధ్య మేస్త్రీలతోపాటు కమిషనర్ సూర్యతేజ, ఎస్ఈ సంపత్ కుమార్, ఈఈలు సంజయ్, చంద్రయ్య, పలువురు డీఈ, ఏఈలు విజయవాడలో సహాయక చర్యల్లో ఉన్నారు.



పాత జీవోలు..

నెల్లూరు చెరువులో మట్టి తవ్వకాలతో ఏర్పడ్డ భారీ గుంత

కొత్త అనుమతులు!

- ఇరిగేషన్ అధికారుల లీలలు
- చెరువులను కుళ్లబొడుస్తున్న అక్రమార్కులు
- అనుమతులు గోరంత.. తవ్వేది కొండంత
- వరుస ఫిర్యాదులతో కలెక్టర్ ఆగ్రహం
- సస్పెండ్ చేస్తానని అధికారులకు హెచ్చరిక

ప్రభుత్వం మారినా కొందరు ఇరిగేషన్ అధికారుల తీరు మారడం లేదు. పాత జీవోలను అడ్డుపెట్టుకుని విచ్చలవిడిగా చెరువుల్లో మట్టి తవ్వకాలకు అనుమతులు ఇస్తున్నారు. ఇదే అదునుగా అక్రమార్కులు కూడా బరి తెగిస్తున్నారు. తీసుకుంటున్న అనుమతులకు, జరుపుతున్న తవ్వకాలకు సంబంధం లేకుండా చెరువులను కుళ్ల బొడుస్తున్నారు. నెల రోజులుగా జరుగుతున్న అక్రమ తవ్వకాలపై కలెక్టర్ ఆనంద్ సీరియస్ అయ్యారు. ఇకపై చెరువుల్లో తవ్వకాలకు అనుమతులిచ్చినా, అనధికారికంగా తవ్వకాలు జరిగినా సంబంధిత అధికారులను సస్పెండ్ చేస్తానని హెచ్చరించారు.

నెల్లూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కొత్త ప్రభుత్వం ఏర్పడ్డాక రియల్ ఎస్టేట్ వేగం పుంజుకుంది. కొత్తగా వెలుస్తున్న లేఅవుట్లకు మట్టి, గ్రావెల్ అవసరం కావడంతో కొందరు అక్రమ మార్గంలో వ్యాపారాన్ని మొదలు పెట్టారు. మట్టి, గ్రావెల్ తవ్వకాలకు కూటమి ప్రభుత్వం ఇంతవరకూ ఎటువంటి గైడ్‌లైన్స్ జారీ చేయలేదు. గత ప్రభుత్వంలో జరిగిన అక్రమాలను దృష్టిలో పెట్టుకొని ఈదఫా పక్కాగా నిబంధనలు రూపొందించాలని యోచిస్తోంది. కానీ జిల్లాలో మాత్రం గడువు ముగిసిన జీవోలను అడ్డుపెట్టుకొని అక్రమార్కులు చెరువుల్లో మట్టి, గ్రావెల్ తవ్వకాలకు దరఖాస్తు చేస్తున్నారు. దీనికి రాజకీయ సిఫారసు తోడవుతోంది. ఇంకే ముంది పాత జీవోల ఆధారంగా తవ్వకాలకు అనుమతులు జారీ చేస్తున్నారు. ఒక్క నెల్లూరు సెంట్రల్ డివిజన్ పరిధిలోనే ఇటీవల ఎక్కువగా అనుమతులు జారీ అవుతున్నాయి. నెల్లూరు చెరువులో వెయ్యి క్యూబిక్ మీటర్లకు అనుమతులు తీసుకొని 30 వేల క్యూబిక్ మీటర్లను తవ్వేశారు. ఇంకా తవ్వుతూనే ఉన్నారు. వ్యవసాయ భూముల చదునుకు మట్టి అవసరమని అనుమతుల పత్రాల్లో పేర్కొంటున్నా ఆ మట్టి, గ్రావెల్‌ను లేఅవుట్లకు తరలిస్తూ రూ.కోట్లు గడిస్తున్నారు. ధనలక్ష్మీపురం పరిసరాల్లోని చెరువులో కూడా విచ్చలవిడిగా తవ్వకాలు జరుపుతున్నారు. జిల్లాలోని అనేక చోట్ల ఇదే పరిస్థితి కొనసాగుతోంది. దీంతో అక్రమార్కులు మరింత బరితెగిస్తున్నారు.

● కలెక్టర్ ఆగ్రహం

మట్టి, గ్రావెల్ తవ్వకాల్లో అక్రమాలు జరుగుతున్నాయన్న ఫిర్యాదుల నేపథ్యంలో జిల్లాలో అనుమతులు జారీ చేయవద్దని ఇరిగేషన్ శాఖ సెక్రటరీ సాయిప్రసాద్ గత నెలలో ఆదేశాలు జారీ చేశారు. అయినా కొన్ని డివిజన్ల ఈఈలు అనుమతులు ఇస్తున్నారు. ఇటీవల జిల్లాలో మట్టి తవ్వకాలు ఎక్కువైపోతుండడం, అడిగితే అనుమతులు ఉన్నాయని చెబుతుండడం కలెక్టర్ దృష్టికి వచ్చింది. ఈ తవ్వకాలతో కొన్ని చెరువులు రూపుకోల్పో తున్నట్లు కలెక్టర్‌కు ఫిర్యాదులు అందాయి. దీంతో వెంటనే స్పందించిన కలెక్టర్ ఇరిగేషన్ ఉన్నతాధికారులతో చర్చించారు. సెక్రటరీ ఆదేశాలు జారీ చేసినా అనుమతులిచ్చినట్లు కలెక్టర్ దృష్టికి రావడంతో ఆయన సీరియస్‌గా తీసుకున్నారు. ఇకపై ఎక్కడైనా తవ్వకాలకు అనుమతులిచ్చినా లేదా చెరువుల్లో అనధికారికంగా మట్టి తవ్వకాలు జరిగినా సంబంధిత అధికారులను సస్పెండ్ చేస్తానని తీవ్రంగా హెచ్చరించారు. దీంతో ఒక్కసారిగా ఇరిగేషన్ శాఖలో ఉలికిపాటు వచ్చింది. కలెక్టర్ ఆదేశాలతో వెంటనే ఇరిగేషన్ ఎస్ఈ కృష్ణమోహన్ అన్ని డివిజన్లకు మెమో జారీ చేశారు. దీనిపై ఎస్ఈను వివరణ కోరగా మెమో జారీ చేసిన మాట వాస్తవమేనని చెప్పుకొచ్చారు.

తెల్లవారుజాము 2 గంటల సమయంలో అంతా ఆదమరిచి నిద్రపోతున్నారు. ఇంతలో కూతవేటు దూరంలో ఉన్న ఓ బాణసంచా గోదాములో భారీ శబ్దం. క్షణాల్లో మంటలు ఉవ్వెత్తున ఎగసిపడ్డాయి. ఏం జరిగిందో తెలుసుకునేలోపు అంతా కాలిపోయి బూడిద మిగిలింది. గోదాముకు కాపలా ఉన్న ఓ వృద్ధుడు సజీవదహనమవగా, మరొకరు అప్రమత్తమై తప్పించుకున్నాడు. సుమారు రూ. 10 లక్షల టపాసులు అగ్నికి ఆహుతి అయ్యాయని బాధితుడు గగ్గోలు పెట్టారు. నెల్లూరు శివారున కల్లూరిపల్లి వద్ద బుధవారం ఉదయం జరిగిన ఈ ఘటన శివారు ప్రాంతప్రజలను ఉలికిపాటుకు గురిచేసింది.

నిశిరాత్రిలో విస్ఫోటం

- కల్లూరిపల్లి వద్ద బాణసంచా గోదాము దగ్ధం ● నిమిషాల్లో వ్యాపించిన మంటలు
- వాచ్‌మన్ సజీవదహనం ● మరొకరికి తప్పిన ప్రమాదం ● రూ. 10 లక్షల ఆస్తినష్టం

నెల్లూరు రూరల్, సెప్టెంబరు 4 : నగర శివారులోని కల్లూరిపల్లి పరిధిలో ఆకుల సుధీర్‌కు చెందిన భవానీ ట్రేడర్స్ టపాసుల గోదాములో బుధవారం తెల్లవారుజాము సుమారు 2 గంటల ప్రాంతంలో మంటలు చేలరేగాయి. ఈ మంటలు ఎలా వచ్చాయో తెలియదుకానీ గోదాములో ఒక్కసారిగా భారీ శబ్దాలతో పేలుళ్లు సంభవించాయి. వరండాలో నిద్ర పోతున్న వాచ్‌మన్ వడ్లమూడి సుబ్బయ్య (62) అప్రమత్తం అయ్యేలోపే మంటలు చుట్టుముట్టాయి. ఊపిరాడని స్థితిలో అక్కడే పడిపోయిన సుబ్బయ్య మంటల్లో చిక్కుకుని సజీవదహనమయ్యాడు. పోస్టుమార్టానికి తరలించడానికి కూడా వీలులేకపోవడంతో అక్కడే పీఎం చేయించిన పోలీసులు కేసుకట్టారు. మరోక వాచ్‌మన్ టపాసుల వెంకటేశ్వర్లు మాత్రం మంటలను పసిగట్టి అప్రమత్తమై పరుగులు తీయడంతో ప్రాణాలతో బయటప డ్డాడు. ఈ ప్రమాదంలో రూ. 10 లక్షల వరకు టపాసులు అగ్నికి ఆహుతైనట్లు నిర్వాహకులు బోరుమన్నారు. కాగ నివాసాలకు దూరంగా గోదాము ఉండటంతో ప్రాణ నష్టం ఒకరితో ముగిసిందని, లేకపోతే అంచన బీకరంగా ఉండేదని పోలీసు అధికారులు ఆందోళన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న వెంటనే అగ్నిమాపక దళం హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకుని మంటలను అదుపు చేసింది. నెల్లూరు ఆర్డీవో మలోలా, రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసులు, రూరల్, బుచ్చి, కోవూరు సీఐలు గుంజివేణు, శ్రీనివాసులురెడ్డి, సుధాకర్‌రెడ్డిలు ఘటన వద్దేఉండి ప్రమాదాన్ని అంచనా వేశారు. అటు సీసీ కెమెరాలు కూడా మంటల్లో కాలిపోవడంతో ఆధారాలు లేకుండాపోయాయి. విద్యుత్‌సర్క్యూట్ వల్ల ఈ ప్రమాదం జరిగిందని అందరూ అనుమానిస్తున్నప్పటికీ ప్రభుత్వ నిబంధనలు ప్రకారం విద్యుత్ సరఫరా ఉండకూడదని తెలుస్తోంది. రూరల్ పోలీసులు కేసు కట్టి దర్యాప్తు చేస్తుండగా వాస్తవాలు తేలాల్సి ఉంది.

● ప్రమాణాలపై తనిఖీ చేయండి : ఎమ్మెల్యే

నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఘటనా స్థలికి చేరుకుని మృతుడు సుబ్బయ్య కుటుంబాన్ని ఓదార్చారు. ప్రభుత్వం నుంచి సహాయం అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. రూరల్లోని అన్ని టపాసుల దుకాణాల్లో ప్రమాణాలు ఉన్నాయా లేదా తనిఖీ చేయాలని అధి కారులకు సూచించారు. అనంతరం విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, రూరల్ మాజీ ఎంపీపీ బీరమణారెడ్డి తదితరులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.



పూర్తిగా కాలిపోయిన గోదాము, (ఇన్‌సెట్‌లో) మృతుడు సుబ్బయ్య (ఫైల్)

పల్లెలకు అందని వైద్యం

● గత ప్రభుత్వ హయాంలో ప్రచారానికే పరిమితం
● కూటమి సర్కార్‌పైనే ఆశలు

వరికుంటపాడు, సెప్టెంబరు 4: పల్లెల్లో మెరుగైన వైద్య సేవలు అందించాలనే సంకల్పంతో గత వైసీపీ ప్రభుత్వం విలేజ్ హెల్త్ క్లీనిక్‌లకు శ్రీకారం చుట్టింది. అయినా ఏళ్ల తరబడి భవనాలను నిర్మించలేక పోయింది. పలు గ్రామాల్లో నిలిచిన పనులు ప్రభుత్వం మారినా వెక్కిరిస్తూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో పల్లె ప్రజలకు వైద్యసేవలు ప్రచారానికే పరిమితమయ్యాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

వైసీపీ పాలనలో జిల్లావ్యాప్తంగా 497 భవనాలకు రూ. 85కోట్లను మంజూరు చేశారు. ఇంతవరకు కేవలం 140 భవనాలను మాత్రమే పూర్తిచేశారు. ఉదయగిరి నియోజకవర్గ పరిధిలోని 93 సచివాలయాల పరిధిలో తొలి విడతగా ఒక్కో కేంద్రానికి రూ. 17.50 లక్షలతో 82 కేంద్రాలను మంజూరు చేశారు. దీంతో చిన్నపాటి వైద్యసేవలకైనా సరే ఇతర దూర ప్రాంతాలకు పరుగులు తీయాల్సిన దుస్థితి లేకుండా పోతుందని పల్లె ప్రజలు సంబరపడ్డారు. అయితే 54 భవనాలు మాత్రమే పూర్తయ్యాయి. నిధులు విడుదల కాక పలు ప్రాంతాల్లో కాంట్రాక్టర్లు ఇంతవరకు ఆ భవనాలను అధికారులకు అప్పగించనేలేదు. దీంతో చేసేదేమిలేక సిబ్బంది స్వంత నిధులు వెచ్చించి అద్దె భవనాల్లో అరకొర వైద్య సేవలు అందిస్తున్నారు.

● బిల్లుల భయం

అప్పట్లో సకాలంలో బిల్లులు మంజూరవుతాయో, లేదో అన్న భయంతోనే కాంట్రాక్టర్లు పనులు చేపట్టేందుకు ముందుకు రాలేదు. దీంతో పలు ప్రాంతాల్లో పునాదుల్లోనే భవనాలు ఆగాయి. ఇదిలా ఉండగా, వైసీపీ నాయకులే కాంట్రాక్టర్ల అవతారం ఎత్తినా ఫలితం లేకుండా పోయింది. దీంతో పల్లె వైద్యం ప్రజలకు అందని ద్రాక్షాగానే మిగిలింది. ఈ క్రమంలో తమగోడు ఎవరికి చెప్పుకోవాలో తెలియని అయోమయ పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్న ప్రజలకు కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టడం వరంగా మారింది. ప్రస్తుత ప్రభుత్వం వైద్యరంగానికి పెద్దపీట వేస్తుందనే నమ్మకంతో ప్రజలు ఉన్నారు. ఆ దిశగా పాలకులు శ్రద్ధ తీసుకోవాలి.



కాంచెరువులో పునాదుల్లోనే నిలిచిన విలేజ్ హెల్త్ క్లీనిక్ భవనం

వాటర్‌ప్లాంట్ ప్రారంభం

చేజర్ల, సెప్టెంబరు 4 : మండలంలోని రెడ్డివారికండ్రికలో బుధవారం వాటర్‌ప్లాంటును ఎంపీపీ తూమాటి విజయభాస్కర్‌రెడ్డి ప్రారంభించారు. ధరణి సేవా సమితి ఆధ్వర్యంలో అరబిందో ఫార్మా ఫౌండేషన్ ఆర్థిక సాయంతో దీన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు బాలిరెడ్డి సుధాకర్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు కృష్ణారెడ్డి, కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వశాఖ పారిశ్రామిక అనుమతుల కమిటీ సభ్యుడు యల్లాల వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చవితి వేడుకలకు అనుమతులు తప్పనిసరి

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 4: గ్రామాల్లో చవితి వేడుకల నిర్వహణకు అనుమతులు తప్పనిసరని ఎస్‌ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అనుమతులకు సింగిల్‌విండో విధానం ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. విగ్రహాల ఏర్పాటు నుంచి నిమజ్జనం వరకు పోలీసులకు సహకరించాలన్నారు. శాంతియుతంగా ఉత్సవాలు నిర్వహించుకోవాలన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు.

నేడు వ్యవసాయ సహాయకులకు శిక్షణ

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 4: వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలోని సీతారామపురం, ఉదయగిరి, వరికుంటపాడు, దుత్తలూరు, మర్రిపాడు మండల రైతుసేవా కేంద్రాల్లో పనిచేస్తున్న గ్రామ వ్యవసాయ, ఉద్యాన, సెరికల్చర్ సహాయకులకు సామర్థ్యం పెంపుపై గురువారం స్థానిక స్త్రీశక్తి భవనంలో శిక్షణ నిర్వహించనున్నట్లు వ్యవసాయ సహాయ సంచాలకులు పీ.చెన్నారెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా వనరుల, కృషి విజ్ఞాన కేంద్రాల నుంచి శాస్త్రవేత్తలు హాజరై శిక్షణ ఇస్తారన్నారు. అన్నిమండలాల గ్రామ వ్యవసాయ సహాయకులు హాజరు కావాలని ఆయన తెలిపారు.

సీఐ బాధ్యతల స్వీకరణ



ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 4: సీఐగా ఎన్.వెంకటరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న వేల్పుల గిరిబాబు బదిలీపై నెల్లూరు వీఆర్‌కు వెళ్లారు. ఈ సందర్భంగా వెంకటరావు మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకోవడంతోపాటు ఫ్రెండ్లీ పోలీసుల విధానాన్ని అమలు చేస్తామన్నారు. అనంతరం ఆయన్ను పలువురు సిబ్బంది అభినందించారు.

భక్తి శ్రద్ధలతో జెండా ఉత్సవం

అనంతసాగరం, సెప్టెంబరు 4: స్థానిక మష్కూర్ అలిషా ఖాదరీ దర్గాలో బుధవారం మహ మ్మద్ ప్రవక్త జన్మించిన రబీవల్ అవ్వల్ నెల ప్రారంభం సందర్భంగా జెండా ఉత్సవాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈనెల 27, 28, 29 తేదీల్లో జరిగే గంధోత్సవ గోడపత్రికలను విడు దల చేశారు. దర్గాను విద్యుత్ దీపాలతో అలంకరించి, భక్తులకు అన్నదానం చేశా రు. కార్యక్రమంలో దర్గా నిర్వాహకులు సాని సాహెబ్, మజీద్ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ దీపాలతో మష్కూర్ అలిషా దర్గా

వరద బాధితులను ఆదుకోండి

సీతారామపురం, సెప్టెంబరు 4 : విజయవాడ వరద బాధితులను ప్రభుత్వంతోపాటు దాతలు ఆదుకోవాలని జనసేన పార్టీ ఉదయగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి భోగినేని కాశీరావు కోరారు. బుధవారం జనసేన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇప్పటికే మంత్రులు, ఎమ్మెల్యేలు ముంపు ప్రజలకు అండగా నిలవడం అభినందనీయమన్నారు. శుక్రవారం తుఫాన్ ఉందని వాతావరణ శాఖ హెచ్చరించినందున ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

వింజమూరు, సెప్టెంబరు 4: మండలంలోని గుండెమడగలకి చెందిన వేములపాటి మహేష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం విదితమే. ఆయన కుటుంబానికి సీనియర్ జర్నలిస్టు గడ్డం ఫకీరయ్య బుధవారం రూ.10వేలు ఆర్థిక సహాయం అందజేశారు. జర్నలిస్టు మాధవ, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఎస్‌ఐని కలిసిన టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు

వింజమూరు, సెప్టెంబరు 4 : కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఎస్‌ఐ వీరప్రతాప్‌ని మండల టీడీపీ ఎస్సీ నేతలు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువా, పూలమాలతో సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ మండలంలోని ఎస్సీ, ఎస్టీలపై దాడులను అరికట్టాలని, చట్టాలపై అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ సీనియర్ నాయకులు గంగపట్ల హజరత్తయ్య, మండల కన్వీనర్ గంగపట్ల వెంగయ్య పాల్గొన్నారు.

ఎస్‌ఐ మహబూబ్ సుభానికి సన్మానం

లింగసముద్రం, సెప్టెంబరు 4 : లింగసముద్రం ఎస్‌ఐ మహబూబ్ సుభానిని టీడీపీ తెలుగు యువత మండల ప్రధాన కార్యదర్శి బోడి సురేష్ బుధవారం పోలీసుస్టేషన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు శాలువా కప్పి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రతి ఒక్కరికి పని కల్పించాలి

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 4: ఉపాధి హామీ పథకంలో ప్రతీ ఒక్కరికి పని కల్పించాలని ఎంపీడీవో డీ ఈశ్వరమ్మ, ఏపీవో శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం స్థానిక స్త్రీశక్తి భవనంలో ఉపాధి సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. వారు మాట్లాడుతూ మండలంలో ప్రతిరోజు ఐదువేల మందికి పని కల్పించడమే లక్ష్యమన్నారు. ప్రతి పంచాయతీలో ఉపాధి పనులు ప్రారంభించాలన్నారు. హార్టికల్చర్ పథకంలో భాగంగా రైతులకు అవగాహన కల్పించి పండ్లతోటల విస్తీర్ణాన్ని పెంచాలన్నారు. మండలంలో పెండింగ్‌లో ఉన్న పక్కాగృహాల బేస్‌మెంట్ లెవల్ బిల్లుల ప్రతిపాదనలను పంపాలని తెలిపారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో ఈశ్వరమ్మ

మొక్కలు నాటి సంరక్షించాలి

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 4: పెరుగుతున్న వాయు కాలుష్య నివారణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటి సంరక్షించాలని మేకపాటి గౌతంరెడ్డి ప్రభుత్వ వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. బుధవారం కళాశాల ఆవరణలో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని, ప్రకృతిని కాపాడే దిశగా ప్రతి అడుగు ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్ ఎస్ అధికారి డాక్టర్ రమేష్, హాస్టల్ వార్డెన్ బాలచంద్ర, ప్రొఫెసర్లు నారాయణస్వామి, కిషన్‌తేజ, శోభ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న కళాశాల అసోసియేట్ డీన్ కృష్ణారెడ్డి

గురుకుల పాఠశాలకు మొక్కల అందజేత

సంగం, సెప్టెంబరు 4: స్థానిక బాలికల గురుకుల పాఠశాలకు బుధవారం సంగం గ్రామానికి చెందిన వేమా మల్లికార్జునరావు 30 పండ్ల మొక్కలను అందజేశారు. మామిడి, పనస, సీతాఫలం, జామ, కొబ్బరి మొక్కలను ప్రిన్సిపాల్ సుమతికి అందించారు. త్వరలో పాఠశాలకు సిమెంటు బల్లలను అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్ పాల్గొన్నారు.



మొక్కలు అందించిన దాత మల్లికార్జునరావు

ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 4: పట్టణానికి చెందిన ఉపాధ్యాయ దంపతులు జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. మండలంలోని బోడబండ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న షేక్ ఖాదర్‌బాషా, పట్టణంలో పనిచేస్తున్న ఆయన సతీమణి పఠాన్ సందానీబేగం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. వారి ఎంపిక పట్ల ఉపాధ్యాయులు, బంధుమిత్రులు వారికి అభినందనలు తెలిపారు.

సీతారామపురం : మండల పరిధిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా సీతారామపురం జడ్పీ ఉన్నత పాఠశాల నుంచి షేక్ అంజాద్‌బాషా, పంద్రంగి ఎంపీపీ స్కూల్ నుంచి బాలిరెడ్డి, పబ్బులేటిపల్లి ఎంపీపీ స్కూల్ నుంచి ఎం. మహేష్, గంగవరం ఎంపీపీ స్కూల్ నుంచి జే వెంకటేశ్వర్లు, రంగనాయుడుపల్లి ఉర్దూ స్కూల్ నుంచి షేక్ జరీనాబేగం ఎంపిక అయ్యారని ఎంఈవో మస్తాన్‌వలి తెలిపారు. వీరికి గురువారం మధ్యాహ్నం 2గంటలకు ఎంపీడీవో ఆఫీస్‌లో సన్మానం చేస్తామని తెలిపారు.

కందుకూరు : మండలంలోని పలుకూరు మండల పరిషత్ ప్రా థమిక పాఠశాలలో పనిచేస్తున్న పవని రమేష్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ సందర్భంగా బుధవారం రమేష్‌ను పాఠశాల ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు, గ్రామస్తులు సత్కరించారు.



కందుకూరు : రమేష్‌ను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

వలేటివారిపాలెం : మండలంలోని అయ్యవారిపల్లె ఎంపీయూపీ స్కూల్‌లో ఎస్‌జీటీ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ముతకని హనుమంతరావు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. ఈయనను ఎంఈవోలు రవికుమార్, మల్లికార్జునలతో పాటు సహోపాధ్యాయులు అబినందించారు.

పౌష్టికాహారంపై అవగాహన

సంగం, సెప్టెంబరు 4: మండలంలోని రాళ్లచెలికలో బుధవారం పౌష్టికాహార మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ చేశారు. గర్భిణీలు, బాలింతలు తీసుకో వాల్సిన పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీడీపీవో సునీలత, సూపర్‌వైజర్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.



సంగం : అవగాహన కల్పిస్తున్న సీడీపీవో సునీలత

అనంతసాగరం: మండలంలోని శంకరనగరంలో పోషకాహార మాసోత్సవం జరిగింది. గర్భిణీలు తీసుకోవల్సిన జాగ్రత్తలు, ఆహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీడీపీవో పద్మావతి పాల్గొన్నారు.

కావలి రూరల్ : గర్భిణులు, బాలింతలు అంగన్వాడీ కేంద్రాల్లో ఇచ్చే పౌషికాహారంతో ఆరోగ్యంగా ఉంటారని రుద్రకోట సెక్టార్ సూపర్‌వైజర్ కృపమ్మ పేర్కొన్నారు. కావలి మండలం రుద్రకోట బీసీ సెంటర్‌లో పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు రాజేశ్వరి, దయమ్మ, అరుణ, సుకన్య, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

లింగసముద్రం : మండలంలోని మొగిలిచెర్ల పంచాయతీ నారసింహాపురం అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార మాసోత్సవాలు నిర్వహించారు. గర్భిణులకు సీమంతం నిర్వహించారు. కార్యక్రమంలో లింగసముద్రం సెక్టార్ అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రాధాదేవి, అంగన్‌వాడీ కార్యకర్తలు మార్తమ్మ, ప్రసన్న, సులోచన, శ్రీదేవి, ఓబులమ్మ పాల్గొన్నారు.



లింగసముద్రం : గర్భిణులకు సీమంతం నిర్వహిస్తున్న సూపర్‌వైజర్ రాధాదేవి

వలేటివారిపాలెం : మండలంలోని నూకవరం, పోకూరు అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. గర్భిణులు, బాలింతలకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీత అవగాహన కల్పించారు. అనంతరం పిల్లలను బరువు వేసి, అక్షరభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ స్కూల్ ఉపాధ్యాయిని సుధారాణి, ఏఎన్‌ఎం అనీత, అంగన్‌వాడీ కార్యకర్తలు ధనలక్ష్మీ, అలేఖ్య పాల్గొన్నారు.

బిట్రగుంట : బోగోలు మండలం సీఆర్‌పాలెం, ముంగమూరు, కోవూరుపల్లి పంచాయతీ అంబేడ్కర్ నగర్ అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. గర్భిణులకు సీమంతం, పిల్లలకు అన్నప్రాసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో సౌజన్య, సూపర్‌వైజర్లు సుభాషిణి, కోటేశ్వరి, సుప్రజ, హెచ్‌ఎం విజయలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

మురుగు కాలువ ఏర్పాటు

కావలి రూరల్, సెప్టెంబరు 4: కావలి పట్టణం వెంగయ్యగారిపాలెంలో బుధవారం ఎక్స్‌కవేటర్‌తో మురుగు నీటి కాలువ తవ్వించారు. ఆంధ్రజ్యోతి దినపత్రికలో ఈనెల 1వ తేదీన కాలువల ఆక్రమణ.. నిలిచిన మురుగు అనే కథనం ప్రచురితమైంది. గత ప్రభుత్వంలో వైసీపీ నేతలు పంట కాలువలు ఆక్రమించారు. పట్టణం నుంచి వచ్చే వర్షపు నీరు, మురుగు నీరునీటిని పొలాలకు మళ్లించారు. దీంతో ఆ ప్రాంతంలోని పట్టాభూముల యజమానులు ఇటు కాలువ లేకుండా మురుగు నీరు దారి మళ్లించడమేమిటని కాలువ కొంత భాగం పూడ్చివేశారు. దీంతో మురుగు నీరు మొత్తం కాలువలో నిల్వచేరి పొంగి పొర్లు తుండటంతో దుర్గంధం భరించలేక రోగాల పాలవుతున్నామని స్థానికులు వాపోయారు. ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి స్పందించిన మున్సిపల్ కమిషనర్ జి.శ్రావణ్ కుమార్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి ఎక్స్‌కవేటర్‌తో మురుగు నీరు కాలువ తీయించడంతో పాటు తూములు వేయించి మురుగు నీటిని కావలమ్మ గుంటకు దారి మళ్లించారు. కమిషనర్ సత్వరం స్పందించి కాలువ ఏర్పాటు చెయ్యటం పట్ల స్థానికులు కమిషనర్‌కు, ఆంధ్రజ్యోతికి కృతజ్ఞతలు తెలిపారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



వెంగయ్యగారిపాలెంలో ఎక్స్‌కవేటర్‌తో తవ్వుతున్న కాలువ

కందుకూరు సబ్ కలెక్టరుగా శ్రీపూజ



కందుకూరు, సెప్టెంబరు 4: కందుకూరు సబ్ కలెక్టరుగా తిరుమణి శ్రీపూజ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం ప్రాంతానికి చెందిన శ్రీపూజ 2022 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందినవారు. ప్రొబేషన్ కాలం పూర్తయిన వెంటనే తొలి పోస్టింగ్‌గా కందుకూరు సబ్ కలెక్టరుగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా అధికారులు, ఉద్యోగులు సబ్‌కలెక్టర్‌ను కలిసి అభినందనలు తెలిపారు.

● విజిలెన్స్ ఎస్పీగా రాజేంద్రకుమార్

నెల్లూరు,(క్రైం) : జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీగా వీఆర్ రాజేంద్రకుమార్‌ను నియమిస్తూ ఆ శాఖ డీజీ హరీష్‌కుమార్ గుప్తా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాజేంద్రకుమార్ గతంలో జిల్లాలో రైల్వే డీఎస్పీగా, సీఐడీ ఏఎస్పీగా పనిచేశారు. ఆయన రెండు రోజుల్లో బాధ్యతలు స్వీకరించనున్నారు.

మున్సిపల్ కమిషనర్ అనూష బాధ్యతల స్వీకరణ

కందుకూరు, సెప్టెంబరు 4: కందుకూరు మున్సిపల్ కమిషనర్‌గా కొర్రపాటి అనూష బుధవారం బాధ్యతలు స్వీకరించారు. తెనాలి నగర కార్పొరేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఆమె బదిలీపై వచ్చారు. ఆమెను టీడీపీ పట్టణ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు ముచ్చు శ్రీను, వడ్డెళ్ల రవిచంద్ర, చిలకపాటి మధు, బెజవాడ ప్రసాదు, షేక్ రఫీ, షేక్ నలాం, సవిడిబోయిన వెంకటకృష్ణ, మహర్షి శ్రీను తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.



కమిషనర్‌ను అభినందిస్తున్న టీడీపీ నాయకులు

అధికారులు తప్పు చేసి గిరిజన ఉద్యోగిని బలి చేస్తారా?

● యానాదుల సంక్షేమ సంఘం నేత పెంచలయ్య

కావలి, సెప్టెంబరు 4: కావలి తహసీల్దారు కార్యాలయంలో ఆఫీస్ సబార్డినేట్‌గా పనిచేస్తున్న గిరిజన ఉద్యోగి చలంచర్ల సాయిబాబా ఉద్యోగ విరమణ విషయంలో అధికారులు తప్పుచేసి ఆ ఉద్యోగిని బలిచేస్తారా అని యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసీ పెంచలయ్య ప్రశ్నించారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయకపోతే ఈ నెల 9వ తేదీ నుంచి కావలి ఆర్డీవో కార్యాలయం వద్ద ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కావలి జర్నలిస్ట్‌క్లబ్‌లో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో బాధిత ఉద్యోగి సాయిబాబాతో కలిసి యానాదుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్టాబ్లిష్ క్లర్క్ ఆధీనంలో ఉండే ఎస్‌ఆర్‌లో వివరాలను ఇతరులు దిద్దేందుకు ఎలా అవకాశం ఉంటుందని ప్రశ్నించారు. పుట్టిన తేదీన దిద్ది రెండేళ్ల ఎక్కువగా గిరిజన ఉద్యోగి ఉద్యోగంలో కొనసాగాడని గిరిజన ఉద్యోగిపై పోలీసు కేసు పెట్టి ఆయనను బలిచేయాలని ప్రయత్నించడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో బాధిత ఉద్యోగి సతీమణి, మున్సిపల్ మాజీ చెర్‌పర్సన్ చలంచర్ల దేవసేన, యానాదుల సంక్షేమ సంఘం నాయకులు మానికల మురళి, మాకాని రవీంద్రబాబు, చెంబేటి ఉష, తిరువీధి సతీష్‌చంద్ర, చలంచర్ల కలుగోలమ్మ, కత్తి ఆదిశేషయ్య తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర ధరలు తగ్గించాలని సీపీఐ ధర్నా

కావలి, సెప్టెంబరు 4: నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించి ప్రజాపంపిణీ వ్యవస్థను పటిష్టపరచాలని సీపీఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య తెలిపారు. సీపీఐ జాతీయ సమితి పిలుపు మేరకు బుధవారం కావలి సీపీఐ ఆధ్వర్యంలో స్థానిక బ్రిడ్జి సెంటర్‌లో ధర్నా చేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి దామా అంకయ్య మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకులు బలిజేపల్లి వెంకటేశ్వర్లు, దమ్ము దర్గా బాబు, పీ బోసు, కే. నరసింహారావు పాల్గొన్నారు.



బ్రిడ్జి సెంటర్‌లో ధర్నా చేస్తున్న సీపీఐ నేతలు

సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు తీసుకోవాలి

కావలిటౌన్, సెప్టెంబరు 4: సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు తీసుకోవాలని సీపీఎం నేతలు బుధవారం ఆర్డీవో శీనానాయక్‌కు వినతిపత్రం అందించారు. ఆ పార్టీ పట్టణ కార్యదర్శి పీ.పెంచలయ్య మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెంది అనేకమంది జ్వరం, జలుబు, దగ్గు, వంటి నొప్పుల బారినపడి బాధపడుతున్నారన్నారు. పట్టణంలో పారిశుధ్యం మెరుగుకు చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మధుసూదన్‌రావు, కృష్ణయ్య, తిరుపాల్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

గృహనిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేసుకోవాలి

కందుకూరు, సెప్టెంబరు 4: హౌసింగ్ పథకం కింద గృహాలు మంజూరైన లబ్ధిదారులు త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని హౌసింగ్ డీఈఈ సీహెచ్ శ్రీనివాసరావు కోరారు. స్థానిక ఎంపీడీవో వెలమూరి వెంకటేశ్వరరావుతో కలిసి బుధవారం ఆయన మండలంలోని కొండముడుసుపాలెంలో లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ వర్క్‌ఇన్‌స్పెక్టర్ ఫయాజ్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఇమ్రాన్ పాల్గొన్నారు.

పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధుల మంజూరు

వలేటివారిపాలెం, సెప్టెంబరు 4 : మండలంలోని 21 పంచాయతీలకు 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రెండవ విడతలో రూ.51,26,013 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరైనట్లు ఎంపీడీవో శేషబాబు, ఈఓఆర్డీ సుమంత్ ఓ ప్రకటనలో తెలిపారు. అమ్మపాలెం రూ.1,8,416, అంకభూపాలపురం రూ.2,55,996, అయ్యవారిపల్లె రూ.2,29,343, బడేవారిపాలెం రూ.2,33,721, చుండి రూ.3,80,098, జమీన్‌ఉప్పలపాడు రూ.1,06,416, కాకుటూరు రూ. 2,03691, కళవళ రూ.3,05482, కొండారెడ్డిపాలెం రూ.40,136, కొండసముద్రం రూ.1,63,089, లింగపాలెం రూ.1,88,518, నలదలపూరు రూ. 2,46,468, నేకునాంపురం రూ.1,66,677, నూకవరం రూ.75,947, పోకూరు రూ.5,41,461, పోలినేనిచెరువు రూ.2,85,933, పోలినేనిపాలెం రూ.2,63,960, శాఖవరం రూ.3,71,539, శామీరపాలెం రూ.2,42,430, శింగమనేనిపల్లె రూ.1,84,352, వలేటివారిపాలెం రూ.4,59,369 మంజూరైనట్లు వారు తెలిపారు.

1000 వినాయక ప్రతిమలు పంపిణీ చేస్తాం

కావలిటౌన్, సెప్టెంబరు 4: పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు మొలిసే మట్టి వినాయక ప్రతిమలు పంపిణీకి సిద్ధం చేశామని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ అళహరి సుధాకర్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో పంపిణీకి సిద్ధం చేసిన వినాయక ప్రతిమలను సుధాకర్ ప్రదర్శించి మాట్లాడుతూ 1000 వినాయక ప్రతిమలు పంపిణీకి రంగం సిద్ధం చేశామన్నారు. సుధీర్, శ్రీను, లక్ష్మీ పాల్గొన్నారు.

కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు

వలేటివారిపాలెం, సెప్టెంబరు 4 : మండలంలోని రోళ్లపాడు, బడేవారిపాలెం, వలేటివారిపాలెం, తూర్పుపోలినేనిపాలెం, వీరన్నపాలెం, నేకునాంపురం, కాకుటూరు గ్రామాలలో విద్యుత్ లోఓల్టేజి సమస్యను అధిగమించేందుకు విద్యుత్ ఏఈ తాటికొండ మధుబాబు బుధవారం కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయించారు.

లైన్‌మన్‌ను నియమించాలి : మండలంలోని చుండి గ్రామానికి రెగ్యులర్ విద్యుత్ లైన్‌మన్‌ను నియమించాలని గ్రామస్థులు విద్యుత్ ఏఈ మధుబాబును కోరారు. గ్రామంలో లైన్‌మన్ లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు.

ఎస్‌ఐలుగా పదోన్నతి పొందిన వారికి సత్కారం

కావలిటౌన్, సెప్టెంబరు 4: ఎస్సైలుగా పదోన్నతి పొందిన జానికిరామిరెడ్డి, మనోహర్‌రెడ్డిలను బుధవారం స్థానిక సాయిబాబా మందిర ప్రాంగణంలో బెస్ట్ వాకర్స్ అధ్యక్షుడు, విశ్రాంత ఎస్సై టీ శేషయ్య ఆధ్వర్యంలో శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. వాకర్స్ సభ్యులు టంగుటూరి ప్రసాద్, వెంకటేశ్వర్లు, రమేష్, కే.శ్రీనివాసులు, గౌస్‌బాషా, హరి, కృష్ణ పాల్గొన్నారు.



జానకిరామిరెడ్డి, మనోహర్‌రెడ్డిలను సత్కరిస్తున్న బెస్ట్ వాకర్స్

వరద సహాయక కార్యక్రమాల్లో ఉదయగిరి, కావలి ఎమ్మెల్యేలు

వింజమూరు/ కావలి, సెప్టెంబరు 4 : విజయవాడలోని వరద సహాయ కార్యక్రమాల్లో ఉదయగిరి, కావలి ఎమ్మెల్యేలు కాకర్ల సురేష్, దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి పాల్గొన్నారు. బుధవారం విజయవాడ కార్పొరేషన్ 7వ డివిజన్‌లో కాకర్ల, 17వ డివిజన్‌లో జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడితో కలసి దగుమాటి పర్యటించారు. వరద బాధితులకు అందుతున్న సేవలను తెలుసుకున్నారు. ఈ విపత్తు నుంచి ప్రజలను కాపాడేందుకు సీఎం చంద్రబాబు అహర్నిశలు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. కాకర్ల వెంట మాలేపాటి చైతన్య, మధురెడ్డి ఉన్నారు.

చికిత్స పొందుతూ టీడీపీ నేత మృతి

కలువాయి, సెప్టెంబరు 4 : మండలంలోని వెరుబొట్ల పల్లి రోడ్డులో జరిగిన ప్రమాదంలో గాయపడి, చికిత్స పొందుతూ కేశమనేనిపల్లి గ్రామ సీనియర్ టీడీపీ నాయకుడు తలపనేని శివరామయ్య బుధవారం మృతి చెందారు. గత శనివారం ఆయన రోడ్డు దాటుతుండగా ఆర్టీసీ బస్సు ఢీకొని ప్రమాదానికి గురయ్యారు. శివరామయ్య మృతి వార్త టీడీపీ శ్రేణులను దిగ్భ్రాంతికి గురిచేసింది. ఆయన మృతి పట్ల మండల టీడీపీ అధ్యక్షుడు గోనుగుంట వెంకటేశ్వర్లు నాయుడు సంతాపం తెలిపారు.



శివరామయ్య (ఫైల్)

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

లింగసముద్రం, సెప్టెంబరు 4 : మండలంలోని వీఆర్ కోట గ్రామ సమీపంలోని మన్నేరు వాగులో ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. బుధవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో ఎస్సై మహబూబ్ సుభాని సిబ్బందితో కలసి దాడులు నిర్వహించి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఈ - పంట నమోదు పూర్తి చేయాలి

వలేటివారిపాలెం, సెప్టెంబరు 4 : ఈ నెల 15వ తేదీ లోపు ఈ పంట నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని కందుకూరు వ్యవసాయ సహాయ సంచాలకురాలు డాక్టర్ పి.అనసూయ తెలిపారు. వలేటివారిపాలెం రైతు సేవా కేంద్రంలో బుధవారం ఏవో హేమంత్‌భరత్‌కుమార్ అధ్యక్షతన పంట కోత ప్రయోగాలపై శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో అన్ని గ్రామ సచివాలయాల వ్యవసాయ, ఉద్యానశాఖ సహాయకులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి

కావలి, సెప్టెంబరు 4: జర్నలిస్టుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని ఆంధ్రప్రదేశ్ జర్నలిస్టుల యూనియన్(ఏపీజేయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాదంశెట్టి శేఖర్‌బాబు తెలిపారు. కావలి జర్నలిస్ట్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కావలి డివిజన్‌లో యూనియన్ బలోపేతం చేసేందుకు 5గురు సభ్యులను నియమించారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు మనపాటి చక్రవర్తి, ప్రధాన కార్యదర్శి గర్రె వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలి

కందుకూరు, సెప్టెంబరు 4: రానున్న వర్షాల సీజన్‌లో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున అన్ని గ్రామాల్లో రెండు రోజుల్లోగా ప్రత్యేక పారిశుధ్య చర్యలు చేపట్టాలని ఎంపీడీవో వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో కోరారు. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సూచనలకు అనుగుణంగా ప్రతి గ్రామంలో ఓవర్‌హెడ్ ట్యాంకులు, తాగునీటి వనరులను శుభ్రపరిచి క్లోరినేషన్ చేయించాలని, దోమల నిర్మూలన చర్యలలో భాగంగా ఫాగింగ్, మురుగు నీరు నిల్వ ఉన్న ప్రాంతాలలో లార్వాలను నిర్మూలించే మందు పిచికారి కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. వ్యర్థాలు, చెత్తకుప్పలను తొలగించటంతో పాటు మురుగు కాల్వలను శుభ్రం చేయించాలన్నారు.

టీఆర్‌ఆర్‌లో ఇండక్షన్ ప్రోగ్రామ్

కందుకూరు, సెప్టెంబరు 4: స్థానిక టీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరంలో చేరిన విద్యార్థులకు బుధవారం ఇండక్షన్ ప్రోగ్రామ్ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు ఎం.రవికుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టరు ఏడుకొండలు నరేంద్ర, ఇండక్షన్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ కే.కరుణకుమార్, డాక్టరు కే.సుజాత, తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానంపై అవగాహన

కందుకూరు, సెప్టెంబరు 4: జాతీయ నేత్రదాన పక్షోత్సవాలలో భాగంగా బుధవారం కందుకూరు ఏరియా ఆసుపత్రిలో నేత్రదానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. సూపరింటెండెంట్ డాక్టరు శకుంతల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నేత్రవైద్యురాలు డాక్టరు సౌమ్యస్రవంతి నేత్రదానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా 30 మంది మరణానంతరం నేత్రదానంకు ముందుకొచ్చి అంగీకారపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో డాక్టరు ఇంద్రాణి, డాక్టరు వెంకటరెడ్డి, డాక్టరు కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణక్రాక మాజీ సర్పంచు మృతి

జలదంకి, సెప్టెంబరు 4: బ్రాహ్మణక్రాక మాజీ సర్పంచు వంటేరు రఘురామిరెడ్డి అనారోగ్యంతో నెల్లూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతి చెందారు. ఈయన మృతికి ఆయన సోదరులు మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ వంటేరు జయచంద్రారెడ్డితో పాటు అన్ని రాజకీయపార్టీల మండల నాయకులు తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

వరద బాధితులను ఆదుకోవాలి

బిట్రగుంట, సెప్టెంబరు 4: విజయవాడ పరిసర ప్రాంతాల్లోని వరద బాధితులను ఆదుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి తుమ్మల వెంకయ్య అన్నారు. బోగోలు మండలం ఇబ్రహీంపేటలోని సీపీఎం కార్యాలయంలో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ వరదలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు రూ.25లక్షల ఆర్థిక సహాయం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి చల్లా నరహరి, షేక్.నూరుద్దీన్, బాలనరసింహం, శ్రీనివాసులు, క్రిష్ణయ్య, అహ్మద్‌బాషా, కార్తీక్ పాల్గొన్నారు.